తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:56, Issue: 08
January - 2026, Price Rs.20/-.

జనవరి 2026
వెల రూ. 20/-
పుటలు - 56



## తిరుమల, శ్రీ మలయప్పస్వామివారి సప్తవాహనసేవలు

రథసప్తమి (25-01-2026)

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.



# శ్రీవారి ఆర్జితసేవలు, తిరుమల

## ఆర్జితసేవలు / ఉత్సవాలు

| సంఖ్య | సేవ/ ఉత్సవం | సేవాసమయం | టిక్కెట్టు ధర | వ్యక్తి ప్రవేశం |
|---|---|---|---|---|
| | **నిత్య సేవలు** | | | |
| 1. | సుప్రభాతం | ఉ. 3-00 గం॥ | రూ. 120-00 | 1 |
| 2. | తోమాలసేవ (మంగళ, బుధ, గురు) | ఉ. 3-30 గం॥ | రూ. 220-00 | 1 |
| 3. | అర్చన (మంగళ, బుధ, గురు) | ఉ. 4-30 గం॥ | రూ. 220-00 | 1 |
| | **నిత్య ఉత్సవములు** | | | |
| 4. | కల్యాణోత్సవం | మ. 12-00 గం॥ | రూ. 1,000-00 | 2 |
| 5. | డోలోత్సవం (ఊంజల్‌సేవ) | మ. 2-00 గం॥ | రూ. 500-00 | 1 |
| 6. | ఆర్జిత బ్రహ్మోత్సవం | మ. 3-00 గం॥ | రూ. 500-00 | 1 |
| 7. | సహస్రదీపాలంకరణసేవ | సా. 5-00 గం॥ | రూ. 500-00 | 1 |
| | **వారపు సేవలు** | | | |
| 8. | అష్టదళపాదపద్మారాధనం (మంగళవారం) | ఉ. 9-30 గం॥ | రూ. 1,250-00 | 1 |
| 9. | తిరుప్పావడసేవ (గురువారం) | ఉ. 7-00 గం॥ | రూ. 850-00 | 1 |
| 10. | అభిషేకం (శుక్రవారం) | ఉ. 4-30 గం॥ | రూ. 750-00 | 1 |
| | **వార్షిక సేవలు / ప్రత్యేకసందర్భసేవలు** | | | |
| 11. | తెప్పోత్సవం (ఫిబ్రవరి - మార్చి) | సా. 7-00 గం॥ | రూ. 500-00 | 1 |
| 12. | వసంతోత్సవం (మార్చి - ఏప్రిల్) | మ. 2-00 గం॥ | రూ. 300-00 | 1 |
| 13. | జ్యేష్ఠాభిషేకం (అభిదేయకఅభిషేకం) (జూన్) | ఉ. 9-00 గం॥ | రూ. 400-00 | 1 |
| 14. | పవిత్రోత్సవం (ఆగష్టు) | ఉ. 9-00 గం॥ | రూ. 2,500-00 | 1 |
| 15. | పుష్పయాగం (అక్టోబరు - నవంబరు) | ఉ. 9-00 గం॥ | రూ. 700-00 | 1 |

టోల్ ఫ్రీ : 155257
వాట్సప్ ఫీడ్‌బ్యాక్ : 9399399399
ఈ-మెయిల్ : helpdesk@tirumala.org

పై సేవలకు సంబంధించి ఆన్‌లైన్‌లో మాత్రమే టిక్కెట్లు బుక్ చేసుకోవలసి ఉంటుంది.

ఇతర వివరాలకు తి.తి.దే.వెబ్‌సైట్: www.ttdevasthanams.ap.gov.inను సంప్రదించగలరు.

గమనిక: పై తెల్పిన ఆర్జితసేవల వివరాలు తిరుమల తిరుపతి దేవస్థానంవారి నిర్ణయంమేరకు మార్పబడుతూంటాయి. భక్తులు గమనించగలరు.



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యన్తి తవాహితాః ।**
**నిన్దన్తస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-36వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** తవ= నీయొక్క; అహితాః= శత్రువులు; తవ= నీయొక్క; సామర్థ్యమ్= సామర్థ్యమును; నిన్దన్తః= దూషించుచున్నవారై; బహూన్= అనేకములైన; అవాచ్య వాదాంశ్చ= అనరాని మాటలనుగూడ; వదిష్యన్తి= పలకగలరు; తతః= అంతకంటె; దుఃఖతరమ్= మిగుల దుఃఖకరమైనది; కిమ్ ను= ఏమి కలదు?

**భావం:** (ఇంతియేకాక అత్తటి) శత్రువులు నీయొక్క సామర్థ్యమును దూషించుచు పెక్కు దుర్భాషణములను గూడ పలుకగలరు. దానిని మించిన దుఃఖమేమి కలదు?

## సంసారబంధమర్మమేంటో తెలుసుకో నరుడా...!!

ఇట్టె సంసారి - కేదియు లేదాయ
తట్టువడుటే కాని - దరిచేర లేదు.

ములిగి భారపు మోపు- మోఁచేటి వాఁడు
అలసి దించుకొను - నాడాడను,
అలరు సంసారికి నదియు లేదాయ
తొలఁగని భారమెందును దించలేదు.

తడని వేఁపచేఁదు - త్రావెడి వాఁడు
ఎడయెడఁ దినుఁ దీ - పేమైనను,
అడరు సంసారికి నదియు లేదాయ
కడుఁ జేఁదె కాని యెక్కఁడ దీపు లేదు.

దొరకొని హేయమే - తోఁడేటి వాడు
పరిఠవించును మేనఁ - బరిమళము,
ఆరిది సంసారికి - నదియు లేదాయ
ఇరవు వెంకటపతి - నెఱుఁగ లేఁడు.

**సంపుటం 04 - అధ్యాత్మిక సంకీర్తన 26**



సంసారంలో ఉన్నవానికి ఎట్టి సుఖమును లేదు. అతడెంతసేపటికిని ఏదో ఒక కారణంచే బాధపడుతుంటాడే కాని సంసారసాగరం యొక్క తీరం చేరటానికి వానికి వీలు చిక్కటం లేదు.



శ్రమపడి మూలిగి బరువైన మోపు మోసేవాడు అలసిపోయినప్పడెల్ల అక్కడక్కడ తన మోపు దింపుకొని విశ్రాంతి గైకొంటాడు. కాని సంసారికి మాత్రము తన సంసారభారం దించుకొను వెరవు లేదు. అది తొలగద్రోయగ రాని బరువై వానిపై బడి ఉన్నది, కావున దానిని జీవితాంతము దించుకొనుట కవకాశం లేకున్నది.

వేప చేదు త్రాగువాడు చేదుకు విసిగినప్పడెల్ల కొంత తీపితో తృప్తి నొందగలడు. కాని సంసారికి అలా చేయటానికి అనువు గాకున్నది. సంసారంలో అనుభవమునకు వచ్చు పదార్థములెల్ల చేదే గాని అందెక్కడను తీపన్నది లేనే లేదు.

రోతపడి త్యజింపదగిన వస్తువులను తోడి శుభ్రపరచువాడు దుర్గంధముతో గూడిన తన శరీరమును కడిగి ఎడనెడ సుగంధద్రవ్యములను పూసికొనగలడు. కాని సంసారికి హేయమైన తన బంధమును వదలించుకొనుట కవకాశము లేదు. వాడు ప్రకృతికి బద్ధుడవటంవల్ల సమస్త సృష్టి కాధారమైన శ్రీవేంకటేశ్వరుని తెలియజాలకున్నాడు అంటూ అన్నమయ్య సంసారి జీవితాన్ని గురించి పై కీర్తనలో ఉద్బోధించాడు. - కీ.శే. డా॥ సముద్రాల లక్ష్మణయ్య.

29-01-2026న భీష్మఏకాదశి సందర్భంగా...

# భీష్మబోధన

- శ్రీ చెల్లపిల్ల సన్యాసిరావు, 70326 06821

ధర్మరాజుకు భీష్ముడు బోధించినవాటిలోని కొన్ని ధర్మనీతులను తెలుసుకుందాం.

రాజు దర్పాన్ని ప్రదర్శించరాదు. దాన్ని విడనాడాలి. ఓర్పు వహించడం సర్వశ్రేయస్కరం. శరణాగతరక్షణ ముఖ్యం. రాజుకు జాగ్రత్త చాలా అవసరం. అవినీతినెరుగని అధికారులను నియమించినయెడల రాజ్యధనాగారానికి, ధనం కొరత ఏర్పడదు. ప్రజలను కన్నతండ్రివలె చూచుకోవాలి. వారి ఆదాయంలో ఆరవపాలు పన్నుగా స్వీకరించాలి.

యుద్ధంలో క్షతగాత్రులైనవారి పరిరక్షణం గావించాలి. యజ్ఞయాగాదులను ఆచరించాలి. బ్రాహ్మణోత్తములను, గురువులను, తల్లిదండ్రులను భక్తితో సేవించి ఆరాధించాలి.

బ్రాహ్మణులకు ఇంద్రియనిగ్రహం, వేదాధ్యయనం, స్వధర్మాచరణంవంటివి ప్రధానధర్మాలు. బ్రహ్మచారికి గురుశుశ్రూష, వేదాధ్యయనం, భిక్షాన్నభోజనం, ఇంద్రియనిగ్రహం, సకలప్రాణులహితవును కోరటం ముఖ్యం. కరుణ, సత్యవాక్కు, ఓర్మి, సజ్జనసాంగత్యం, అతిథిసత్కారం, పితృదేవతారాధన, సర్వప్రాణిహితవు కోరటం ముఖ్యం.

భయాందోళితులైన సజ్జనుల సంరక్షణమే అత్యుత్తమ ధర్మం. ఆధ్యాత్మికచింతన, దైవభక్తి కడదాక కొనసాగించడంలోనే జీవనసాఫల్యత చేకూరుతుంది.

పరాక్రమం, సత్యం, సత్కర్మలు చేసే జ్ఞానం, భక్తి గాంభీర్యం వ్యక్తిత్వంగా గల వ్యక్తి ఏ కులమువాడైననూ యోగ్యుడే. సత్యం పలకడం సర్వధర్మాలకు మూలమని, అసత్యం పాతకమని, జీవులకు మేలు చేసే అసత్యముకూడ ధర్మమేయని, జీవులను బాధించు సత్యమైనను పాపములే అని తెలుసుకోవాలి.

ఒకవేళ పాపం చేసినట్లైతే పశ్చాత్తాపం చెందాలి. ధర్మబుద్ధితో జీవించడం, ఇతరులకు మేలు చేయడంవంటి కార్యములద్వారా ఆ పాపం నశిస్తుంది.

లోభం పాపాలన్నిటికీ మూలం. దానివలన కామం, క్రోధం, దైన్యంవంటివి పెరుగుతాయి. ధర్మాలన్నిటిలో 'దయ' గొప్ప గుణం.

శీలం, మైత్రి, కరుణ, అనాసక్తి, ఓర్మి మున్నగు సద్గుణాలన్నీ 'దయ'లోని అంతర్వాహినులే. ఇది ముక్తిని కలిగిస్తుంది. అజ్ఞానంవలన 'మోహం' పుడుతుంది. అధర్మాన్ని వదిలితే 'మోహం' నశిస్తుంది.

కులము, విద్య, ధనంవలన మదం పుడుతుంది. జ్ఞానంతో దానిని తొలగించుకోవాలి. మాత్సర్యం కలిగితే దానిని సాధుజన-గురుజనసేవలద్వారా తొలగించుకోవాలి.

ధర్మార్థకామమోక్షములనే పురుషార్థాలలో ధర్మం ఉత్తమం, ధనం మధ్యమం, కామం అధమం, మోక్షం ఉత్తమమైనవి. ఇతరులు తనకి బాధ కలిగిస్తే తానెలా బాధపడతాడో, అట్టి బాధను తను ఇతరులకు కలిగించకుండా ఉండడమే ధర్మములన్నిటిలో పరమధర్మం. ఇవి సమస్తమానవాళికి సర్వదా శిరోధార్యములు, ఆచరణయుక్తములు.




అన్నీ తెలిసినా కూడా ఇంకా తెలుసుకోవాలన్న జిజ్ఞాస కలవాడే ఉత్తముడు

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 56 జనవరి, 2026 సంచిక : 08



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

గౌరవ సంపాదకులు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-సంపాదకులు,
ప్రధాన సంపాదకులు (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉప సంపాదకులు
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

ముద్రాపకులు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
ప్రధానసంపాదకులు-0877-2264363
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
chiefeditortpt@gmail.com;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777
2233333

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| భీష్మబోధన | శ్రీ చెల్లపిళ్ల సన్యాసిరావు | 04 |
| ఆదిదైవం ఆదిత్యం | శ్రీ దావులూరి రామకృష్ణ | 07 |
| సంక్రాంతి | శ్రీ వై.సుబ్రమణ్యం | 09 |
| సందేహాలు-సమాధానాలు | కీ.శే. డా॥ ఎస్.బి.రఘునాథాచార్య | 11 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 13 |
| చాణక్యనీతి | డా॥ మైలవరపు లలితకుమారి | 16 |
| గోవర్ధనగిరిధారీ గోవిందా! | శ్రీమతి సింగరాజు కృష్ణకుమారి | 18 |
| పింగళి సూరన వర్ణించిన తిరుమల | శ్రీ యలమర్తి మధుసూదన | 20 |
| గరుడతీర్థము | శ్రీ కాటం వీరాస్వామి | 22 |
| తెన్ తిరుప్పేరై (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| శ్రీ ఆండాళ్ 'నీరాట్టోత్సవం' | | 26 |
| కలగంటి కలగంటి.. (వారణం ఆయిరం) | డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్ | 31 |
| లక్ష్మీగడప | శ్రీమతి దణ్యంరాజు జ్యోతిర్మణి | 34 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 36 |
| యువత - నైతికత | శ్రీ యం.రవితేజ | 37 |
| కర్మలనుండి విముక్తి | శ్రీ పుల్లా వేంకటేశ్వర్లు | 40 |
| స్వామి కరుణాకటాక్షం | శ్రీ ఎద్దుల శ్రీనివాసరెడ్డి | 41 |
| సంగీతరసామృతం | శ్రీ ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్ | 42 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 44 |
| ఓర్పుతోనే మహాయోగమొస్తుంది | శ్రీమతి ఆసూరి ఉషారాణి | 47 |
| ధర్మసూక్ష్మం!! (చిత్రకథ-1) | కథలు: మొలకా ఉత్తరఫల్గుణి | 48, 49 |
| పశ్చాత్తాపం!! (చిత్రకథ-2) | తమిళమూలం: శ్రీమతి శ్రీనిధి<br>చిత్రాలు: శ్రీ కమల కణ్ణన్ | |
| ఇష్టంగా పెడితేనే తినాలి (వేమన శతకం) | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 50 |
| క్విజ్ | | 51 |
| బాలవినోదం | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| శ్రీపదకేళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : సప్తవాహనసేవల్లో శ్రీమలయప్పస్వామివారు, తిరుమల
వెనుకచిత్రం: శ్రీ పారువేట ఉత్సవమూర్తిగా శ్రీమలయప్పస్వామివారు, తిరుమల



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# సూర్యసంక్రాంతి

**ఆదిత్యానా మహం విష్ణుః జ్యోతిషాం రవిరంశుమాన్।**
**మరీచిర్మరుతా మస్మి నక్షత్రాణామహం శశీ ॥ (భ.గీ.-10-21)**

నారాయణస్వరూపమైన సూర్యభగవానుడు ఆరంభంనుండి ఆకాశంలో వెలుగుతూ ప్రపంచానికి వెలుగు, ఉష్ణాన్ని ప్రసాదిస్తున్నాడు. సూర్యునికి వందల వేల సంవత్సరాల నుండి అర్చనలతో కూడిన ఆరాధనలు జరుగుతూండటం ఒక గొప్ప విశేషంగా చెప్పుకోవచ్చు.

శ్రీమద్విరాట్‌స్వరూపమైన శ్రీమన్నారాయణుని నేత్రములే సూర్యుడు. అలాంటి సూర్యుడు నెలకొకసారి ఒక్కొక్కరాశిలో ప్రవేశిస్తాడు. ఈ చేరటాన్నే సంక్రమణం లేక సంక్రాంతి అంటారు. అలా సంవత్సరానికి పన్నెండు సంక్రాంతులు వస్తాయి. అందులో ముఖ్యమైనవి మేషసంక్రమణం, కర్కాటకసంక్రమణం, తులాసంక్రమణం, మకర సంక్రమణం, ధనుస్సంక్రమణం నుండి మకరసంక్రమణం వరకు ఉన్న ముప్పైరోజులు ధనుర్మాసవ్రతం జరుగుతుంది. శ్రీవైష్ణవసంప్రదాయానికి ముఖ్యవ్రతమిది. సూర్యగమనాన్ని బట్టి వచ్చే పండుగ కాబట్టి సంక్రాంతి అన్నారు. అంతేకాక, సూర్యభగవానునికి ఈ కాలంలో ప్రత్యేక ఆరాధనలు జరుగుతాయి.

కర్మసాక్షియైన సూర్యుడు స్వయంభువు. గ్రహాలకు అధిపతి. సహస్రకిరణుడు. ఏడుగుఱ్ఱాలతో, బంగారురథంలో ప్రయాణిస్తాడు. కనుక, సూర్యుడు సప్తసంఖ్యప్రధానుడు. అలాంటి సూర్యుడు మకరరాశిలో ప్రవేశించుసమయం సంక్రాంతి. జీవనస్రవంతిలో అత్యంత ప్రాధాన్యం పొంది సర్వులకు ఇష్టమైన పర్వమే సంక్రాంతి పర్వదినం. ఈ మకరసంక్రాంతినే స్వర్ణసంక్రాంతి అని కూడా అంటారు.

రథసప్తమిపండుగసందర్భంగా తిరుమలలో అత్యంత వైభవంగా అర్ధ బ్రహ్మోత్సవం పేరిట ఒకేరోజు ఏడువాహనాలపై స్వామి నాలుగుమాడవీథులలో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చి, వరములను అనుగ్రహిస్తాడు. ఆ వాహనాలు ఉదయంనుండి సూర్యప్రభ వాహనం, చిన్నశేషవాహనం, గరుడవాహనం, హనుమద్వాహనంలపై ఊరేగిన తర్వాత మధ్యాహ్నం స్వామి పుష్కరిణీతీర్థంలో చక్రస్నానం జరుగుతుంది. ఆ తర్వాత మధ్యాహ్నం నుండి కల్పవృక్షవాహనం, సర్వభూపాలవాహనం, చంద్రప్రభవాహనంలపై ఊరేగి స్వామి భక్తులకు దర్శనమిస్తాడు. ఈ వాహనసేవలన్నింటినీ ఒకేరోజు దర్శించి, స్వామివారి ఆశీస్సులు పొంది తరిద్దాం.



# ఆదిదైవం ఆదిత్యం

- శ్రీ దావులూరి రామకృష్ణ, 90004 22176

***25-01-2026న రథసప్తమి సందర్భంగా...***

**ధ్యాయేత్ సూర్యమనంత శక్తి**
**కిరణం తేజోమయం భాస్కరం।**
**భక్తానామ భయప్రదం దినకరం**
**జ్యోతిర్మయం శంకరం॥**

ప్రతి ఉషోదయసమయాన తొలి బాలారశ్ముల పృథ్విని తాకినంతనే జగతికి మేలుకొలుపు. మనలోని అచేతనాన్ని తొలగించి మనలను చైతన్యపరచి జీవనసాఫల్యతకు తోడ్పడుతుంది.

సూర్యరశ్ములు వాతావరణంలో కలిగించే మార్పులవలన ప్రకృతిలో ఋతువులు, రాత్రింబవళ్లు, తిథులు మొదలగునవి ఏర్పడుతూ అనంత కాలం కొనసాగుతున్నది.

సర్వకాలసర్వావస్థలలో గగనంలో నిర్విరామంగా సంచరించే ప్రత్యక్ష భగవానుడు ఆదిత్యుడు తొలిదైవంగా తన తేజస్సుతో చీకట్లను (అజ్ఞానమును) తొలగించి కాంతిని, శాంతిని, పుష్టిని, స్ఫూర్తిని ప్రసాదిస్తున్నాడు.

"అహరహః సంధ్యాముపాసీత" (ఉపనిషద్వాక్యం). ప్రతిదినము సంధ్యాకాలము సూర్యమండలాంతర్వర్తియైన ఆ పరమపురుష చైతన్యాన్ని 'సోహం భావేన పూజయతే'. నేను అనే భావనతో ఉదకతర్పణాదులతో అర్చన చేయాలని, సూర్య నమస్కారములు ఆచరించాలని చెప్తున్నది.

**సూర్యోద్భవన్తి భూతాని సూర్యేన పాలితానితు**
**సూర్యేలయం ప్రాప్నువంతియత్సూర్యః సోహమేవచ॥**
**(పురాణ వచనము)**

ఎవ్వడైతే సూర్యుడిగా ఉన్నాడో ఆయనే నేను. ఆదిత్య మండలార్వర్తియైన చైతన్యమే విశ్వమంతా వ్యాపించియుంది. కనుక ఆ చైతన్యమే సాక్షాత్ పరబ్రహ్మ కనుక ఆ దృష్టితో పరిశీలించినట్లైతే ఆ పరబ్రహ్మమే మన హృదయమందున్నది.

**జపాకుసుమ సంకాశం కాశ్యపేయం మహాద్యుతిం।**
**తమోరిం సర్వపాపఘ్నం ప్రణతోస్మి దివాకరం॥**

జపాకుసుమం అంటే ఎర్రమందారం. ప్రతిదినం ప్రాతఃకాలంలో ఎర్రనివర్ణాలతో విచ్చుకునే మందారమెంత ప్రకాశంతో ఉంటుందో అంతే ప్రకాశంతో వెలుగు కుసుమాలను పూజించే ప్రభా పూజం "భాస్కరం". సర్వజీవుల చింతలను, చీకాకులను ఉపశమింపజేస్తాడు. ఆయన రశ్ముల ప్రభావంతో లోకాలన్నీ సృష్టించబడి, పోషించబడుతున్నాయి. 'య ఆదిత్యః స్వర ఏవసః" అని జైమిని ఉపనిషత్తు. జ్ఞాన భాగంలో ఆదిత్యుని శబ్దస్వరూపునిగా దర్శించారు. శబ్దమే శాస్త్రము. శాస్త్రమే విద్య. హనుమంతుడు, యాజ్ఞవల్క్యుడు మొదలైనవారు ఆదిత్యుని ఉపాసనద్వారా విద్యను గ్రహించారు. వేదములు సూర్యుని విరాట్‌స్వరూపుడిగా కొలిచారు కాబట్టి సంధ్యాకాలంలో సూర్యుడిని ఆరాధించమని ఋషులు చెప్పారు.

వేదములో ప్రతి శబ్దము సర్వస్వరూపమే కావున ఆదిత్యహృదయస్తోత్రం పఠించే శ్రీరాముడు రావణుని సంహరించాడు. కుంతీదేవి సూర్యోపాసన గావించి 'కర్ణుడి'కి జన్మనిచ్చింది. ధర్మరాజు అక్షయపాత్రను, సత్రాజిత్తు శమంతక మణిని పొందారు.

ఉషోదయరశ్మిలతో జగత్తును స్పర్శించే భాస్కరుడిని దేవతలు, కిన్నెరలు, గంధర్వులు, ప్రజలు పూజిస్తారు. అంతటా నిండియున్న సూర్యుడికి ఏ దిక్కున నిలచి నమస్కరించినా అది ఆయనకే చెందుతుంది. సమస్తప్రాణికోటిని సమభావంతో చూసే స్వభావము ఆ సూర్యకిరణాలలో ఉంది. రాజప్రాసాదాలలో ఉన్నవారికి, పూరిళ్లలో నివసించేవారికి, నీటిప్రవాహాలకు కొండలకు, గుట్టలకు, పుట్టలకు సూర్యతేజం సమంగా లభిస్తుంది.

ఏడుగుఱ్ఱముల ప్రతీకగా సూర్యకాంతిని ఏడువర్ణములుగా, 'సప్తాశ్వుడు'గా, 'సప్తాశ్వారూఢుడు'గా 'సప్తపతి'గా ఆదిత్యుని ప్రార్థిస్తారు.

సూర్యుని రథం ఒకే చక్రం గలది. ఒక ఘడియలో ఇరవైనాలుగులక్షల ఎనిమిదివందల యోజనాలు నడుస్తూ ఉంటుంది. ఈ రథాన్ని గాయత్రి మొదలైన సప్త(ఏడు) ఛందస్సులనే గుఱ్ఱాలు లాగుతుంటాయి. సూర్యుని రశ్మిలు అశ్వరూపాలు. ఆదిత్యునినుండి ఉత్పన్నమైన ఏడుకిరణాలలో ఏడో కిరణము 'సప్త' అనే నామముతో జగత్తును ఉద్దీపింపచేస్తుంది. మిగిలిన ఆరుకిరణాలు ఆరుఋతువులుగా ఏర్పడి కాలచక్రాన్ని నడిపిస్తున్నాయని వేదవచనం. 'సర్వసాక్షి' అయిన సూర్యునకు మరొకపేరు 'వివస్వార్థుడు'. వైవస్వతమనువుకు తండ్రి. ప్రస్తుతము నడుస్తున్న వైవస్వతమన్వంతరానికి ఉగాది "రథసప్తమి". కావున ఆదిత్యునకు ప్రియం రథసప్తమి. మరియు కశ్యప, అదితి దంపతులకు సప్తమితిథినాడు సూర్యుడు ఆవిర్భవించాడు. కావున, ఈ సప్తమిని సూర్యజయంతిగా జరుపుకుంటారు. ఈ సప్తమి సూర్యగ్రహణముతో సమానమైన శాస్త్రవచనం. కావున ఈ తిథినాడు సూర్యునకు అర్ఘ్య, పాదములు సమర్పిస్తారు.

సూర్యుడు ప్రాతఃకాలమున బ్రహ్మవలె జీవచైతన్యం చేస్తున్నాడు. మధ్యాహ్నవేళ మహేశ్వరుడిగా జగత్తుకు పుష్టిని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నాడు. సాయంత్రం తన దివ్యకిరణములచే అందరికీ మనోరంజకమైన ఆహ్లాదమును విష్ణువై అందిస్తాడు. ఈ విధముగా సూర్యుడు త్రిమూర్తిస్వరూపుడు.

**ఓం భూం భువః భువః సువః తత్ సవితుర్వరేణ్యం**
**భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్**

భూమిని, భూమి ఆకాశముల మధ్య ప్రదేశమునూ, ఆకాశమున తన జ్యోతిష్షుచేత ఆవరించియున్న సర్వసృష్టికర్తయైన సూర్యుని అద్భుత జ్యోతిశ్శక్తియే మా ప్రాణశక్తులు బుద్ధిశక్తిని ప్రేరేపించుచున్నది.

రథసప్తమినాడే గాక ప్రతినెలా వచ్చు సప్తమి తిథులలో, ప్రత్యేకంగా ఆదివారము సప్తమి తిథి ఉన్న రోజులలో పెందలకడనే నిద్రలేచి, కాలకృత్యములు తీర్చుకొని, స్నానం చేయుసమయంలో ఏడు జిల్లేడుఆకులుగాని, ఏడు రేగుఆకులుగాని తలపై, మిగిలిన ఆకులను ఇతరభాగములపై పెట్టుకుని, ఆ సమయంలో...

**జననీత్వంహిలోకానాం సప్తమీ సప్తసప్తకే**
**సప్తవ్యాహృతికేదేవి! నమస్తే! సూర్యమాతృకే**




సప్తాశ్వాలుండే ఓ సప్తమీ! నీవు సర్వలోకాలకు తల్లివి. సూర్యునకు తల్లివైన నీకు నమస్కారం అని చెబుతూ స్నానమాచరించి సూర్యునికి అర్ఘ్యమివ్వాలి. ఆదిత్యహృదయం పఠించాలి. బియ్యం, ఆవుపాలు, శనగపప్పు, బెల్లంతో వండిన పొంగలిని ఏడుచిక్కుడుఆకులలో ఉంచి నివేదన చేయాలి.

*"ప్రత్యక్ష దైవం ప్రథమ దైవం ఆదిత్యుడే"*

15-01-2026న మకరసంక్రాంతి సందర్భంగా

గృహలక్ష్మి

# సంక్రాంతి

- శ్రీ వై.సుబ్రమణ్యం, 97011 20615

సంక్రాంతి మన ఉభయ తెలుగురాష్ట్రాలలోనేకాక దేశమంతటా జరుపుకునే పండుగ. రైతులు పండించిన పంటలను తమ ఇళ్లకు తెచ్చుకాలం. తమకు పంటలు పండుటకు దోహదం చేసిన సూర్యుడికి, వ్యవసాయంలో సహాయం చేసిన పశువులకు కృతజ్ఞతగ జరుపుకునే పండుగ ఈ సంక్రాంతి. ఈ సంక్రాంతితో సూర్యుడు ధనూరాశినుంచి మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. అంత వరకు దక్షిణంవైపు ఉన్న తన గమనాన్ని ఉత్తరంవైపుకు మార్చుకుంటాడు. అంతేకాక మకరసంక్రమణంనుండి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం అవుతుంది. దేవతలకు ఉత్తరాయణం పగలు అని, దక్షిణాయనం రాత్రి అని భావిస్తారు. పూజలకు, సాధనలకు, దానములకు ఉత్తరాయణం మంచిదని నమ్మకం. భారతంలో భీష్ముడు తనకున్న ఇచ్ఛామరణవరంవల్ల ప్రాణం నిలుపుకొని ఉండి ఉత్తరాయణం వచ్చిన తరువాత



తనువు చాలించాడు. పురాణాలప్రకారం శంకరాసురుడనే రాక్షసుడిపై మత్స్యరూప నారాయణుని విజయానికి గుర్తుగా ఈ సంక్రాంతిని జరుపుకుంటారు. దేవతా ప్రతిష్ఠలకు సంబంధించి దక్షిణాయనం శక్తిరూపదేవతల ప్రతిష్ఠలకు, ఉత్తరాయణం సాత్త్వికరూపదేవతల ప్రతిష్ఠలకు యోగ్యమైనదిగా భావిస్తారు.

ఈ సంక్రాంతిపండుగను దేశమంతటా వివిధపేర్లతో జరుపుకుంటారు. తెలుగురాష్ట్రాలలో సంక్రాంతి అని, తమిళనాట పొంగల్ అని, కర్ణాటకలో సుగ్గిహబ్బా అని, గుజరాత్‌లో ఉత్తరాయణ్ అని, బీహార్‌లో తిలసక్రాంత్ అని, పశ్చిమ బెంగాల్‌లో పౌష్‌సక్రాంత్ అని, పంజాబ్‌లో లోహ్రి అనే పేర్లతో జరుపుకుంటారు.

సంక్రాంతిపండుగను ప్రధానంగా మూడు రోజులు కొన్నిచోట్ల నాలుగురోజులు జరుపుకోవడం ఆనవాయితీ. మొదటిరోజున భోగి అని, రెండవరోజు అనగా మకరసంక్రమణ, ఉత్తరాయణ పుణ్యకాల ప్రవేశదినాన్ని సంక్రాంతి అని, మూడవ రోజును కనుమ అని, దానికి పొడిగింపుగ జరుపుకునే నాలుగవరోజును ముక్కనుమ అని పిలుస్తారు. ఈ సంక్రాంతికి ఆయాప్రాంతాలలో ముగ్గులపోటీలనుకూడా నిర్వహిస్తుంటారు.

ఎంతో పుణ్యం చేస్తేనే ఉత్తరాయణ పుణ్యకాలపు ఉత్తమగతులు ప్రాప్తిస్తాయి



పాటలు పాడి గృహస్థులు ఇచ్చే సంభారాలు తీసుకుని వెళతారు. మకరసంక్రమణసమయంలో పితృదేవతలకు తర్పణాలు వదులుతారు.

ఈరోజు కూష్మాండదానంకూడా చేయడం జరుగుతుంది. ఒక విస్తరిలో బియ్యం పోసి దానిపై గుమ్మడికాయను, తాంబూలాన్ని, దక్షిణను ఉంచి పైన మరొక విస్తరిని మూసి ఒక సద్బ్రాహ్మణునికి దానం ఇస్తారు. ఇక్కడ గుమ్మడికాయను దానం ఇవ్వడంలో ఒక అంతరార్థం ఉంది. ఆ కాలంలో లభించే కాయగూరల్లో గుమ్మడికాయకు మాత్రమే చాలాకాలం నిల్వ ఉండగల శక్తి ఉంటుంది. గుమ్మడికాయను మాత్రమే శుభకార్యాలలోని వంటల్లో విరివిగా వాడుతారు. యజ్ఞక్రతువులలో పవిత్రబలులకు గుమ్మడికాయను వాడతారు. దృష్టిదోషనివారణకు గుమ్మడికాయను గుమ్మానికి కడతారు. బహుబీజఫలమైన గుమ్మడికాయను మకరసంక్రమణవేళ దానం ఇవ్వడంవల్ల పితృదేవతలు సంతృప్తి పొంది సమస్తశుభాలను అనుగ్రహిస్తారని నమ్మకం.

ప్రతి ఇంటిముందు ముగ్గులు వేసి రంగులతో నింపుతారు. వాటి మధ్యలో గొబ్బిళ్ళు పెడతారు. పేడతో గొబ్బెమ్మలను చేసి వాటిలో గుమ్మడిపూలు, బంతిపూలు గుచ్చి అలంకరిస్తారు. వాటి చుట్టూ అమ్మాయిలు పాటలు పాడుతూ తిరుగుతూ నృత్యాలు చేస్తారు.

## భోగిపండుగ

తెల్లవారకముందే ఇంటిల్లిపాదీ నిద్రలేస్తారు. వీధిలోని పిల్లా, పెద్ద కలిసి భోగిమంటలు వేస్తారు. ఇళ్లలోని పాత చీపుర్లు, చాటలు, విరిగిపోయిన బల్లలు, పాత తడికలవంటివి తీసుకువచ్చి మంటల్లో వేస్తారు. పాతకు వీడ్కోలు పలుకుతూ, క్రొత్తకు స్వాగతం పలకడం ఇందులోని అంతరార్థం. పిండివంటలు చేసుకుని ఇంటిల్లిపాదీ వచ్చిన బంధువులతో కలిసి ఆరగిస్తారు. సాయంత్రం చుట్టుపక్కలవాళ్లను పేరంటానికి పిలిచి ఇంటిలోని చిన్నపిల్లల తలలపై భోగిపళ్ళు పోస్తారు. రేగుపళ్ళు, చెరుకుముక్కలు, వేరుశనగపప్పు, పూలు, నాణేలు కలిపి పిల్లలకు తలపై పోస్తారు. పిల్లలకు దృష్టిదోషాలు తగలకుండా ఉండటానికి ఈ భోగిపళ్ళు పోయడం ఆనవాయితీ. పేరంటానికి వచ్చిన ముత్తైదువులకు తాంబూలాదులు ఇస్తారు.

## సంక్రాంతి

ఉదయాన్నే పాలు పొంగించి పిండివంటలు చేసుకుంటారు. ఈరోజు గంగిరెద్దులవారు గంగిరెద్దులను అలంకరించి వాటిని ఇంటింటి ముందుకు తీసుకువచ్చి వాటితో రకరకాల విన్యాసాలు చేయిస్తారు. గృహస్థులు ఇచ్చే బియ్యము, సంభారాలు తీసుకొని వారిని ఆశీర్వదించి వెళతారు. ఇదేవిధంగా హరిదాసులుకూడా ఇంటింటివద్దకు వచ్చి లక్ష్మీదేవిని ఆహ్వానిస్తూ

## కనుమ

ఈరోజు పశువులపట్ల కృతజ్ఞత తెలుపుకొనుటకై వాటికి అలంకారాలు, పూజలు నిర్వహిస్తారు. ఆవులకు పసుపు కుంకుమ పెట్టి పూజిస్తారు. ఎద్దులకు మెడలో గంటలు, కొమ్ములకు రంగులు, తొడుగులు వేసి అలంకరిస్తారు. కొన్ని చోట్ల కోళ్ళపందేలు, ఎడ్లపందేలు నిర్వహిస్తారు. ఈరోజు మాంసాహారులు మాంసాహారం వండుకోగా, శాకాహారులు మినుములతో వడలు చేసుకుంటారు. 'కనుమనాడు మినుము తినాలి' అనే సామెత అందుకే వచ్చింది. ఈరోజు సాధ్యమైనంత వరకు ఎవ్వరు ప్రయాణాలు చేయరు. కనుకనే 'కనుమనాడు కాకికూడా కదలదు' అని సామెత.

## ముక్కనుమ

దీనిని కనుమపండుగకు పొడిగింపుగ జరుపుకుంటారు. ముందురోజులలో వండుకున్న పిండివంటలను అందరూ కలిసి ఆరగించిన తరువాత వచ్చిన బంధువులు తిరుగు ప్రయాణమవుతారు.

అందరం ఈ సంక్రాంతిపండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుందాం. పితృదేవతల అనుగ్రహాన్ని సంపూర్ణంగా పొందుదాం.

శుభం భూయాత్



# సందేహాలు సమాధానాలు

- కీ.శే. డా॥ ఎస్.బి.రఘునాథాచార్య

**ప్ర ఎన్నో ప్రయత్నాలు చేశాను. కానీ ఏ విషయంలోను సత్ఫలితం కలగలేదు. మనస్సును నిరుత్సాహం ఆవరించింది. ధైర్యం సన్నగిల్లింది. ఏపని చేయాలన్నా ఏదో భయం! మంచి జరగదేమో! నని. చాలా కుంగిపోయాను. ఏం చేయాలి?**

జ) క్లైబ్యం మాస్మ గమః పార్థ! నైతత్త్వయ్యుపపద్యతే।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప॥ 2-3

నిరుత్సాహపడటమెందుకు. నీలో ఉండే శక్తి నీకు తెలియదు. ఎన్నో మంచి విజయాలను సాధించిన నీవా ఇలా కుంగిపోయేది? ధైర్యం తెచ్చుకో. నీచమైన పిరికితనాన్ని వదలిపెట్టు. ఉత్సాహంతో దైవంమీద భారంవేసి నీ కర్తవ్యాన్ని నిర్వహించ డానికి నడుం కట్టు. తప్పక లక్ష్యాన్ని సాధిస్తావ్.

**ప్ర జీవితంలో జరిగే ప్రతి సంఘటనకు నేను మానసికంగా ఎంతో బాధపడతాను. వారు నాకు ఉపకారులైనా, అపకారులైనా వారినిగురించి నాకెందుకో విపరీతమైన ఆవేదన. చనిపోయినవారినిగురించి పోయారని బాధ. ఉన్న వారు సరిగా లేరే అని బాధ. ఏమిటి దీనికి పరిష్కారం?**

జ) అశోచ్యానన్వశోచత్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే।
గతాసూనగతాసూంశ్చ నానుశోచన్తి పండితాః 2-11

నీది కేవలం మానసిక దౌర్బల్యం. ఎవరినిగురించి నిజంగా బాధపడాలో, ఎవరినిగురించి బాధపడక్కరలేదో నిర్ణయించుకోలేకపోతున్నావు. వివేకంగలవాళ్లెవరు చచ్చిపోయిన వాళ్లనిగురించిగాని, బ్రతికిఉన్నవాళ్లనిగురించిగాని బాధపడరు. ఎందుకంటే లోకంలో ప్రతివాడు వాడి పుణ్యపాపాలను అనుభవిస్తుంటాడు. ఇతరులు బాధపడినంతమాత్రాన వాడి సుఖదుఃఖాల్లో ఏ మార్పు రాదు. అది దైవలీల. కనుక నీవు ఏదో సాధిద్దామని బాధపడటం తప్పు.

**ప్ర అతను నాకు చాలా ఆప్తుడైన మిత్రుడు. నేనూహించలేదు. అనుకోకుండా అతడు గతించాడు. ఎంత ప్రయత్నించినా మరచిపోలేకపోతున్నాను. ఏమిటీ జీవితం? ఏమిటీ జనన మరణాలు?**

జ) దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా।
తథా దేహాన్తరప్రాప్తిః ధీరస్తత్ర న ముహ్యతి॥ 2-13

అతడు నావాడంటున్నావు. అందుకే నీకంత బాధ, ఈ లోకంలో ఎవరికీ ఎవరూ తనవారూ కాదు. పరాయివారూ కాదు. అదంతా మనం పెంచుకున్న అనుబంధం. అసలు మరణ మంటే ఏమిటో ఎప్పుడైనా ఆలోచించావా? మనకు జీవితంలో ముందు బాల్యం వస్తుంది; కొన్నాళ్ళకు అది గడచి యౌవనం ప్రారంభమౌతుంది. నేను యువకుణ్ణి అనుకుంటుండగానే ముసలి తనం వచ్చేస్తుంది. బాల్యం పోయిందని బాధపడుతున్నావా? లేదు. అలాగే నీ ఆత్మ ఈ శరీరంలో కొన్నాళ్లుండి ఇంకో శరీరంలో ప్రవేశిస్తుంది. అదీ శాశ్వతం కాదు. కొంతకాలం తరువాత దాన్ని వదిలిపెడుతుంది. 'ఈ శరీరం నాది' అనుకుంటాడు జీవుడు. అందుకే మరణమంటే భయం. చచ్చిపోయినా డంటే బాధ. మిత్రుడు వేరే ఊరు వెళ్లాడంటే బాధపడతామా? ఇదీ అంతే. అయితే బాధపడకుండా ఉండాలంటే ఆ దృష్టి కావాలి.

**ప్ర చనిపోయిన వెంటనే శరీరం బూడిదై మట్టిలో కలుస్తుంది కదా! ఎందుకు జీవితంలో మంచిని చేయాలి? దేనికి మంచిమార్గంలో నడవాలి? శరీరంకంటే వేరైనది, శాశ్వతమైనది ఏదైనా 'ఆత్మ' అనేది ఉన్నదా? ఈ శరీరంమీద మోజు పెంచుకోవడం మంచిదా ?**

జ) అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః।
అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత॥ 2-18

శరీరమనే శబ్దానికే నశించిపోయేది అని అర్థం. అలాంటి దానిమీద మోజు పెంచుకోవడం మంచిపని ఎలా అవుతుంది? శరీరం మట్టిలో కలిసినా శాశ్వతంగా ఉండే ఆత్మ ఉన్నది కాబట్టి, మనం మంచినే చేయాలి. మనం చేసే ప్రతికర్మవల్లా మనకు పుణ్యపాపాలు కలుగుతాయి. కనుక మనం మంచి పనులే చేయాలి. మంచిమార్గంలోనే తప్పక నడవాలి. శరీరం పోయినా ఆ పుణ్యపాపాలు ఆత్మను వదలవు. వాటి ఫలితాలైన సుఖదుఃఖాలను ఆత్మ అనుభవిస్తేగాని అవి నశించవు. కనుక శాశ్వతమైన ఆత్మకు నశించేటువంటి శరీరాలతో సంబంధం కలగడమే జీవితమని తెలుసుకోవాలి.

**ప్ర ఎండాకాలంలో విపరీతమైన తాపం. అప్పుడు చల్లగా ఉండాలనిపిస్తుంది. వర్షాకాలంలో అతివృష్టి బాధ. చలి కాలంలో తీవ్రమైన చలి. వెచ్చగా ఉండాలనిపిస్తుంది. ఏ కాలం చూచినా బాధాకరంగానే ఉన్నది. వీటివల్ల నా జీవన సరళిలో చాలా ఒడుదుడుకులు కలుగుతున్నాయి. వీటి నుంచి బయటపడాలి. ఏమిటి మార్గం?**

**జ)** మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ! శీతోష్ణసుఖదుఃఖదాః।
ఆగమాపాయినోఽనిత్యాస్తాం స్తితిక్షస్వ భారతః॥ **2-14**

ఇవన్నీ తాత్కాలికాలు. ఏవీ శాశ్వతాలు కాదు. వీటినించి నీవెలాగూ తప్పించుకోలేవు. కనుక వీటిప్రభావం నీ మనస్సు మీద పడకుండా ఓర్పుతో మసలాలి. కొంచెం ఓపిక పట్టావంటే ఇవన్నీ గాలిలో మేఘాల్లాగా అదృశ్యమౌతాయి. కనుక మనస్సును నిగ్రహించుకో!

**ప్ర ఈ శీతోష్ణసుఖదుఃఖాదిబాధలకు గురికానివారు కూడా ఉంటారా? వారేనా నిజంగా మోక్షానికి అర్హులు?**

**జ)** యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ ।
సమదుఃఖసుఖం ధీరం సోమృతత్వాయ కల్పతే॥ **2-15**

తప్పకుండా ఉంటారు. అల్లాంటివాళ్లనే ధీరులంటారు. వారికి వీటి స్వరూపం బాగా తెలియడంవల్ల ఇవి వచ్చేపోయేవని గ్రహించి వీటిని లెఖ్ఖ చెయ్యరు. లెఖ్ఖ చేయనివారిని ఇవి ఏమీ చేయలేవు. లొంగిపోయావో కుంగదీస్తాయి. అలా వీటికి ఎన్నటికీ లొంగనివారికే మోక్షం లభిస్తుంది.

**ప్ర లోకంలో ఒకడిని ఇంకొకడు చంపుతున్నట్లు వ్యవహారం ఉంది కదా! ఇది నిజమేనా? ఆత్మ చచ్చిపోవడంకాని, ఇతరులు దాన్ని చంపడంకాని కుదురుతుందా ?**

**జ)** య ఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతమ్।
ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే॥ **2-19**

లోకంలో ఎన్నోరకాల వ్యవహారాలున్నాయి. అవి అన్నీ సత్యానికి దగ్గరగా ఉండవు. అన్నీ అసత్యాలూ కాదు. 'వాడిని వీడు చంపాడు' అంటుంటాం. అక్కడ మన దృష్టిలో వాడంటే ఆ పేరుతో చెప్పబడే శరీరం. ఇది శరీరాత్మ భ్రాంతివల్ల ఏర్పడిన భావన. అలాగే 'వీడు చచ్చిపోయాడు' అని మనం అంటే శరీరమే వీడనే దృష్టితో అన్నామన్న మాట. కాని ఆత్మ చంపేది కాని, చచ్చేది గాని కాదు. సుకృత దుష్కృతాల ననుభవించిన జీవుడు ఈ శరీరాన్ని వదలి ఇంకో శరీరంలో ప్రవేశించడానికి ఏదో ఒక నిమిత్తం కావాలి కాబట్టి వాడు చంపాడినో! లేక ఇంకేదో మనం చెపుతుంటాం. ఆత్మకు చావులేదు.

**ప్ర లోకంలో, మానవుడు పుడుతున్నాడని, చనిపోతున్నాడనీ అంటుంటాం కదా! ఆత్మ నిత్యమే అయితే పుట్టడమేమిటి? చావడమేమిటి? చావుపుట్టుకలు ఆత్మ కుండవా? లేక ఆత్మ కూడా అనిత్యమేనా ?**

**జ)** న జాయతే మ్రియతే వా కదాచిత్
నాయం భూత్వా భవితా వా న భూయః।
అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే ॥ **2-20**

చావు పుట్టుకలు శరీరానికే గాని, ఆత్మకు కాదు. శరీరం నుంచి ఆత్మ విడిపోవడమే మరణం. శరీరంలో ఆత్మ ప్రవేశించడమే ఉత్పత్తి. ఆత్మ నిత్యం గనుక పుట్టదు. నశించదు. అంటే ఎప్పుడూ ఉంటుంది. కనుకనే దీన్ని పుట్టనిదని, నిత్యమైందనీ, శాశ్వతమైందనీ, పురాణమైందనీ చెపుతారు. శరీరానికి చావు సంభవించినా ఆత్మకు చావు లేదు.

**ప్ర సన్నిహితవ్యక్తి గతించాడు. అతనిమీది ప్రేమాభిమానాల్ని నేను మరచిపోలేకపోతున్నాను. నామనస్సెలా సమాధాన పరుచుకోవాలి? మరణమంటే ఏమిటి ?**

**జ)** వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోఽపరాణి।
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ॥ **2-22**

ఎవడు దగ్గరివాడు? ఎవడు దూరపువాడు? ఈ దగ్గర దూరాలన్నీ మనం కల్పించుకున్నవి. మీ మనస్సును మీరు నిగ్రహించుకోవాలి. మనం కొత్త బట్టలు కుట్టించుకుంటాం. కొన్నాళ్లు వాడుకుంటాం. అవి చినిగి పాతవౌతాయి. వాటిని వదిలేసి మరలా కొత్తవాటిని తొడుక్కుంటాం. ఆత్మకూడా అలాగే ఒక శరీరంలో ప్రవేశించి కొన్నాళ్లుండి అది శిథిలమైతే, దాన్ని వదిలి వేరేదానిలో ప్రవేశిస్తుంది. వీటినే జననమరణాలు అన్నాం.



సుఖదుఃఖాలనే రెండింటిలోనూ సమంగా వ్యవహరించేవారే స్థితప్రజ్ఞులనబడతారు

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000



**గతసంచిక తరువాయి..**

హరి ఎప్పటిలాగే పుట్టలో దాగాడు. అయినా, స్వామికి గొడ్డలివేటు కారణంగా శిరోవేదన ఇక తప్పదని హరి గురుని స్మరించాడు. బృహస్పతి పుట్టదాపుకు వచ్చాడు. తన గురువును చూచి స్వామి తన స్థితిని సర్వం దాచుకోకుండా చెప్పాడు. తనకు కలిగిన విపత్తును ప్రస్తావిస్తూ గొల్లడు కొట్టిన దెబ్బకు విరుగుడుమందు చెప్పవలసిందిగా కోరాడు. అప్పుడా బృహస్పతి,

స్వామీ! సామాన్యులకు కాలం, కర్మ గ్రహగతులుంటాయి. కాని మీకూ ఉంటాయా? నీ మహిమల్ని ఇతరులు తెలుసుకోలేరు. సర్వం మీకు తెలుసు. అయినా, అడిగారు కనుక చెబుతాను. జిల్లేడు పత్తి ఎత్తి పాలల్లో అద్ది నడినెత్తిమీద పెడితే బాధ ఉండదు. ఇదే మంచిదని చెప్పి తన వాసానికి వెళ్ళాడు. హరి గురువు చెప్పినట్లుగా వైద్యం పాటించాడని వివరిస్తుంటే శౌనకాదులు చాల జాలిపడ్డారు. మరి తింత్రిణీ వృక్షం పుట్టలగురించిన వృత్తాంతాలు వినాలని కోరారు. హరికి కలిగిన కష్టాలు వింటుంటే మనసు వెన్నెలా కరిగిపోతూ ఉందని సెలవిచ్చారు.

సూతుడు శౌనకాదులతో, మునులారా! విష్ణుచరిత్రలు సామాన్యమయినవి కావు. ఆ కథలన్నిట నిగూఢార్థముంది. వాటిని ముందుగా ఊహించుకోవడం సాధ్యం కాని పని. అయినా మీరడిగారు కనుక చెబుతా, కృతయుగం తరువాత త్రేతాయుగం. ఆ యుగంలో దశరథుడు కౌసల్య రామునిపట్ల అత్యంత పుత్రవ్యామోహం కలవాడై దేహత్యాగం చేశాడు. అప్పుడా బ్రహ్మ దశరథతేజాన్ని తింత్రిణీవృక్షంగా కౌసల్యాదేవి తేజాన్ని వల్మీకంలో దేవకితేజాన్ని నిలిపాడు. ఆ కారణాన రామకృష్ణాది పేర్లుగల వెన్నుడు మాతృగర్భంలోని శిశువులాగా పదివేలసంవత్సరాలు వసించాడు. దశరథుడే తింత్రిణీవృక్షం. కౌసల్యయే పుట్ట. లక్ష్మణుడే శేషాద్రి. అయోధ్యాపురమే పుణ్యకానన పరివృతపర్వతం. సరయూనదియే స్వామి పుష్కరిణి. శ్రీరామచంద్రుడే శ్రీనివాసుడు. తదనానంతరం వసుదేవుడే తంత్రిణీవృక్షం. దేవకీదేవి వల్మీకం. బలభద్రుడు శేషాద్రి. మధురాపురమే వేంకటనగరం. యమునానదియే శ్రీ స్వామిపుష్కరిణి. యాదవులే మృగాలు గోపికలే పక్షులు. శ్రీకృష్ణుడే వల్మీకవాసి అయిన శ్రీనివాసుడు. ఇంకా చెప్పదలచుకుంటే వైకుంఠమే శేషాచలం. విరజానదియే సువర్ణముఖి. నారాయణుడే శ్రీనివాసుడు. ముక్తులే పక్షులు. అనేక ముక్తరుద్రులు అనేక మృగాలు. సనకసనంద నాదులు వనచరోత్తములు. అలాంటి చోట వేంకటేశ్వరుడు విచిత్ర లీలావినోదాలతో కాలం గడుపుతుంటాడు. తనకు శరీరబాధ కలిగినట్లు నటించినాడుగాని, అతనికి ఏ బాధలేదు. ఆ స్వామి దర్శనం చేయాలనుకొని పరితపించేవారు సత్కర్మ సిద్ధులవుతారు. ఇది నిజం.

వైకుంఠం వదిలి శేషగిరిలో వల్మీకంలో దాగిన వృత్తాంతాన్ని మీరందరు విన్నారు. ఇప్పుడు ఆ దేవుడే మూర్తులతో నరులతో ఆడినవాడై లౌకికుడుగా నటించిన వృత్తాంతం చెబుతాను.

బృహస్పతి చెప్పిన వైద్యం చేయడాని కోసం హరి తనకా సహాయం చేయలేని వారొకరుకూడా లేకుండడాన్ని గుర్తించి తన మందును తానే తెచ్చుకోవడానికి తెల్లవారే బయలుదేరాడు.

వరాహస్వామి వృషభాసురునితో సమరం చేసి అతనిని సంహరించి భూదేవితో కొండకోనల్లో సంచరిస్తూ చాలాకాలానికి శేషాద్రి గుర్తుగా మార్గ మధ్యంలో శ్రీహరిని చూచి అతణ్ణి నర రూపంలోని రాక్షసుడని ఘుర్ఘురావం చేశాడు. ఆ భయంకరశబ్దానికి జడుసు కొని శ్రీహరి ఒక పొదలో దాగాడు. వరాహమూర్తి అమీతుమీ తేల్చుకోవాలని

పొదలదగ్గర కాపు కాశాడు. కాని, చివరకు కన్నీళ్ళెట్టుకొంటున్న నరుని చూచి వరాహదేవుడు అకారణంగా నరుడని విజృంభించాను' అని తర్కించి హరి ఉన్న చోటికి వెళ్ళి భయపడకుమని అభయమిచ్చాడు.

ఏమిటి శ్రీహరి! వైకుంఠం వదలి వచ్చావేమిటి? నీ వక్షఃస్థలంలో లక్ష్మి కనిపించదేమి? సామాన్య మానవునిలా ఉన్నావెందుకు? తలమీద గాయాలేమిటి? బలం ఉడిగిపోగా అలసట ఏమిటీ? కన్నీళ్లు కారుతున్నాయెందుకు? నిన్ను చూస్తుంటే అన్ని వింతవింతగా కనిపిస్తున్నది. నాకు అన్నీ విశదంగా చెప్పుమని ఆప్యాయతతో ప్రశ్నించాడు.

అప్పుడు భృగువు రావటం మొదలు తనకు గాయం కలగడానికి కారణాలను చెబుతూ బృహస్పతి చెప్పిన మందుల కోసం ఒంటరిగా తిరుగుతున్నానని సవివరంగా చెప్పాడు.

స్వామి! మీతో మనసు విప్పి మాట్లాడే అవకాశం కలగడంతో నా మనసులోని చింతలన్నీ మాయనాయి. దయతో నన్ను నీవానిగా దగ్గర చేర్చుకో. వైకుంఠం వదలి వచ్చాను. ఇక్కడ నీ ఉన్నావు. నిన్ను ఇంతకాలం చూడలేదు అనగానే వరాహదేవుడు.

ఈ పర్వతంలో వృషబాసురుడనేవాడు పండిన పంటనంతా తనదిగా తీసుకొని వెళుతుంటే నేను ఆ అసురునితో చాలకాలం పోరాడవలసి వచ్చింది. నా దృష్టిపడక ఎన్నో రోజులుండగా చివరకు నా కంటబడడంతో వానిని శిక్షించాను. మార్గమధ్యంలో నిన్ను చూడగలిగాను. నీకు నాకు స్నేహం కలిసింది. ఒకరివల్ల మరొకరికి ఆసరామాత్రం కాదు. నాకూ 'ఆనందం' అన్నాడు.

ఈ భరోసా లభించడంతో హరి, వరాహదేవ! నేను కలియుగాంతందాకా ఇక్కడ ఉండాలనుకుంటున్నాను. నా వాసానికి తగిన స్థలం చూపు అన్నాడు. వరాహస్వామి ఎదురు చూడని పరిస్థితి. అయినా తమాయించుకొని నేర్పుగా,

హరి! పేదలను ఆశలతో ముంచరాదు. అయినా బలవంతులకు తెలిసి తెలిసి తావీయరాదు. నీవు ఈ స్థలానికి డబ్బు ఇవ్వగలిగితేనే నీకు నూరుఅడుగుల భూమి కొలత వేసి ఇస్తాను అన్నాడు. ఈ షరత్తు విన్న హరి...

స్వామి! లక్ష్మి నా దగ్గర లేదు. ఒకవేళ ఉంటే మీరడిగినంత ఇవ్వగలవాడినే. ఆదిలక్ష్మి అలిగి కొల్హాపురం వెళ్లిపోయింది. ఈ లోకంలో నన్ను నమ్మి ఎవడు డబ్బిస్తాడు? ప్రజలను యాచించి తిని బ్రతకవలసిన దయనీయస్థితి నాది అన్నాడు బాధతో..

నిజమే అయినా డబ్బివ్వందే నేనూరక స్థలం ఇవ్వను అన్నాడు గట్టిగా, ధరాతలమంతా నీ అధీనంలోనే ఉన్నది కదా! కాసింత ఇవ్వరాదా! అన్నాడు హరి.

ఎంత జాగా ఇస్తే ఆ జాగాలోనే సర్దుకొంటా. జీవనోపాయంకోసం సామాన్యనరునిలా నటిస్తా. ఈ పర్వతానికి నరులు వచ్చేలా ఆకర్షిస్తా. నీకు తగిన రీతి పంచామృత అభిషేకం చేయిస్తా. ఈ తీర్థంలో మునిగి ముందుగా నీకు కానుకలర్పించుడని ఆజ్ఞ జారీ చేస్తా. అంతే కాదు నీకు నివేదనమయ్యాకనే నాకు నివేదనమని కట్టడి చేయిస్తా. అనగానే వరాహదేవుడు సంతోషించి హరికి నూరడుగుల భూమి కొలిచి ఇచ్చాడు. ఈ రకంగా వల్మీకవాసి క్షేత్రవాసి అయ్యాడు. వీరిరువురి శిరస్సులపై దేవతలు పూలవానలు కురిపించారు. అనేకరీతుల స్తుతులు కూడా చేశారు.

వరాహదేవుడు శ్రీనివాసుని సంకల్పానికి మనసులో జోహారు పలికాడు. ఆ తర్వాత శ్రీనివాసుడు ఒకడే కదా! అని అతనికి తగిన పరిచర్యలు చేయడానికి వీలుగా తన్ను ఆశ్రయించి ఉన్న వకుళమాతను శ్రీనివాసుని కైంకర్యార్థం నియమించాడు. ఆ తల్లి స్వామికి తగిన ఉపచారాలు చేయసాగింది. గాయాలకు ఔషధంపెడుతూ మంచి ఆహారాన్ని సమకూరుస్తూ ఆ తల్లి పోషించసాగింది.

ఇదంతా పరిశీలిస్తున్న బ్రహ్మరుద్రులు స్వామికి తగిన ఆశ్రయం లభించిందనే సంతోషంతో తమ తమ నివాసాలకు వెళ్లిపోయారు. ఆ తర్వాత శ్రీహరి కాననసీమలో సకల వినోదాలతో అందరికి ఆకర్షితుడయ్యాడు.

భక్తిహీనులకు మోహకుడుగా, పరమభక్తులకు సర్వసిద్ధి ప్రదుడుగా, రాక్షసులకు భయంకరుడుగా, దేవతలకు వినోదాలు కల్పిస్తూ తలమీద దెబ్బగాయం మానుతుంటే దివ్యసౌందర్య లీలామానుషవిగ్రహుడు తయారయ్యాడు. తల్లిదగ్గర ముద్దు లొలికే బాలకునిలాగా సంచరించసాగాడు అని సూతుడు చెబుతుంటే వకుళమాలిక ఎవ్వరని శౌనకాదులు అడగడంతో సూతుడు ఆ తల్లి వృత్తాంతం చెప్పాడు.

వకుళమాలిక ఎవరోకాదు యశోదాదేవి మారు రూపమే. పసితనాన కృష్ణుని ఆటలు, పాటలు, విహారాలను చూచి చూచి మురిసిన తల్లి పుత్రవాత్సల్యమానసయై మరణించడంతో ఆమెకు కృష్ణునికున్న ఋణానుబంధాన్ని బ్రహ్మ వకుళ మాలికగా జన్మించేలా చేశాడు. ఆమె భూవరాహస్వామిచెంత ఉండేలా చేశాడు. వరాహదేవుని ఆనతో శ్రీనివాసుని చేరి తల్లిలా వాత్సల్యంతో బాగోగులు పట్టించుకొంది.

శ్రీరమణీవిభుడు శేషాద్రిలో నిలిచి వినోదాలలో తేలి యాడుతూ ఒక రాజకన్యను చూచి మోహించి దేవతలందరూ చూడగా పెళ్ళాడినాడని సూతుడు చెప్పగా శౌనకాదులు ఆ వృత్తాంతం చెప్పవలసిందిగా అడిగారు.

రమాపతికి తగిన కన్య ఎవరు? ఎక్కడ జనించింది? ఆ కన్యకను తల్లిదండ్రులు, అన్నదమ్ములెవ్వరు? ఈ వృత్తాంతాన్ని చెప్పవలసిందిగా కోరారు. సూతుడు సరేనని ఆ వృత్తాంతాన్ని మొదలెట్టారు.

28వ ద్వాపరాంతంలో భూతలంపై కలియుగం ఆదిలో విక్రమార్కుడు మొదలయినవారు పరాక్రమవంతులయి, ప్రజల బాగోగులు తెలిసినవారయి పాలించి గతించారు. వారి తరువాత చంద్రకులజులయిన పాండవసంతానం పాలించ సాగారు. వారిలో ఒకరు తన సంతానమైన సుధర్మునికి పట్టంగట్టి సద్గతి చేరుకున్నారు.

ఆ సుధర్ముడు రాజ్యపాలన చేస్తుండగా అతనికి ఆకాశ రాజు పుట్టాడు.

అతడెవరో కాదు. మాధవనామకుడు. కారణవశాన పాపలరాయడై చివరకు శేషాద్రినెక్కి స్వామిపుష్కరిణిలో స్నానం చేసి శరీరత్యాగం చేశాడు. అతడే సుధర్మపుత్రుడయ్యాడు. అలాగే పూర్వజన్మలో మాధవుని ధర్మపత్ని అయిన చంద్రరేఖ పతిస్మరణ చేస్తూ శరీరత్యాగం చేయడంతో ధరణీదేవిగా జన్మించింది. సుధర్ముడు ఆమెను ఆకాశరాజునకిచ్చి పెళ్లి చేశాడు.

ఒకరోజు సుధర్మరాజు వేటాడటంకోసం అడవికి వెళ్ళాడు. వేట కారణంగా అలసిపోయాడు. ఒడలబడలికతో ఒక కొలను చేరుకున్నాడు. అక్కడ ఒక నాగకన్యను చూచాడు. ఆమె అందచందాలకు దాసుడయ్యాడు. మోహించాడు. తన్ను పెళ్లాడమని కోరాడు. కాని ఆ నాగకన్యక రాజా! నీవు మానవుడివి. నేను నాగకన్యను. మన ఇద్దరికి దాంపత్యం ఎలా కుదురుతుంది. నీ దారిన నీవుపో అని మందలించింది. అయినా సుధర్ముడు ఆమె వెంటబడసాగాడు. అతని వాలకాన్ని పసిగట్టిన నాగకన్య నీవెవరవు? నీ కులగోత్రాదులాదులేవి? అని ప్రశ్నించింది. అది చెప్పిన రాజును చూచి చివరకు ఇలా అన్నది.

రాజా! నన్ను నీవు పెళ్లాడావనుకో నీ సంతానం నాగలోకంలోనే. నీ తండ్రి ఎవడని ప్రశ్నిస్తే వారికేమని చెప్పాలి అనే సంశయంతో ప్రశ్నించింది.

సుధర్ముడు వెనువెంటనే నీకు కొడుకు పుడితే, నేనెవడని ప్రశ్నిస్తే నా పేరు చెప్పి నాదగ్గరికి పంపించు. నేను అతనికి అర్థరాజ్యం ఇస్తాను. అంటూ ముద్దుటుంగరాన్ని ఆనవాలుగా నాగకన్య చేతికిచ్చి ఆమెను భోగించాడు. నాగకన్య రాజుకు వీడ్కోలు పలికింది. రాజు తన పురం చేరాడు.

నాగకర్య గర్భవతి అయింది. నాగలోకం చేరుకొంది. అయితే నాగరాజు తన కుమార్తెను పల్లెత్తుమాట అనలేదు. సర్వం తెలిసినా తెలియని వానిలా మసలాడు. ఆ కన్యకు కుమారుడు పుట్టాడు. అతనిలో చక్రవర్తి చిహ్నాలు కనిపించాయి. అందానికి అందంగా శిశువు అందరికి కనులవిందుగా కనిపించాడు.

ఆ కుమారుడు పెరిగి పెద్దవాడై ఒకరోజు తల్లితో 'నా తండ్రి ఎవడని ప్రశ్నించాడు. వెంటనే నాగకన్య 'నీ తండ్రి సామాన్యుడు కాదు. సుధర్మరాజు భూలోకపాలకుడు. అతని దగ్గరికి నిర్భయంగా వెళ్లు. అంతేకాదు. ఆ రాజు తన రాజ్యంలో సగభాగం నీకు ధారబోస్తాడు. ఆ రాజ్యాధికారంతో సంతోషంగా రాజ్యాన్ని పాలించు. ఇక్కడ నీవుండడం ఎందుకని భూలోకానికి పంపింది. ఒకనాడు సుధర్ముడు తనకిచ్చిన ముద్దుటుంగరాన్ని బాలుని చేతికిచ్చింది. చివరగా ఆ బాలుడు తల్లికి పునః ప్రణామం చేస్తే తల్లి 'నాయనా! దీర్ఘాయుష్మంతుడవై, హరి భక్తుడవై, చక్రవర్తియై వర్ధిల్లమని దీవించింది. పుత్రవిరహంతో బాధగా నాగలోకం చేరుకుంది.

ఆ బాలుడు సరాసరి సుధర్మరాజుదగ్గరికి వెళ్లి నమస్కరించాడు.

*(ఇంకా ఉంది)*



# చాణక్యనీతి

- డా॥ మైలవరపు లలితకుమారి

చాణక్యుడు బ్రాహ్మణకుటుంబంలో జన్మించాడు. చాణక్యుడి తండ్రి చణకుడు అధ్యాపకుడు కావటం వలన చిన్నతనంనుండి వేదాభ్యసనం చేశాడు. తక్షశిలలో అధ్యాపకుడిగా పనిచేశాడు. పాటలీపుత్రాన్ని పరిపాలించే మహాపద్మనందుని కుమారులు చాణక్యుని శిఖపట్టుకొని ఆసనంపైనుంచి లాగి క్రిందపడవేసి అవమానించారు. అపుడు వారినందర్నీ సంహరిస్తానని చాణక్యుడు ప్రతిజ్ఞ చేశాడు. అది తెల్సిన చంద్రగుప్తుడు ఆయన నాశ్రయించగా శస్త్రాస్త్రవిద్యలను అన్నింటిని నేర్పించాడు. చాణక్యుని విష్ణుగుప్తుడు, కౌటిల్యుడు అనికూడా వ్యవహరిస్తారు. ఈయన అర్థశాస్త్రమును గురించి విశేషమైన గ్రంథాన్ని వ్రాశాడు.

కౌటిల్యుని అర్థశాస్త్రము నాడు నేడు ఏనాడైనా ఆర్థికశాస్త్రానికి ప్రామాణికగ్రంథం. చాణక్యుడు నీతిశాస్త్రగ్రంథమునుకూడా రచించాడు. చాణక్యుని నీతిసూత్రాలు మానవజీవితానికి ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ నీతిసూత్రాలను అనుసరిస్తే మానవుడు అవమానాలను పొందకుండా అవమానాలకు దూరంగా ఉంటాడు. తన అనుభవాలను అనుసరించి కుటుంబం, సమాజం, దేశం, సైన్యం గురించి మనకు వివరించాడు చాణక్యుడు.

చాణక్యుని నీతిసూత్రాలలో చెప్పినప్రకారం మనిషి వెళ్ళకూడని ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి ప్రదేశాలకు వెళితే అవమానాలు పొందటమేకాక శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగాకూడా నష్టపోతారని చెప్పాడు. అందులో కొన్ని-

### 1) సంస్కారం లేని చోటు

పుట్టుకతోటే కొంతమందికి సంస్కారం కలుగుతుంది. ఒక్కొక్కసారి పరిసరాలప్రభావంతో మనిషి సంస్కరింపబడతాడు. కానీ సంస్కారం లేక ఒకరినొకరు మోసం చేసుకునే వారివద్దకు, కుతంత్రాలు, కుట్రలు, అవినీతిపరులు ఉండేచోటుకి అస్సలు వెళ్ళకూడదు అన్నాడు. అలాంటి వారికి సమీపంలో ఇల్లు కట్టుకున్నా ఆ పరిసరాలప్రభావం మనిషిని పతనంవైపుకు నడిపిస్తుంది. ఇలాంటివారినిచూసే "చెడ్డవారికి దూరంగా ఉండాలి" అనే సామెత ఏర్పడి ఉండవచ్చు.

### 2) పనిలేని చోటు

పనిలేకుండా నిష్కారణంగా ఎక్కడికి పడితే అక్కడికి వెళ్ళకూడదు. ఏదైనా ఒక ప్రదేశం అందంగా ఉందంటే చూసి రావాలి. కానీ అక్కడ ఉండకూడదు. మీ అవసరం లేని చోటుకి అస్సలు వెళ్ళకూడదు. మనం వెళ్ళినచోట ఏదైనా పనిగానీ, ఉద్యోగ, వ్యాపార అవకాశాలుగాని లేకపోతే అక్కడ ఉండటం వృధా అన్నాడు. అది మనలో సోమరితనాన్ని పెంచుతుంది. మన ఆస్తిత్వాన్ని నశింపజేసి ఎందుకు కొరగానివాళ్ళని చేస్తుంది. అలాంటి పరిస్థితులకు వీలైనంత దూరంగా ఉంటే మనిషి మనుగడ మహత్తరంగా ఉంటుంది.

### 3) విద్యాభ్యాసానికి వీలుకాని ప్రదేశం

"విద్యా ధనమధనానామ్" అని చాణక్యుడు విద్యగురించి చెప్పాడు. "విద్యాచోరైరపి న గ్రాహ్య" విద్యను దొంగలుకూడా అపహరించలేరు.

"దొంగలెత్తుకపోరు
భ్రాతృజనమువచ్చి పంచుకోరు
దొరలువచ్చి దోచుకొనరు
విశ్వవర్ధనంబువిద్యరా
లలితసుగుణజాల తెలుగుబాల"

అని జంధ్యాలపాపయ్యశాస్త్రికూడా విద్యయొక్క గొప్పతనాన్ని వివరించి చెప్పారు. వ్యక్తి అభివృద్ధికి విద్యే పరమావధి. ఏవైనా క్రొత్త విషయాలు తెలుసుకోవటానికి, అధ్యయనానికి, చదువుకి ప్రాముఖ్యత లేని చోటుకి వెళ్ళకూడదు అన్నాడు. ఒకవేళ వెళితే ఇంతకుపూర్వం నీవు నేర్చుకున్నది కూడా కొరగాకుండాపోతుంది. అధ్యయనము, అభ్యసనము ఉన్నప్పుడే మనిషి ఆలోచనలు పదునుగా ఉంటాయి. అలాంటి

అవకాశాలు లేకపోతే మెదడు మొద్దుబారిపోతుంది. అందుకే "అనగ అనగ రాగమతిశయించు" అన్నాడు వేమన. అభ్యాసం చేస్తేనే ఏ విద్యకైనా రాణింపు ఉంటుంది.

### 4) సహాయం చేసేవాళ్ళులేని ఊరు

ఏవైనా క్రొత్త ప్రదేశాలకు వెళ్ళినప్పుడు సాయం చేసే స్నేహితులు ఉన్నారా? లేదా? అని ఆలోచించాలి. మానవుడు సంఘజీవి. సమాజంలో పదుగురితో కలిసి జీవించాలి. లేక పోతే ఏదైనా కష్టం వచ్చినప్పుడు ఎవరు సాయం రారు. మనిషి ఒంటరిగా మిగిలిపోవాల్సి వస్తుంది. ఒంటరితనం నరకంతో సమానం. కనుక ఎక్కడికైనా వెళ్లేటప్పుడు మనం వెళ్లేచోట బంధువులు ఉన్నారా? స్నేహితుల ఎవరైనా ఉన్నారా? అన్న విషయం ఆలోచించగలగాలి.

### 5) గౌరవం లేని చోటు

మీ మాట పట్టించుకోనిచోటుకు, మిమ్మల్ని గౌరవించనిచోటుకు ఎప్పుడు వెళ్ళకూడదు. ఎక్కడైతే గౌరవం దొరుకుతుందో అక్కడ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ప్రతి విషయానికి మిమ్మల్ని అవమానించి, తక్కువగా చూసేచోటుకి అస్సలు వెళ్ళకూడదు). అది మీ గుర్తింపుకే అవమానం. మిమ్మల్ని మీరే చిన్నబుచ్చుకోవటం. అవమానం మరణంతో సమానం అంటారు పెద్దలు. దక్షయజ్ఞానికి వెళ్లిన సతీదేవి అవమానాన్ని పొంది ఆ యజ్ఞంలో దగ్ధమైపోవడం అందరికీ తెలిసిన విషయమే. అందువలన మనకు గౌరవం దొరకని చోటికి వెళ్ళకూడదు.

### 6) అప్పు అడిగేవాళ్ళున్న చోటు

అప్పు అడిగేవాడికి దూరంగా ఉండాలి. ఇచ్చిన తర్వాత రాలేదు అని బాధపడకూడదు. పేదరికంలో ఉన్నా కూడా దానినుంచి బయటపడటానికి తగిన ప్రయత్నం చేయరు కొందరు. అలాంటివాళ్ళు ఉన్నచోటికి వెళితే మీకు ఆర్థికంగా, మానసికంగా నష్టమే కానీ లాభం ఉండదు. అలాంటివారికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. మన దగ్గర అప్పు తీసుకున్నవాడు భోజనానికి పిలిచిన వెళ్ళవద్దు అని చాణక్య నీతి. మనకు డబ్బులు ఇచ్చిన వాడి ఇంటికి భోజనానికి పిలిచాడని వెళితే ఆ అప్పు తీర్చలేక ఎక్కడ అప్పు అడుగుతావో నని చిన్నచూపు చూస్తారు. అది మనని అవమానించడమే. అలాంటివారింటికి అస్సలు వెళ్ళకూడదు.

### 7) ఉపాయంతో దేనినైనా సాధించవచ్చు

"ఉపాయ పూర్వం కార్యం న దుష్కరం స్యాత్" అంటారు. ఉపాయంతో చేసే పనిలో శ్రమ ఉండదు. ఉపాయం ఉంటే ఎంతటి కష్టసాధ్యమైన పనైనా సాధించవచ్చు. బుద్ధి కుశలత, సామర్థ్యం ఉంటే దేన్నైనా సాధించవచ్చు.

### 8) డబ్బే జీవితం అనుకునేవారి ఇంటికి

డబ్బు ప్రతి ఒక్కరికి అవసరమే. కానీ కొందరికి డబ్బు మీద ఆశ ఎక్కువ. ఇలాంటివారు పిలిచినా కూడా వారింటికి అస్సలు వెళ్ళకూడదు. "మీ ఇంటికి వస్తే ఏమిస్తావు? మా ఇంటికి వస్తే ఏం తెస్తావు?" అన్న మనఃస్థితిలో ఉన్న వాళ్ళ ఇంటికివెళితే మొదట ఆదరంతో మాట్లాడినా తరువాత నీగురించి చులకనగా మాట్లాడతారు. అలాంటిచోటికి వెళ్ళకపోవడం శ్రేయస్కరం.

### 9) ఏ విషయాన్నైనా చూసి నిర్ణయించుకోవాలి

"ప్రత్యక్ష పరోక్షానుమానైః కార్యం పరీక్షేత" అన్నాడు చాణక్యుడు. బుద్ధిమంతులైనవారు దేనినైనా ప్రత్యక్షంగా చూసినపుడుమాత్రమే నమ్ముతారు. ఎవరు చెప్పిన మాటలు నమ్మడు. కనుక మానవుడు సద్బుద్ధితో చరించాలన్న విషయం దీనిద్వారా విదితమగుచున్నది. దీనినే

వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగ పడక వివరింపదగున్
కనికల్ల నిజముతెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!

అని బద్దెన సుమతీశతకంలో చెప్పిన మాటలు చాణక్యనీతిసూత్రాలలో ప్రధానంగా చెప్పిన విషయం ఒకటే అని చెప్పవచ్చు.

చాణక్యనీతిసూత్రాలలో ఇవి కొన్ని మాత్రమే. అన్నింటికన్నా గొప్ప నీతిసూత్రం "బహూనపి గుణాన్ ఏక దోషోగ్రసతి" ఎన్ని మంచి గుణాలున్నా ఒక్క చెడ్డగుణం ఆ గుణాలన్నింటిని మింగేస్తుంది. వానిలో మాట ఒకటి. ఎంత చేసినా పరుషంగా ఒక్కమాట మాట్లాడితే చేసిన మంచి అంతా వ్యర్థమే. అందుకే "వాక్పారుష్యము చన్నే" అన్న కవిమాటలు సత్యం. అందుకే మనిషి ఎప్పుడు వాజ్ఞతను కోల్పోకూడదన్నది చాణక్యనీతి.

# గోవర్ధనగిరిధారీ గోవిందా!

- శ్రీమతి సింగరాజు కృష్ణకుమారి, 94403 74575



నందవ్రజంలో ఏడుసం॥ల ప్రాయంలో శ్రీకృష్ణుడు ప్రదర్శించిన "గోవర్ధనోద్ధరణలీల" అయిన సంపూర్ణలీలా విభూతిగా ప్రకటించిన పరమాద్భుతలీల.

నందవ్రజంలో ప్రతిసం॥ కార్తికమాసంలో ఇంద్ర యాగంచేసి ఇంద్రదేవుని ఆరాధించడం ఆనవాయితీగా వస్తోంది. ఇంద్రుడే తమని కాపాడే ఆదిదేవుడనీ, ఆయన అనుగ్రహంవల్లే మేఘాలు వర్షించి పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయని యాదవులవిశ్వాసం.

ఆ ఇంద్రుణ్ణే వర్షాధిపతిగా, స్వర్గాధిపతిగా నియామకం చేసినవాడూ, సమస్తయజ్ఞాలకూ అధిపతీ, యజ్ఞస్వరూపుడు, యజ్ఞభోక్త, యజ్ఞఫలదాత అయిన శ్రీమన్నారాయణుడు చిన్ని కృష్ణునిరూపంలో తమమధ్యలోనే ఉన్నాడని తెల్సుకోలేని ఆ అమాయకయాదవులు ఆయనకే ఇంద్రుని ఆధిక్యతనీ, ఇంద్రుని పూజించాల్సిన అవసరాన్ని, ఆవశ్యకతనీ వివరించి ఆయనని కూడా ఇంద్రపూజ చేయాల్సిందిగా చెప్పారు.

యాదవులు తననే అధిదేవునిగా భావించి పూజించడం ఇంద్రునిలో అహాన్ని పెంచింది. ఆ అహంమత్తులో శ్రీకృష్ణుడే గోకులంలో అవతరించి ఉన్న పరదైవం అనే జ్ఞానాన్ని కోల్పోయాడు. తన పరతత్త్వాన్ని గ్రహించలేని బ్రహ్మ వ్రేపల్లెలోని గోవులనీ, గోవత్సాలనీ, గోపబాలురనీ అపహరించగా ఒక సం॥ పాటు అందరిరూపాలూ తానే ధరించి బ్రహ్మ అహంకారాన్ని తొలగించిన కృష్ణుడు ఇప్పుడు ఇంద్రుని అహంకారాన్ని నిర్మూలించాల్సినసమయం వచ్చిందని భావించాడు.

అందుకే వ్రేపల్లెలో ఆచారంగా వస్తున్న ఇంద్ర పూజని మాన్పించదల్చాడు. ఇంద్రునికి భయపడాల్సిన అవసరం లేదనీ, కర్మఫలాలను ప్రసాదించేవాడు ఈశ్వరుడనీ బోధించాడు. చేయాల్సింది ఇంద్రయాగం కాదనీ; పశువులనీ, పర్వతాలనీ, బ్రాహ్మణోత్తములనీ పూజించమని చెప్పాడు.

కృష్ణునిమాటలు గురూపదేశంగా భావించిన నందాదులు బంధుమిత్రపుత్రపశుగణసమేతంగా గోవర్ధన గిరిని చేరి గిరిని పూజించి, ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించారు. గోవులను, వృషభాలను చక్కగా అలంకరించి పూజించారు. బ్రాహ్మణోత్తములను పూజించి ధనధాన్యాలను, గోవులను, వస్త్రాలను సమర్పించారు.

సర్వరూపాలనూ ధరించినవాడూ, సర్వులలో అంతర్యామిగా ఉండేవాడు అయిన కృష్ణుడు గోపాలురతో కలిసి గిరిని పూజించాడు. గిరిరూపంలో గోపాలుర పూజలను, నివేదనలను స్వీకరించాడు. గిరిపూజ నిర్విఘ్నంగా జరిపించాడు.

అనంతరం ఈ విషయం తెల్సిన ఇంద్రుడు ఆగ్రహావేశాలతో సంవర్తకాది ప్రళయకాలమేఘాలను వ్రేపల్లెలో ఉరుములు, మెరుపులు, పిడుగులు, శిలలతోకూడిన జడివానను కురిపించుమని ఆదేశించాడు. వెంటనే వ్రేపల్లెలో పెనువర్షం ప్రారంభమైంది. ఆ వర్షపుధాటికి తట్టుకోలేక వ్రేపల్లె కకావికలమైంది. అందరూ 'కృష్ణా!' అంటూ ఆక్రందిస్తూ కృష్ణుని శరణు వేడారు.

'అనన్యాశ్చింతయంతో మాం యేజనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్'

ఇంద్రునిగర్వాన్ని అణచివేయడానికి గోపాలురచేత ఇంద్రపూజ మాన్పించి గిరిపూజ చేయించిన కృష్ణుడే గోపా

**16-01-2026న కనుమపండుగ సందర్భంగా...**

లుర రక్షణభారాన్ని వహించాడు. అంతవరకు వారు పూజించిన గోవర్ధనగిరినే అలవోకగా పైకెత్తి చిటికెనవ్రేలిపై నిలిపి ఛత్రంలా పట్టుకుని బాలుడని సందేహించిన తనపట్ల పరిపూర్ణవిశ్వాస ముంచి పశుగణాలతోసహా అందరినీ కొండక్రిందకు రమ్మని పిలిచాడు. వెంటనే అందరూ తమ రక్షణభారం కృష్ణునిపై వేసి గిరిఛ్ఛత్రంక్రిందకు చేరారు నిశ్చింతగా.

ఈ విధంగా ఏడు అహోరాత్రాలు గడిచాయి. ఇంద్రుడు తన ప్రయత్నం ఫలించకపోవడంతో మేఘాలను నివారించి వెనుకకు వెళ్లిపోయాడు. ఏడురోజులుగా కురుస్తున్న కుంభవృష్టి క్షణంలో నిలిచిపోయింది. అంధకారం తొలగిపోయి సూర్యప్రకాశం నిండింది. కృష్ణుని ఆదేశంప్రకారం అందరూ కొండక్రిందనుంచి వెలుపలికి రాగా, గిరిని యథాస్థానంలో నిలిపాడు కృష్ణుడు. తమను కాపాడిన కృష్ణుని కౌగలించుకుని దీవించారు అందరూ.

శ్రీకృష్ణుడు గావించిన గోవర్ధనోద్ధరణం అటు ఇంద్రునికీ, ఇటు యాదవులకీ జ్ఞానోదయాన్ని ప్రసాదించింది. శ్రీకృష్ణుడు సాక్షాత్తు పరదైవమే అని తెల్సింది.

"కనులు తెరువని కడు చిన్నిపాంపడై దానవి చనుబాలు త్రావిచంపె"నంటూ కృష్ణుడు గావించిన పూతనాది దానవసంహారాలను గుర్తుకు తెచ్చుకుని "నీ కుమారుడు మానవమాత్రుడు కాదు సుమా" అని ప్రశంసించారు. నందరాజు కృష్ణుడు జన్మించినపుడు గర్గమహర్షి పలికిన మాటలను స్మరించి "శంక లేదు కృష్ణుండు లోకరక్షకుండైన పుండరీకాక్షుని నిజాంశ యని" ప్రకటించాడు. సంశయనివృత్తి కల్గిన గోపాలురు శ్రీకృష్ణుని భక్తిప్రపత్తులతో పూజించారు.

తలకెక్కిన అహం, మదం దిగిపోయిన ఇంద్రుడు "గిరినెత్తిన బాలగోపాలుడే" దేవాదిదేవుడని గుర్తించి సకల దేవతాగణాలతోను, దేవగోమాత సురభితోను వచ్చి కృష్ణుని పాదాలంటి శరణువేడాడు. క్షమనర్థించాడు.

"నీ సమదోద్రేకము ద్రుంచివైచుటకే" ఇంద్రయాగాన్ని మాన్పించాను. ఇక నీ అహంకారాన్ని వదలి నా ఆజ్ఞలు శిరసా వహిస్తూ నీ ఇంద్రాధికారాన్ని నిలుపుకో"మని హెచ్చరించాడు కృష్ణుడు.

గోమాత సురభి కృష్ణునికి నమస్కరించి, స్తుతించి "గోవులు, బ్రాహ్మణులు, సాధుసత్పురుషులను కాపాడే ప్రభువుగా నీకు పట్టముకట్టి రమ్మని బ్రహ్మ మమ్మల్ని పంపించాడు" అని విన్నవించింది.

అప్పుడు దేవేంద్రుడు సకలదేవతాగణాలతో కలసి సురభిక్షీరధారలతో, ఆకాశగంగపవిత్రజలాలతో కృష్ణుని అభిషేకించి "గోవింద" నామంతో గౌరవించాడు.

చిన్నికృష్ణుని పట్టాభిషేకాన్ని కళ్ళారా గాంచిన నారదాది మహర్షులు, గంధర్వాదులు హరిలీలలను గానం చేయగా, అప్సరసలు నాట్యం చేశారు. దేవతలు పుష్పవృష్టిని కురిపించారు. ముల్లోకాలు ఆనందంతో పరవశించాయి.

వ్రేపల్లె 'గోవింద" నామస్మరణతో ప్రతిధ్వనించింది. గోవులు క్షీరాన్ని వర్షించాయి. గోవత్సాలు ఆనందంతో కాళ్ళ గజ్జెలు ఘల్లుఘల్లుమనగా గంతులు వేశాయి. గోకులం 'గోలోకంలా" విరాజిల్లింది.

శ్రీమన్నారాయణుడు అనంతనామధేయుడు. అయినా కృష్ణావతారంలో స్వామి పొందిన గోవిందనామం సార్థకనామం.

'గాం భూమిం ధేనుం స్వర్గం వేదం వా విందతి'– ఇతి గోవిందః"– భూమినీ, గోవులను, స్వర్గాన్నీ, వేదాలను పొందినవాడు గోవిందుడు.

యజ్ఞవరాహరూపంలో భూమిని ఉద్ధరించినవాడు–

గోవర్ధనగిరినెత్తి గోవులను కాపాడినవాడూ– మత్స్య రూపంలో వేదోద్ధరణ కావించినవాడూ..... గోవిందుడు.

"గోవిందో గోవిదాంపతిః"– అని భీష్ముడు కృష్ణుని స్తుతించాడు.

కృష్ణావతారానికి కొనసాగింపుగా మనం విశ్వసించే కలియుగప్రత్యక్షదైవం వేంకటేశ్వరునికూడా మనం "గోవింద" నామంతో పిలుస్తూ అలనాడు భూమాతనీ, గోమాతలనీ, వేదాలనీ ఉద్ధరించినట్లుగా మమ్మల్నికూడా కాచి రక్షించుమని ప్రార్థిద్దాం.

"గోవింద గోవింద యని కొలువరే" అని లోకానికి బోధించాడు అన్నమయ్య.

# పింగళి సూరన వర్ణించిన తిరుమల

– శ్రీ యలమర్తి మధుసూదన,
94416 82894

తిరుమల తిరుపతి క్షేత్రప్రసిద్ధి మన తెలుగు మహా కావ్యాల్లో విరివిగా కనపడుతుంది. మహాకవి పింగళిసూరన రచించిన 'కళాపూర్ణోదయం'లో తిరుమల క్షేత్రమహిమ, వెంకటేశ్వరుని జగన్మోహనరూపం వర్ణించబడినాయి. తాను స్వయంగా స్వామిని దర్శించి పొందిన అనుభూతి కావ్యంలోని పాత్రద్వారా అభివర్ణించి చెప్పాడు పింగళిసూరన.

ఈ కావ్యంలో మొదటి కథానాయకుడు మణికంధరుడు అనే గంధర్వుడు. ఇతడు ద్వారకలో ఉన్న శ్రీకృష్ణుణ్ణి దర్శించుకొని నారదమహర్షి అనుజ్ఞతో అక్కణ్ణుంచి తీర్థయాత్రలకు బయల్దేరాడు. కాశీ, గయా, ప్రయాగ మొదలైన అనేకతీర్థాలు సేవించుకొంటూ వచ్చి అహోబలస్వామిని దర్శించుకొని, అక్కణ్ణుంచి తిరుమల చేరుకొన్నాడు. ఈ తిరుమలక్షేత్రం పంచభూతాలకు సైతం పావనత్వం కలుగజేస్తుంది అన్నాడు సూరన. అదెట్లా అంటే...

'మణిమయమైన గోపురప్రాకారాలవల్ల అగ్నికి, పవిత్ర వింజామరల గాలి మిళితం కావడంవల్ల వాయువుకు, అసంఖ్యాకంగా వచ్చిన భక్తుల ఆభరణాలు ఒకదానికొకటి రాచుకొనగా రాలిన రజంవల్ల భూమికి, వివిధరకాల వాద్య ఘోషలు నిండడంవల్ల ఆకాశానికి, అగరు, ధూపం మొదలైన సుగంధాలు కలవడంవల్ల నీటికి పావనత్వం కలిగిస్తున్న వేంకటేశుని నగరి చేరుకున్నాడట!

అలా చేరుకొని స్వామి పుష్కరిణిలో స్నానం ముగించుకొని, వరాహమూర్తిని దర్శించి, తర్వాత పరివారదేవతలందరిన్నీ తిలకించి, ఆ పైన స్వామిని దర్శించాడు మణికంధరుడు.

మృదుపదాంబుజములు మెరుగుటందెలు పైడి
దుప్పటియును మొలముప్పిడియును
మణిమేఖలము బొడ్డు మానికంబును వైజ
యంతియు నురమున నలరు సిరియు
వరదహస్తము గటి వర్తిల్లుకేలు శం
ఖము జక్రమును దాల్చు కరయుగంబు
దారహారంబులు జారుకంఠంబు ని
ద్దపు జక్కులును నవ్వు దళుకు పసలు

మకర కుండలములును దామరల దెగడు
గన్నులు మనోజ్ఞనాసయు గలికి బొమ్మలు
ముత్తియపు నామమును రత్నమకుటవరము
నెసగ గనుపట్టు శ్రీవేంకటేశుజూచె




ఎంతమంది స్నేహితులున్నారని కాదు గొప్ప, ఆపదలో ఆదుకునే స్నేహితులుంటే అదీ గొప్ప

ఈ పద్యంలో స్వామిపాదాలనుండి శిరసువరకు మనోజ్ఞాంగములు, ఆభరణాలు వర్ణించబడ్డాయి అంటే.. మణికంధరుని చూపులు మొదట పాదాలనుండి క్రమంగా పైకి మణిమకుటందాకా వ్యాపించాయన్న మాట. ఇక్కడొక ఔచిత్య ముంది. భగవంతుణ్ణి మొదట పాదాలనుండి దర్శించాలన్నది సిద్ధాంతం. భగవంతుడు పరబ్రహ్మం. భక్తుడు పాదదాసుడు. పాపమోచనానికీ, పరమపదానికీ భగవంతుని పాదాలే భక్తునికి శరణ్యం. కాబట్టి ముందు పాదదర్శనమే శ్రేష్ఠం.

స్వామిని దర్శించిన అప్పటి మణికంధరుడు తన అనుభూతి తానే ఇలా చెప్పుకుంటున్నాడు. 'స్వామి పాదాల మీద చిక్కుకున్నది నా దృష్టి. దాన్ని కనకాంబరంమీదికి ఎలా మళ్లించాలి? కనకాంబరంమీద నిలిచిన నా చూపు కదలడం లేదు. దాన్ని స్వామివారి కటిభాగంమీదకి ఎప్పుడు తేవాలి? కటిభాగంమీద నాటుకున్న నా దృష్టి మరలడం లేదు. దాన్ని శ్రీవత్సంమీదకి ఎలా చేర్చాలి? శ్రీవత్సంలో చేరిపోయిన నా చూపు తిరిగి రావడం లేదు. ఇక స్వామివారి చేతులమీదికి ఎప్పుడు మరలించాలి? ఆ చేతులమీద, కంఠంమీద, అలాగె మోవి, కుండలాలు, గండభాగం, ముక్కు, కనులు, బొమలు,



తల వెంట్రుకలమీద ఎక్కడ నిలిపినా సరె అక్కడనుంచి మరలి రావడం లేదు. ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? అన్నాడు.

పదపద్మముల జిక్కి పాయదు నా దృష్టి
కనకాంబరమున కేకరణిదెత్తు?
కనకాంబరమున గీల్కొనిన జలింప దే
నుదరబంధమున నెట్లొనరగూర్తు
నుదరబంధమున నింపొంది భేదిల్లదు
శ్రీవత్సమునకెట్లు జేరదిగుతు
శ్రీవత్సమున దారసిలిన రానేరదు
కేలుదామరలకే క్రియమర్తలు

కేలుదామరలను గళశ్రీల మోవి
మకరకుండలముల గండమండలముల
నాస గనుగవ బొమల గుంతలములందు
నెందు బర్విన విడజాల దేమిజెప్ప?!

## వైకుంఠపాళి
### :: 120 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 సం | | | 2 ఆం | జ | నే | యు | డు |
| 3 వి | క్రాం | తి | | గ్ల | | | | |
| | తి | | 4 వ | సం | త | పం | 5 చ | మి |
| 6 వి | | | | వ | | | లి | |
| 7 జ | య | | 8 మ | త్స | ర | ము | | 9 భీ |
| య | | 10 భీ | | రా | | | | ష్మై |
| | | ష్మో | | ది | | 11 క | | కా |
| 12 కృ | ష్ణా | ష్ట | మి | | | ను | | ద |
| ష్ణ | | మి | | 13 ధా | త | ము | | శి |

మన దేవాలయాలు

# గరుడతీర్థము

– శ్రీ కాటం వీరాస్వామి, 98664 02327

మద్దిలేరునదీతీరమున ఖాద్రీపురము అనే ఊరు ఉండేది. ఆ పురంలో జ్ఞానార్యుడు, సుగుణమతి అనే బ్రాహ్మణ దంపతులు ఉండేవారు. వారికి ఒక కుమారుడు ధర్మనార్యుడు. వారు తమ కుమారుని అల్లారుముద్దుగా పెంచారు. తల్లి దండ్రులనుండి సంక్రమించిన సంప్రదాయాలను పాటిస్తూ దైవభక్తిపరాయణుడై తల్లిదండ్రులను పూజిస్తూ ఉండేవాడు. యుక్తవయస్సుకు రాగానే ధర్మనార్యునికి బ్రాహ్మణకన్యను తెచ్చి వివాహం చేశారు.

కాలం గడుస్తూ ఉన్నది. ధర్మనార్యుని తల్లిదండ్రులు ముసలివారయ్యారు. జ్ఞానార్యుడు మరింత వృద్ధుడై బదరీక్షేత్రానికి వెళ్లి అక్కడే దేహం చాలించాడు. తండ్రి మరణం తెలియగానే ధర్మనార్యుడు అంతక్రియలు చేసి, అనంతరకర్మలు చేసి తండ్రికి ఉత్తమగతులు కల్పించాడు.

కొంతకాలం గడచింది. తల్లికి ఇహలోకవిషయాలపై మోహంతో కాలం గడచిపోయింది. సర్వేశ్వరుని సేవించాలన్నా శరీరం సహకరించడంలేదు. నాయనా! మీ తండ్రిగారు పరమ పదించిన పితామహుల పితృకార్యాలు బదరీక్షేత్రంవద్ద ఉన్న బ్రహ్మకపాలం వద్ద చేశారు. నా తదుపరి మాతృకార్యాలుకూడ బ్రహ్మకపాలంవద్ద నిర్వహించమని కోరింది.

కాలం గడుస్తూ ఉంది. సుగుణమతి భగవంతుని ధ్యానంలో ఉన్న సమయంలోనే తనువు చాలించింది. ధర్మ నార్యుడు మాతృమూర్తి మరణానికి కొంతసేపు చింతించి తర్వాత ధైర్యం తెచ్చుకొని అంత్యక్రియలు శాస్త్రోక్తంగా జరిపించాడు. అస్థికలను బదరీక్షేత్రంవద్ద ఉన్న బ్రహ్మకపాలంలో నిమజ్జనం చేయాలని బదరీయాత్ర బయలుదేరాడు.

అలా రోజులు ప్రయాణం చేసి ఒకరోజు 'శుభ' అనే ఊరు చేరుకుని సంధ్యావార్చేసమయం కావడంతో ఒక బ్రాహ్మణోత్తముని వాకిటి అరుగుపై సంధ్యవార్చి దైవధ్యానంలో నిమ్నగ్నమైనాడు.

ధర్మనార్యుడు కూర్చున్న అరుగు ఇంటి యజమాని ఆవును పెంచుతున్నాడు. ప్రతిరోజు ఆ ఆవు ఇచ్చే పాడితో సమృద్ధిగా ఇల్లు గడుస్తున్నది. ఆ రోజు ఆ యజమాని పనిమీద వెళ్లి బాగా పొద్దుపోయాక ఇల్లు చేరుకున్నాడు. ఈలోగా ఇల్లాలుకూడ పనిపాటల్లో మునిగిపోయి ఆవుపాలు పితకడం మరచిపోయింది.

ఇంతలో ఆవుదూడను పాలు త్రాగేందుకు వదిలాడు. తనను తల్లివద్దకు వదలకుండా కట్టేసి ఉంచడంతో బాగా ఆకలిగా ఉన్న లేగదూడ చెంగుచెంగున తల్లిని చేరబోతూ హడా వుడిగా విప్రుని కాలు తొక్కింది. బయట తిరిగి అలసిన బ్రాహ్మణునికి దూడ కాలుతొక్కడంతో పట్టరాని కోపం వచ్చి కర్ర తీసుకొని చిన్న దూడ అనిచూడకుండా నిర్దాక్షిణ్యంగా కొట్టాడు. ఇదంతా చూస్తున్న ఆవుకు విపరీతమైన కోపం వచ్చింది.

అయితే, తల్లిని చేరానన్న సంతోషంతో దూడ పొదుగు చేరి పాలుత్రాగడం మొదలుపెట్టింది. ఆవు తన దూడను ప్రేమతో శరీరమంతా నాలికతో నాకుతూ విప్రునిపై కలిగిన కోపాన్ని మరచిపోయింది. కాసేపు పాలుత్రాగిన దూడను తల్లి నుంచి దూరం చేసి విడిగా కట్టి పాలు పితుకుకొని ప్రతిరోజు ఈ పని పూర్తి కాగానే తల్లి దగ్గరకు దూడను వదిలే విప్రుడు ఇప్పుడు దూరంగా కట్టుకొయ్యకు కట్టి పాలగిన్నెను తీసుకొని వెళ్లిపోయాడు.

ఇదంతా గమనిస్తున్న తల్లి ఆవుకు కోపం రెట్టింపు అయ్యింది. మనిషి ఎంత విశ్వాసహీనుడు. అతని జీవితం సజావుగా సాగేందుకు ఉపకరించే గో జాతిపై మనిషికి ఎంత చిన్నచూపు. పొరపాటుగా కాలు తొక్కినందుకే ఇంతగా చితక బాదాలా; అదేగాక తన బిడ్డను తనవద్దకే పాలు తాగేందుకు వదలకుండా వెళ్లిన ఈ విప్రునికి ఎంత పొగరు, ఆ పొగరును అణిచి బుద్ధి చెప్పాలి అని మనసులో అనుకొని తన దూడకు వినబడేలా బయటకు చెప్పింది.

తల్లిమాటలు విన్న దూడ అమ్మా! అనవసరంగా ఆ విప్రునిపై కోపం ఎందుకు? పూర్వజన్మలో పాపమేమిటో



తెలియదు గాని, ఇప్పుడిలా మూగజీవులమై పుట్టాం. ఈ జన్మలో మళ్లీ ఇంతటి పాపాన్ని మూట గట్టుకుని మరోజన్మకు అహ్వానం పలకడం వెఱ్ఱితనం కాదా. నేను విప్రుని కాలు తొక్కడంవల్లనే కదా నన్ను కొట్టాడు. దాంతో ఇద్దరి తప్పులు సరికి సరి అయ్యాయని సరిపెట్టుకొని మిన్నకుండడం ఉత్తమమైన పని కదా!

కర్మఫలం అనుభవించక తప్పదు కదా! నేను ఏనాడో ఆ విప్రోత్తమునికి అన్యాయం చేసి ఉంటాను కాబట్టి ఇలా ఆ పాపం ఈ దెబ్బలరూపంలో ఈ రోజు నేను అనుభవించాల్సి వచ్చింది. అంతేకాని మరొకటి కాదు. ఈ అకారణద్వేషాన్ని వీడి ప్రశాంతచిత్తంతో ఆలోచించు నీకే అర్థమౌతుంది అన్నది.

బిడ్డ చెప్పిన మాటలను ఆలకించిన గోమాత నిజమే నీవు చెప్పినట్లు కర్మానుసారంగానే పరిస్థితులు మారుతాయి. వాటి ఫలితంగా వచ్చిన అనుభవంలోనికి సుఖదుఃఖాలలో సుఖం మాత్రము స్వార్జితంగా వచ్చిందని తల ఎగురవేయడం, దుఃఖానికి విధిని నిందించడం ఈ మనుషులకు అలవాటైంది. ఏమైనా ఈ బ్రాహ్మణుడికి శిక్షపడాల్సిందే. నా బిడ్డను బాధించాడు కాబట్టి అతని కొడుకును కూడా అతనికి దూరం చేస్తాను. ఈ విధంగా పుత్రశోకంతో ఉన్న బాధను అతనితో అనుభవింప చేస్తాను. ఇలా చంపితే బ్రహ్మహత్యాపాతకం చుట్టుకోవడం సత్యమే అయినా ఈ పాపాన్ని హరించడానికి నా వద్ద ఒక ఉపాయం ఉంది. అయితే అలా బయటపడేవరకు ఈ పాపాన్ని అనుభవించక తప్పదు.

నేను ఎప్పుడైతే బ్రాహ్మణకుమారుణ్ణి చంపుతానో అప్పుడే స్వచ్ఛమైన ధవళవర్ణంలో ఉన్న నేను, నా దేహమంతా నల్లటిరంగులోనికి మారిపోతుంది. అప్పుడు నేను ఆ పాపం నుండి బయటపడడానికి నాకు తెలిసిన మార్గం అవలంబిస్తాను. అప్పుడు ఆశ్చర్యంగా పూర్వపురంగులోకి మారిపోతాను భయపడకు అన్నది తల్లి ఆవు.

ఎంత చెప్పినా వినడంలేదని ఆవుదూడ మౌనంగా ఉండిపోయింది. ఏం జరుగుతుందో అని ఆవు, దూడ మాట్లాడుకోవటం విన్న ధర్మనార్యుడు అరుగుపై పడుకోవటానికి అనుమతిచ్చిన బ్రాహ్మణునికి విషయం తెలియజేస్తామని ఆలోచించి తర్వాత విరమించుకొని తెల్లవారితే ఏమి జరుగుతుందో ఆవు చెప్పినట్లు బ్రహ్మహత్యాపాపంనుండి ఎలా బయటపడుతుందో చూడాలని ధర్మనార్యుడు ఎదురు చూడసాగాడు.

ఇందుకు సాక్ష్యంగా రాత్రి కనుమరుగై తెల్లవారింది. ఎవరిపనులలో వారు నిమ్మగ్నమైనారు. ఆ రోజు బయటికి వెళ్ళేపని ఉండటంతో తన కుమారుని పాలు పితకమని ఆదేశించి తండ్రి నిత్యకర్మలలో మునిగిపోయాడు. దాంతో విప్రకుమారుడు దూడను పాలకోసం వదిలాడు. పాలకోసం ఆవువద్దకు రాగానే కోపంతో ఒక్కసారిగా తన వాడియైన కొమ్ములతో విప్రకుమారుని పొట్టలో పొడిచింది.

దీంతో బాధతో అమ్మా నొప్పి... ఆవు కుమ్మింది... పడిపోతున్నా అని దీనంగా అరుస్తూ కింద పడిపోయాడు. ఇంతలో సంధ్యావార్చుకుంటున్న తండ్రి, తల్లి వంటింటినుంచి పరుగెత్తుకొని రాగానే కుమారుడు విలవిలకొట్టుకుంటూ ప్రాణాలు విడిచాడు.

కుమారుణ్ణి పొట్టన పెట్టుకుందన్న కోపంతో విప్రుడు మహోదుగ్రుడై దుడ్డుకర్రతో బాదసాగాడు. దుఃఖాన్ని ఆపుకో

లేకపోయాడు. ఆవు తన శక్తినంతటిని ప్రయత్నించి కట్టుకొయ్య నుంచి తప్పించుకుంటున్నంతనే ఆవుశరీరం నల్లటిరంగులోకి మారిపోయింది. ఆవు చేస్తున్న ప్రయత్నం ఫలించి తాడు తెంచుకొని పరుగులు పెడుతూ పారిపోసాగింది. ఇలా జరుగుతుందని ముందుగానే ఊహించిన ధర్మనార్యుడు ఆవును వెంబడించాడు.

అలా వెళ్లుతున్న ఆవు మద్దిలేరు నది ఎదురుగా ఉన్న గరుడతీర్థంలో మూడుసార్లు మునిగి లేవగానే ఆవు శరీరం సుందరంగా ధవళవర్ణంలోనికి వచ్చింది. ఇలా ప్రకాశించడాన్ని ధర్మవీర్యుడు గమనించి ఇదంతా ఈ తీర్థమహిమే అని ఆ



తీర్థానికి పూజలు చేసి బయలుదేరాడు. మార్గంలోనే ధర్మనార్యునికి ఒక సుందరమైన స్త్రీ ఎదురుపడింది. విప్రోత్తమా! ఎక్కడనుండి వస్తున్నావు? ఇక్కడ నీ పని ఏమిటి? అని ప్రశ్నించింది.

సరాసరి ఆమెవద్దకు వచ్చి ఉబ్బితబ్బిబ్బైపోయి అమ్మా! నీవు ఎవరో తెలియదు కాని మానవమాత్రురాలివి కాదు అని తాను వచ్చిన వైనమును పూర్తిగా వివరించాడు. అందుకు ఆ కాంత, ద్విజోత్తమా! నేను గంగాదేవిని. నీవు స్నానం చేసినది గరుడతీర్థంలో. ఇందులో స్నానం చేస్తే ఎంతటి పాతకాలైనా పరిహారమైపోతాయి. ఈ రోజు వైశాఖ శుద్ధ సప్తమి. ఈ రోజు ఇందులో స్నానం చేసి మునిగితే అంతులేని పుణ్యం వస్తుంది.

నీ తల్లి అస్థికలు ఈ తీర్థంలో కలిపెయ్యి ఆమెకు పుణ్యగతులు కలగడమేకాక ఇక మరుజన్మ ఉండదు అని చెప్పి గంగాదేవి అదృశ్యమైంది.

గంగామాత చెప్పినట్లు అస్థికలు గరుడతీర్థంలో కలిపి చూస్తుండగానే అతని తల్లి దివ్యదేహంతో ఊర్ధ్వలోకాలకు వెళుతూ, నీవు పుత్రపౌత్రులతో, సిరిసంపదలతో వర్ధిల్లుదువుగాక! అని దీవించి తల్లి స్వర్గలోకానికి వెళ్లిపోయింది.

తరువాతికాలంలో భార్యాపుత్రులతో, సకలఐశ్వర్యాలతో, సుఖశాంతులతో జీవించాడు ధర్మనార్యుడు.

పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ....




**నూతన ఆంగ్ల సంవత్సర**

**మరియు**

**సంక్రాంతి శుభాకాంక్షలు!**





దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని

కరుణాకటాక్షవీక్షణాలు అందరిపై అనవరతం

ప్రసరించాలనీ మరియు ఆయురారోగ్య

ఐశ్వర్యాలు ప్రసాదించాలనీ

స్వామివారిని ప్రార్థిస్తూ...

మీ... ప్రధాన సంపాదకుడు

108 దివ్యదేశాలు

# తెన్ తిరుప్పేరై

## (నవతిరుపతులు - 6)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

ఈ దివ్యదేశం తిరునల్వేలినుండి తిరుచ్చెందూర్ వెళ్ళే దారిలో ఆళ్వార్ తిరునగరి అనే దివ్యదేశంయొక్క తూర్పు దిక్కున 6 కి.మీ.ల దూరంలో తామ్రపర్ణినదీ దక్షిణతీరంలో అద్భుతమైనప్రాకారంతో, మంచి ప్రకృతి రామణీయకతతో విలసిల్లియున్నది. ఈ ఆలయంయొక్క మూలమూర్తి మకర నెడుంకుళై క్కాదన్, నిగరిల్ ముకిల్ వణ్ణన్ అనే రెండు తిరు నామములతో తూర్పుదిక్కును చూస్తూ నిలుచున్నభంగిమలో వేంచేసి ఉన్నారు. అమ్మవారు కుళైక్కోదైవల్లినాచ్చియార్ అలాగే తిరుప్పేరైనాచ్చియార్ అనే ఇద్దరుదేవేరులు ప్రత్యేకసన్నిధిలో వేంచేసి ఉన్నారు.

### స్థలపురాణం

సంస్కృతభాషలో "బేర" అనే శబ్దానికి శరీరమని, విగ్రహమని అర్థములున్నాయి. ఇచ్చట భగవంతుడు వరాహ, వామన అవతారాలను స్వీకరించిన సందర్భములో భూమా దేవిని ఉద్ధరించి తనయొక్క శ్రీపాదస్పర్శచేత భూమాదేవిని కాపాడారు. ఏదో ఒక సందర్భములోనే శ్రీమన్నారాయణుడు ఆశ్రితులను అనుగ్రహించడానికై ఈ భూలోకానికి వస్తున్నాడే తప్ప తనకు స్వామివారిపై ఉన్నటువంటి విశేషానురాగాన్ని తెలుసుకోకుండా ఉన్నాడని, అలాగే విరామసమయంలో ఆనందంగా ఉండాలని భూమాదేవి చాలా ఆశపడింది.

| | | |
|---|---|---|
| 1) భగవానుడు | : | మకరనెడుంకుళైక్కాదన్, నిగరిల్ ముగిల్వణ్ణన్ (మకరాయత కర్ణభూషణ) |
| 2) అమ్మవారు | : | కుళైక్కోదైవల్లిఅమ్మవారు, తిరుప్పేరైనాచ్చియార్ |
| 3) పుష్కరిణి | : | శుక్రపుష్కరిణి, శంఖతీర్థం |
| 4) క్షేత్రం | : | తెన్ తిరుప్పేరై |
| 5) విమానం | : | భద్రవిమానం |
| 6) ప్రత్యక్షం | : | బ్రహ్మ, శివులకు ప్రత్యక్షం |
| 7) హస్తము | : | వరదహస్తం |
| 8) ముఖము/స్థితి | : | తూర్పుముఖం, కూర్చున్నసేవ |
| 9) మంగళాశాసనం | : | నమ్మాళ్వార్ |
| 10) ఆగమం | : | పాంచరాత్రం |

భూదేవియొక్క ఆకాంక్షను, అభిలాషను భగవంతుడు తెలుసు కొని ఆవిడ ఆశను నెరవేర్చాలనే ఉద్దేశంతో వైకుంఠాన్ని వదిలిపెట్టి భూలోకాన్ని చేరాడు. అలా వచ్చిన స్వామి, అలా ఒక యుగం గడిచినాకూడా వైకుంఠానికి వెళ్ళకుండా ఇక్కడే భూమాదేవితో ఉండిపోయాడు. దీనిని తెలుసుకున్నటువంటి మహాలక్ష్మి చాల భయంతో తనకన్నాకూడా భూమాదేవి రెట్టింపు అందముతో ఉండడంచేత నారాయణుడు ఆవిడ దగ్గరకు వెళ్ళిపోయారేమోనని కాస్త అసూయను పొంది దీనికి ఉపాయాన్ని చెప్పమని దుర్వాసమహర్షిని అడిగింది. ఆ ముని కూడ మహాలక్ష్మియొక్క ప్రార్థనను స్వీకరించి భగవంతుని దగ్గరకు వెళ్ళి ఈ విషయాన్ని తెలియజేశాడు.

ఈ సమయంలో భూమిపిరాట్టి దుర్వాసమహర్షి వచ్చిన విషయాన్ని తెలిసికొనికూడా ఎటువంటి ఉపచారం చేయలేదు, నమస్కరించలేదు. మహర్షి కోపంతో ఏ సౌందర్యముచేత నీవు పరంధామున్ని వశపరుచుకున్నావో ఆ సౌందర్యము నీనుండి తొలగిపోతుంది. ఏ శ్రీదేవికన్నా అందంగా ఉన్నానో అని నీవు తలుస్తున్నావో ఆ మహాలక్ష్మియొక్క రూపం బేరంగానే నీవు అగుగాక అని శాపమిచ్చాడు. మునియొక్క శాపాన్ని విని భీతి చెందిన భూమాదేవి శాపవిమోచనాన్ని అడుగగా దుర్వాస మహర్షి తామ్రపర్ణినదీతీరముయొక్క దక్షిణదిక్కులో ఉన్నటు వంటి హరిపదక్షేత్రనదిలో స్నానంచేసి తపస్సు చేయమని తత్ఫలితంగా నీ నిజస్వరూపం పొందగలవని చెప్పి మహా మంత్రాన్నికూడా ఉపదేశించాడు. మునియొక్క నియమనంతో మహాలక్ష్మిరూపాన్ని ధరించినటువంటి భూమాదేవి కఠిన తపస్సు చేయడంవలన ఈ హరిపదక్షేత్రం "బేరా" అనే

నామాన్ని పొందింది. కాలక్రమంలో ఈ క్షేత్రం "తిరుప్పేళై"గా పరిణమించింది. తమిళ పంగునినెల పూర్ణిమతిథియందు తామ్రపర్ణినదిలో ఎప్పుడైతే స్నానానికి వెళ్ళినదో ఆ సమయంలో చేపరూపాన్ని ధరించినటువంటి రెండు కుండలములు భూమా దేవియొక్క చేతికి దొరికాయి. వాటిని భగవంతునికి సమర్పించగా దేవదేవుడుకూడా చాలా సంతోషంతో మకరకుండలాలను ధరించడం జరిగింది. అందుచేత ఆ స్వామికి తమిళంలో మకర నెడుంకుళైక్కాదన్ అని పేరు. భూమాదేవియొక్క అగాధప్రేమను అంగీకరించాలని చెప్పి అర్చావతారమునే కలియుగంలో తాను స్వీకరింపబోయే అవతారమనేది పలుఅంశాలతో కూడి ఉండడంచేత అలాగే దివ్యదేశములు చాలా ఈ లోకంలో వస్తున్నాయి కనుక అందులో ఆ దివ్యదేశ దేవాలయంలో శ్రీదేవితో సమానమైనటువంటి భూమాదేవికూడా అక్కడ మాతో గర్భగృహంలోనికి విచ్చేసి భక్తులకు అనుగ్రహాన్ని ఇవ్వాలని ఆ భూమిపిరాట్టియొక్క దుఖాన్నికూడా అచ్చట తొలగించి ఇచ్చట వేంచేసియున్నాడు కావున ఈ క్షేత్రానికి "తిరుప్పేళై" అని పేరు వచ్చినది. ఎవరైతే ఈ స్వామిని దర్శించుకుంటారో వారు సకలపాపములు పోగొట్టుకొని భగవంతుని సన్నిధిని చేరుకుని అమందానందాన్ని అనుభవింపగలరు.

**ధ్యానశ్లోకము :**

ప్రఖ్యాతే మకరాంగకుండల ధరః ప్రాలమ్బికర్ణాహ్వయః
తద్వల్యా సహ పార్వతీశవరదః చ ఆసీనరూపోహరిః।
యో వై భద్రవిమాన మధ్యవిలసత్ శ్రీశంఖతీర్థాన్తికే
తస్మిన్ దక్షిణదిక్కృహద్పురవరే ధ్యాయామి తం ప్రాఙ్ముఖమ్॥

# శ్రీ ఆండాళ్ 'నీరాట్టోత్సవం'

## (2026, జనవరి 07 నుండి 13 వరకు శ్రీ ఆండాళ్ నీరాట్టోత్సవంసందర్భంగా....)



గోదాదేవి శ్రీకృష్ణపరమాత్మను భర్తగా కోరి ధనుర్మాసవ్రతమాచరించింది. ఈ వ్రత జ్ఞాపకంగా ధనుర్మాసంలో వచ్చే భోగిపండుగకు ఏడురోజులముందు అనగా జనవరి ఏడోతేదీన నీరాట్టోత్సవం ప్రారంభమౌతుంది.

ఆ రోజున శ్రీగోదాదేవి ధనుర్మాస పూజానంతరం పల్లకీని అధిష్ఠిస్తారు. అలా అధిష్ఠించి తిరుపతిలో ఉన్న గోవిందరాజస్వామివారిగుడినుండి తిరువీథుల్లో ఉత్సవంగా బయలుదేరుతారు. అలా బయలుదేరి రామచంద్రతీర్థంకట్టమీదున్న నీరాట్టమండపానికి వేంచేస్తారు. అక్కడ ఆమెకు నీరాట్టం (అభిషేకం), నివేదనం, శాత్తుమొఱ, ఆస్థానం జరుగుతాయి. అలా ఆ సాయంకాలంవరకు అక్కడే ఉంటారు. ఆ తర్వాత ఆమె పుష్పాలంకారభూషితయై తిరుచ్చినధిష్ఠించి తిరువీథుల ఉత్సవంగా గోవింద రాజస్వామివారి కోవెలకు వేంచేస్తారు. ఆ విధంగా ఏడురోజులు ఉత్సవాలు జరిగి నీరాట్టోత్సవం పూర్తౌతుంది.

ఎనిమిదోరోజున అనగా భోగిపండుగరోజున ఆండాళ్ శ్రీకృష్ణస్వామితో సహా భోగితేరును అధిష్ఠిస్తారు. ఆ సాయంకాలం తిరువీథులఉత్సవం జరిగి సన్నిధికి వేంచేస్తారు. ఆ రోజునే గోదాపరిణయం జరుగుతుంది. శ్రీకృష్ణస్వామితోసహా వేడుకలు జరుగుతాయి. కనుమపండుగనాడు శ్రీ గోదాపరిణయోత్సవం జరుగుతుంది. ఇదే ప్రసిద్ధ ఆచారంగా నేటికీ కొనసాగుతోంది.



ఎదుటివారు మారాలని ఆశించకు. మార్చాలని ప్రయత్నించకు. మనం మారితే సరిపోతుంది

## తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

### జనవరి 2026

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | 31 |



ఉభయనాంచారులతో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారు, దేవునికడప

### ఫిబ్రవరి 2026

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |

### మార్చి 2026

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | 31 | | | | |

#### జనవరి

01 ఆంగ్లసంవత్సరాది
14 భోగి
15 మకరసంక్రాంతి
16 కనుమ, గోదాపరిణయోత్సవం
19-27 దేవునికడప, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవం
25 రథసప్తమి
26 రిపబ్లిక్ డే
29 భీష్మఏకాదశి

#### ఫిబ్రవరి

01 రామకృష్ణతీర్థముక్కోటి
08-17 తిరుపతి, శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
08-16 శ్రీనివాసమంగాపురం, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
15 మహాశివరాత్రి
24 నుండి మార్చి 04 వరకు తరిగొండ, శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవం

#### మార్చి

03 కుమారధారాతీర్థముక్కోటి, లక్ష్మీజయంతి
15 అన్నమాచార్యవర్ధంతి
17-25 తిరుపతి, శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం
19 శ్రీ పరాభవనామసంవత్సర 'ఉగాది'
21 మత్స్యజయంతి
26 నుండి ఏప్రిల్ 03 వరకు ఒంటిమిట్ట, శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం
27 శ్రీరామనవమి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



ఉభయనాంచారులతో శ్రీ వేదనారాయణస్వామివారు,
నాగులాపురం

## ఏప్రిల్ 2026

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | | |

## మే 2026

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| 31 | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |

## జూన్ 2026

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | | | | |

### ఏప్రిల్

01 తుంబురుతీర్థముక్కోటి
14 తమిళసంవత్సరాది
20 పరశురామజయంతి, అక్షయతృతీయ
21 శ్రీ శంకరజయంతి
22 శ్రీ రామానుజజయంతి
30 నృసింహజయంతి, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జయంతి

### మే

01 కూర్మజయంతి
01-09 నాగులాపురం, శ్రీ వేదనారాయణ స్వామివారి బ్రహ్మోత్సవం
02 అన్నమాచార్యజయంతి
12 తిరుపతి గంగజాతర
23 - 31 తిరుపతి, శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం

### జూన్

25 - 29 తిరుచానూరు, శ్రీ పద్మావతీదేవి తెప్పోత్సవం
25 నుండి జూలై 03 వరకు అప్పలాయగుంట, శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
26 - 28 తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకం
29 ఏరువాకపూర్ణిమ

# తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

## జూలై 2026

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | 31 | |



ఉభయనాంచారులతో శ్రీ మలయప్పస్వామివారు,
తిరుమల

## ఆగష్టు 2026

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| 30 | 31 | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |

## సెప్టెంబర్ 2026

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | | | |

### జూలై

16 జగన్నాథ రథయాత్ర
17 తిరుమల శ్రీవారి ఆణివరఆస్థానం
17 - 19 శ్రీనివాసమంగాపురం, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కారవైభవోత్సవం
25 తొలిఏకాదశి
29 గురుపూర్ణిమ, వ్యాసపూర్ణిమ

### ఆగష్టు

07 ఆడికృత్తిక
15 భారత స్వాతంత్ర్యదినోత్సవం
16 నాగచతుర్థి
17 గరుడపంచమి
21 మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వర్ధంతి, వరలక్ష్మీవ్రతం
28 శ్రీ హయగ్రీవజయంతి, శ్రావణపూర్ణిమ

### సెప్టెంబర్

04 కృష్ణాష్టమి, గోకులాష్టమి
13 బలరామజయంతి, వరాహజయంతి
15-23 తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవం
14 వినాయకచవితి
23 వామనజయంతి
25 అనంతపద్మనాభవ్రతం

## తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



శ్రీ అలమేలుమంగతాయారు,
తిరుచానూరు

### అక్టోబర్ 2026

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | 31 |

### నవంబర్ 2026

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | | | | | |

### డిసెంబర్ 2026

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | 31 | | |

#### అక్టోబర్

02 మహాత్మాగాంధీజయంతి
10 మహాలయఅమావాస్య
12-20 తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవం
17 సరస్వతిపూజ
19 దుర్గాష్టమి, మహానవమి
20 విజయదశమి

#### నవంబర్

08 నరకచతుర్దశి, దీపావళి
09 కేదారగౌరీవ్రతం
13 నాగులచవితి
21 క్షీరాబ్దిద్వాదశి, చక్రతీర్థముక్కోటి
24 కార్తికపౌర్ణమి

#### డిసెంబర్

06 ధన్వంతరిజయంతి
06-14 తిరుచానూరు, పద్మావతీదేవి బ్రహ్మోత్సవం
14 పంచమీతీర్థం
15 సుబ్రహ్మణ్యషష్ఠి
16 ధనుర్మాసారంభం
20 వైకుంఠఏకాదశి, గీతాజయంతి
21 శ్రీ స్వామిపుష్కరిణీతీర్థముక్కోటి
23 శ్రీ దత్తజయంతి

# కలగంటి కలగంటి..

## (వారణం ఆయిరం)

- డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్,
77993 00342

మన సనాతనధర్మం మహోన్నతమైంది. ప్రతి విషయాన్ని పరిశీలించి, పరిశోధించి ధార్మిక స్పష్టతను, సంప్రదాయ విశిష్టతను వివరించడం జరిగింది. ప్రస్తుతం మనం కనే కలలు, దీనికి స్వప్నశాస్త్రమే ఒకటి ఉందని అంటారు. వ్యక్తి అంతర్గతభావోద్వేగాలకు, ఆలోచనాప్రపంచానికి ఈ కలలు అద్దాలన వచ్చు. ఇవి కొన్ని సందర్భాలలో భవిష్యత్ దర్శనానికి సంకేతాలు కూడా కావచ్చు. అయితే, కొన్ని కలలు జీవాత్మను ఆధ్యాత్మికప్రపంచానికి అనుసంధానం చేయడం విశేషం. ఫలితంగా కలగన్న వ్యక్తి నైజం, నైసర్గిక భావజాలం, ధర్మపరాయణత, భక్తిభావపరంపర, ఈ భక్తి తీవ్రతలో ఐహికాన్ని మరచి, పారలౌకికమైన సుజ్ఞాన మాధుర్యాన్ని ఆస్వాదించే క్రమంలో పరమాత్మను దర్శించినట్లు, పరమాత్మతో మాట్లాడినట్లు, పరమాత్మ సాన్నిహిత్యంలో తన ఊహలకు, ఊసులకు, అంచనాలకు, ఆరాధనలకు సానుకూలమైన, అవ్యక్త సుమధుర సన్నివేశాలను అనుభవించినట్లు కలలు కనడం అబ్బురమేమీ కాదు. శాస్త్రీయత ఎలా ఉన్నా సమాజవిశ్వాసం బలీయమై "యద్భావం తద్భవతి"లా ఫలితాలు పరిణమించడం కద్దు.

ప్రస్తుతం మన గోదాదేవి అలాగే కల కన్నది. చెలులకు వివరించింది. ఆ గోదాదేవిమాత కలలో మధుర ప్రణయభక్తి తత్పరతలో పరమాత్మతో తన పరిణయాన్ని భావించుకొంది. అనుభవించింది. జీవాత్మ పరమాత్మ పరిష్వంగభాగ్యం ఒక యోగం. మధురభక్తి సంయోగం. ఆత్మీయతాదీప్తుల మహాభోగం. ఈ యోగభోగాల కల్యాణగీతాల గాంధర్వరాగాలకు నిలువుటద్దమే ఆండాళ్‌తల్లి కలల అనుభూతి. ఇదో ఆధ్యాత్మిక విభూతి. అదే "వారణం ఆయిరమ్" పాశురాల సంపుటి.

పన్నిద్దరు ఆళ్వారులలో ఏకైక మహిళాఆళ్వారు గోదామాత. మధురభక్తి సామ్రాజ్యంలో ప్రభవించిన మరో రాధమ్మ. భక్తితత్త్వాన్ని, పరమాత్మ సత్యాన్ని తనలో అణువణువులోనూ సంతరించుకొన్న సుజ్ఞాన సౌశీల్యమూర్తి. ద్రవిడ సంగీత సాహిత్యాల దీప్తి. దివ్యప్రబంధాల కీర్తి. ఆళ్వార్ల చరిత్రను పావనంచేసిన మనోహరమూర్తి గోదాదేవి. ఈ తల్లిని ఆండాళ్, కోదై, ఆముక్తమాల్యద, చూడిక్కొడుత్త నాచ్చియార్ అని కూడా పిలుస్తారు. భూదేవి అంశతో, తులసివనంలో, విష్ణుచిత్తునకు బిడ్డయై వచ్చిన తల్లి. విష్ణుచిత్తుడే పెరియాళ్వారు. ఈయన గరుత్మంతుని అంశ అని నానుడి. శ్రీమహావిష్ణువునకు వాహనమైన గరుత్మంతుని జన్మ ధన్యం చేయడానికి, స్వామి గోదాదేవిని చేపట్టి ఆయనకూ అల్లుడైనాడని ప్రతీతి. మొత్తానికి జన్మబంధాలు, కర్మబంధాలు, ఆధ్యాత్మిక అనుబంధాల కలయికలే ఈ అవతారాల సంబంధ భక్తి బాంధవ్యాలు.

**16-01-2026న గోదాపరిణయోత్సవం సందర్భంగా..**

అలా పుడమికి వచ్చిన గోదాదేవి విష్ణుభక్తి అదే శ్రీవిల్లిపుత్తూరులోని వటపత్రశాయిగ వేంచేసియున్న శ్రీకృష్ణపరమాత్మ భక్తిసాగరంలో సదా మునిగి తేలడం విశేషం. ఆళ్వార్ అనగా భక్తిసాగరంలో మునకలు వేస్తూ, భక్తితత్త్వపులోతును అనుభవంతో తెల్సిన జ్ఞానులు అని అర్థం. అయితే, ఈ భక్తి పారవశ్యంతో ఈ ఆళ్వారులు అనేక దివ్యప్రబంధాలను రచించి, పాడి, స్వామిని తృప్తిపరచి ధన్యతను పొందారు. అందులో 4000 పాశురముల సంపుటి నేటికిని "నాలాయిరమ్" అనే దివ్యగ్రంథమై, ద్రవిడవేదంగా ప్రసిద్ధిని పొంది, శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని, భక్తితత్త్వాన్ని ప్రచారం చేస్తోంది.

అలాగే, గోదామాత "తిరుప్పావై" అనే పేరుతో 30 పాశురాలను రచించి, పాడి, శ్రీరంగనాథుని చేపట్టింది. అదే

ధనుర్మాసంలోని సిరినోము లేదా శ్రీవ్రతం. మరో రచన "నాచ్చియార్ తిరుమొళి". దీనిలో 143 పాశురాలలో స్వామిని కీర్తించింది. ఆ పరమాత్మపై తనకున్న మధురభక్తి భావనా తరంగాలకు అక్షరరూపం కల్పించింది. శ్రీకృష్ణపరమాత్మపై తనకున్న ప్రేమను చెప్పి, తన స్వామిని తన దగ్గరకు తీసుకొని రమ్మని మన్మథుని, అతని తమ్ముడు సాంబుడిని ప్రార్థించింది.

అంతటితో ఆగలేదు. కన్పించిన కోకిలతో తన ప్రణయభక్తిని ఏకరువు పెట్టి, తన స్వామికి నివేదించుమని కోరింది. కన్పించిన తరులు, విరులు, నీలిమేఘాలద్వారా స్వామికి సందేశం పంపింది. పరమాత్మ విరహంలో, జీవాత్మ గోదామాత చిక్కి శల్యమైంది. అంతిమదశలో అంపశయ్యపై పరుండిన భీష్మునిలా తానున్నానని, కనికరించి, తన స్వామిని ఏలుకోవడానికి రమ్మని చెప్పమని పలువిధాలుగా తనచుట్టూ చేరిన వారిని కోరింది. స్వామి పాంచజన్యాన్ని ఉద్దేశించికూడా తన వేదనను తెలియచెప్పింది. కాని అనుకూలమైన సమాధానాలు, సంకేతాలను పొందలేనిస్థితిలో ఆముక్తమాల్యద కలగన్నది. తాను కన్న కలలో వైభోగాన్ని చెలికి వివరించింది.

అదే "నాచ్చియార్ తిరుమొళి"లోని "వారణం ఆయిరం" అనే భాగం. నాచ్చియార్ తిరుమొళి అనగా గోదాదేవత దివ్యపాశురములు అని అర్థం. ఇందులో 14 భాగాలు, 143 పాశురములున్నాయి. 6వభాగమే "వారణం ఆయిరమ్" అనే భాగం. స్వప్న సన్నివేశం. 11 పాశురాల భాగం.

సాహిత్యాన్ని కైంకర్యసాధనంగా ఆళ్వారులు భావించారు. పాశురగానానికి మూలం ముగ్ధభక్తి. కాని ఇది మూఢభక్తి కాదు. పరమాత్మను చేరాలన్న జీవుని నివేదన అమలిన ప్రణయభావానికి మూలం. మధురభక్తితత్త్వానికి నీరాజనం. గోవిందుడు తనకు నాయకుడు లేదా నాథుడై తనలో ఐక్యం చేసుకోవాలన్న తపన. అందుకే శ్రీవారి దాసీగా ఉండి తాను సేవ చేసుకోవాలన్న తాపత్రయాన్ని పడింది గోదామాత. తన నిట్టూర్పులకు ఎలాంటి ఓదార్పు లభించనిస్థితిలో ఆ తల్లి కలగన్న భాగ్యాన్ని అనుభవించింది. పదకవితాపితామహుడు అన్నమయ్య "కలగంటి కలగంటి" నంటూ "ఎల్లలోకాలకు అప్పడగు తిరువేంకటాధీశుని కన్నాను. శ్రీహరియే నాకు, మనకు, అందరకు గురువైన స్వామిని చూచా"నని చెప్పడం విని, ఆస్వాదించాలి. అలాగే "వారణం ఆయిరం శూళవలంశెయ్దు" అంటూ గోదామాత స్వప్నవైభోగాన్ని గానం చేసింది.



వెయ్యిఏనుగులతో గోవిందుడు ఊరేగింపుగా వస్తున్నాడట. పట్టణం మొత్తం మంగళతోరణాలు అలంకరించియుండగా, బంగారు పూర్ణకుంభాలతో కన్యలు స్వామికి స్వాగతం చెప్తుండగా, స్వామి పెళ్లికుమారునిగా రావడం ఆండాళ్ కలలో చూచిందట. సహస్రనామ సంకీర్తనీయుడైన స్వామి, వక్కచెట్టుకోశాలతో అలంకరించబడిన పెళ్లిపందిరి లోనికి వచ్చాడట. దివ్యులు ఆండాళ్‌తో పెళ్లి ఏర్పాట్లు చర్చించారట. స్వయంగా దుర్గామాత, ఎంతకాదన్నా తనకు ఆడుబిడ్డకదా, గోదాదేవికి చీరకట్టి సింగారించిందట.

వేదవిదులు సంప్రోక్షణ- వేదవచనలఘోష తాను విన్నదట. కన్నదట. స్వామికి కంకణధారణ జరిగిందట. మంగళహారతులమధ్య స్వామి గంభీరంగా, మంచి హుందాగా దర్శనమిస్తున్నాడట. ఆండాళ్‌తల్లి చేతిని తన చేతిలోనికి తీసుకొని స్వామి పాణిగ్రహణం చేశాడట. తాను స్వయంగా స్వామి చెయ్యిపట్టుకొని అగ్నిప్రదక్షిణ చేసిందట. స్వామి స్వయంగా గోదా మాత పాదం పట్టుకొని "సన్నికలు" పై ఉంచాడట. లాజహోమం దివ్యంగా జరిగిందట. పన్నీట జలకాలాడిన తరువాత గోదారంగనాథులు పురవీథులలో ఊరేగారట- ఇదంతా అమ్మవారు కలలో అనుభవించిన భక్తిభావప్రవాహతరంగాలు. అవే చెలులకు చెప్పడం జరిగింది.

ఈ కలకు సంబంధించిన పాశురాలు విన్నా, చదివినా భగవద్బంధువులై, శ్రీవారిసేవకు పాత్రులవుతారని ఫలశ్రుతిని కూడా వివరించడం జరిగింది.

ఇదంతా ఒక ముగ్ధభక్తిభావము. సదా పరమాత్మసాంగత్యాన్ని కోరుకొనే జీవాత్మలవైనం. లౌకికం పట్టని పారలౌకికమైన పరమాత్మ దివ్యసన్నిధిని చేరుకోవాలన్న జ్ఞానులయిన భక్తుల మార్గమిది.



కలియుగంలో నామసంకీర్తనలతోనే జీవులు భవబంధవిముక్తులై పరమపదాన్ని పొందుతారన్నది అనన్యమైన శరణాగతితో ఆళ్వారులు నిరూపించారు. గోదాదేవి కూడా ఆ దారిలోనే నడచి ప్రపత్తితో అనగా అన్నీ విడిచి "నిన్నే శరణు కోరుతున్నాను", "భారమంతా నీదే" అని భక్తితన్మయత్వంతోనే స్వామిలో లీనమైంది. నిశ్చలం, నిర్మలం అయిన భక్తికి పరాకాష్ఠ గోదాదేవి.

## నవంబరు నెల క్విజ్ - 40 సమాధానాలు

01) కార్తికశుక్లపంచమి
02) 12 ఏండ్లు
03) బ్రహ్మ
04) చంచలమైనది
05) సుప్రకాశుడు
06) శర్యాతి
07) పేయాళ్వారు
08) సోదరీతృతీయ
09) గురుగీత
10) కమలావతి
11) కణ్వుడు
12) సంహితలు
13) బ్రాహ్మణాలు
14) ఉపదేశం
15) బ్రహ్మం

### సరైన సమాధానాలు వ్రాసినవారు-

1)ఎస్.సత్యసూర్య అభయరామ్, పశ్చిమగోదావరి 2)ఎన్.సుహాంత్ అమర్త్య, తిరుపతి 3)ఎన్.గౌతమ్ మహేష్, తూర్పుగోదావరి 4)జి.వి.రియాశ్రీ, చెన్నై 5)వై.సాయివాణి, బెంగళూరు 6)సి.హెచ్. తేజస్వివేదాంశు, విశాఖపట్టణం 7)ఎస్.వి.కృష్ణారావు, టాటనగర్ 8) పి.లక్ష్మీశ్రీఅన్విత్, విశాఖపట్టణం, 9)వి.తన్మయి, రాజమహేంద్రవరం 10)టి.జయవీర్ అరుణ్, హైదరాబాదు 11)కె.శ్రీచరణ్, కోదాడ 12)ఎమ్.విష్ణువందన, విజయవాడ 13)డి.సాకేతన్‌శర్మ, వై.ఎస్.ఆర్.కడప.

# లక్ష్మీగడప

– శ్రీమతి దణ్యంరాజు జ్యోతిర్మణి,
82775 32959

19-01-2026 నుండి 27-01-2026 వరకు
దేవునికడప, శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి
బ్రహ్మోత్సవం సందర్భంగా...

దేవాలయం లోపలికి ప్రవేశించేటప్పుడు, దేవతామూర్తులు నెలవై ఉన్న ఆలయ గోపురమహాద్వారగడపను ఒక దైవస్వరూపంగా భావించి వంగి నమస్కరిస్తాం. ఈ గడపపై కాలు మోపకుండా ఆలయంలోనికి ప్రవేశిస్తాం. చిన్న పిల్లలను సహితము తల్లిదండ్రులు ఎత్తుకొని గడపను దాటించడం మనం చూస్తూ ఉంటాం. గుడిలోని దేవతామూర్తులకు నిత్యం దేవతార్చన చేసే అర్చకుడే ఐనా, గుడికి కాపలాదారుడే ఐనా, దర్శనానికి వచ్చే భక్తులే అయినా మహాద్వారగడపకు నమస్కరించి ఆలయప్రవేశం చేస్తారు. గుడి అయినా, గృహం అయినా ముఖద్వార-గడపకు అంతటి గౌరవం ఉంటుంది. దేవాలయ గర్భగుడి గడపలు పర్వతశిలలతో చేయబడతాయి. వీటికి రాగి, ఇత్తడి, వెండి లేదా బంగారురేకులతో తాపడం చేస్తారు. దైవసన్నిధిలో ఉండే ఆలయ గడప దైవదర్శనానికి తొలిమెట్టు.

హైందవసంప్రదాయంలో మనం నివసించే గృహం సహితం ఒక దేవాలయమే. ఇంటి సింహద్వారపు గడపకు కూడా దేవాలయ గడపవలె గౌరవం ఇస్తాం. గడపను ఒక లక్ష్మీస్వరూపంగా కొలుస్తాం. గృహనిర్మాణం చేసేటప్పుడు 'మేలైన కలప'తో చెక్కిన గడపకు పసుపురాసి, కుంకుమపెట్టి, గడప క్రింది నేలభాగంలో పంచలోహాలను నిక్షిప్తంచేసి, శుభ ముహూర్తములో సింహద్వారాన్ని అమరుస్తాం. ఇంటి గడప, లోపలి శుచికి, వెలుపలి అశుచికి మధ్య ఒక హద్దు. గృహప్రవేశం తరువాత గృహిణిలు ప్రాతఃకాలసమయంలో ఈ గడపను శుభ్రపరిచి ఇంటిముందు రంగవల్లులు తీర్చిదిద్దుతారు. గడపను వివాహాది శుభకార్యములలోను, పర్వదినాలలోను ఆయాదేవతామూర్తులరూపంలో కొలుస్తూ ఉంటారు. గడపపై కాలు వెయ్యడం, అశుచిగా ఉంచడం శుభప్రదం కాదని భావిస్తాం.

వివాహానంతరం నూతన వధువు, అత్తవారి ఇంటికి వచ్చినప్పుడు సింహద్వారపు గడపకు మ్రొక్కి, తన కుడి పాదముతో గడపను దాటి, గృహలక్ష్మిగా గృహప్రవేశం చేస్తుంది. 16 దినములు తమ ఇంటి గడపను భక్తిశ్రద్ధలతో పూజిస్తే పెండ్లి కాని పిల్లలకు వారి వివాహం జరుగుతుందని, భార్యాభర్తలకైతే వారి ఇంటిసమస్యలు తీరుతాయని అంటారు.

గడపను 'గౌరీదేవత'గా భావించి 'గడప-గౌరి' నోమును ఒక సంవత్సరకాలం నోచుకొని ఉద్యాపన చేసుకొనే సంప్రదాయమును చూస్తూ ఉంటాం. గడప ఇంటిలోపలి



దేవతామూర్తులకు ఒక ప్రతిరూపమని అంటారు. సంక్రాంతి పండుగకు గృహమును శుభ్రపరచి వెలుపల ముగ్గులు వేసి, ముఖద్వారాన్ని మామిడాకులతోను, పువ్వులతోను అలంకరించి, గడపను పసుపుకుంకుమలతోను, పువ్వులతోను పూజించి పుష్యమాసంలో ధాన్యలక్ష్మికి ఆహ్వానం పలుకుతారు. శ్రావణ మాసంలో శ్రావణశుక్రవారంనాడు గడపను, ముఖద్వారాన్ని అలంకరించి శ్రీమహాలక్ష్మీదేవిని ఆహ్వానిస్తారు. దీపావళిపండుగ నాడు ద్వారానికి ఇరువైపులా చమురుదీపాలను వెలిగించి గడపను దీపలక్ష్మిగా భావించి ధనలక్ష్మిని కొలుస్తారు. మార్గశిర మాసములో పసుపుకుంకుమలతో గడపను సేవించి కనక మహాలక్ష్మిదేవతను ఇంటిలోనికి ఆహ్వానిస్తారు. గడప మన కోసం మన ఇంటిముంగిట నిలిచిన మహాలక్ష్మి.

ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలోని కడప నగర పరిధిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారు వెలసి ఉన్న ప్రాంతం దేవుని గడపగా ప్రసిద్ధి చెందినది. కాలినడకన– తిరుమల వేంకటేశ్వరుని దర్శనానికి వచ్చే భక్తులు, రామేశ్వరం వెళ్ళే ఉత్తరాది భక్తులు, దక్షిణాదినుండి కాశీకి వెళ్ళే భక్తులు ప్రప్రథమంగా ఈ క్షేత్రాన్ని దర్శించి వెళ్తూ ఉండే ఆనవాయితీవలన, ఈ ప్రదేశానికి 'దేముని గడప' / 'తొలి మెట్టు' అనే పేరు వచ్చింది. ఇది హనుమత్‌క్షేత్రము. ఈ 'గడప'యే కాలక్రమములో నేటి 'కడప' నగరమైనది.





తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి శయనమందిరానికి, స్వామి గర్భాలయానికి మధ్య ఉన్నటువంటి మొదటి గడప బంగారురేకుతో తాపడం చేయబడి ఉంటుంది. అర్చకులకు మాత్రమే ఈ బంగారుగడపను దాటుటకు ప్రవేశం కలదు. ఈ గడపను "కులశేఖరపడి" అని పిలుస్తారు. ఒకానొకప్పుడు కులశేఖరుడు అనే మహారాజు కేరళ దేశాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. పన్నెండుగురు వైష్ణవ ఆళ్వారులలో ఒకడు. శ్రీవేంకటేశ్వరస్వామివారికి పరమభక్తుడు. ఈయన శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ఆరాధిస్తూ నిత్యం స్వామి వారిని "స్వామీ! వేంకటేశ్వరా! నేను నీ ఎదుట రాతిగడపనై యుండినచో నీ ముఖారవిందమును నిత్యమూ చూడవచ్చును కదా!" అని వేడుకుంటూ ఉండేవాడు. ఈ 'కులశేఖర ఆళ్వారుని' స్వామివారు కరుణించినట్లుగా– వేంకటేశ్వర స్వామివారి విగ్రహం ఎదుట ఉన్న 'గడప'– "కులశేఖరపడి" అని ప్రాచుర్యము పొందినది.

'గడప' అనగానే మనకు దుష్టశిక్షణ శిష్టరక్షణ కొఱకు; లోపల– బయటా కాని 'గడప' మీద కూర్చుని హిరణ్యకశిపుణ్ణి సంహరించిన విష్ణుమూర్తి అవతారమైన శ్రీఉగ్ర నరసింహస్వామివారి వృత్తాంతము, తద్వారా "గడప" విశిష్టత, పవిత్రత మనకు స్ఫురణకు రాక మానదు.

**ఈ మాసంలో 'దేవునికడప'లో స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవంలో స్వామి అనేక వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహిస్తాడు. ఈ ఉత్సవంలో అనేకమంది భక్తులు పాల్గొని దేవుని ఆశీర్వాదాలు పొందుతారు.**

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు


ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్

తెలుగు- శ్రీదేవీ మురళీధర్

97388 59553


*గత సంచిక తరువాయి భాగం....*

క్రిమికంఠచోళుడి మృతి తరువాత శ్రీరంగనాథుని పిలుపునందుకుని రామానుజులు శ్రీరంగానికి ప్రయాణం అయ్యారు. భక్తులు, శిష్యులు దుఃఖిస్తుంటే తమ విగ్రహం చెక్కించి దానిని కౌగలించుకుని తమ అంశను అందులో ప్రవేశింపజేశారు. 'మీ సందేహాలకు ఈ మూర్తి మీకు సమాధానం చెబుతుంది. నా సంపత్కుమారుని, నా సెల్వపిళ్లైను కంటికి రెప్పలా కాపాడండి' అని అప్పగించి బయలుదేరారు. అత్యంత మహిమాన్వితమైన రామానుజుల మూర్తిని 'పేశుమ్ యతిరాజ' అని సంబోధిస్తారు. అది సాక్షాత్తు రామానుజులే!

విరోచనుడు వైకుంఠంలో శ్రీమన్నారాయణుని వజ్ర కిరీటాన్ని అపహరించి పాతాళంలో దాచగా గరుడుడు దానిని సాధించి రామప్రియ శిరస్సును అలంకరించాడు. ఆస్తికులు 'వైరముడి' ఉత్సవం వైభవంగా జరిపినప్పుడు స్వామి వజ్ర కిరీటంతో దర్శనమిచ్చి, పురంలో ఊరేగింపుగా సాగాడు.

మేల్కొటే మాహాత్మ్యం విన్న తరువాత యాత్రికులు బస్సులో మైసూరు పరకాల మఠం చేరుకున్నారు. మరునాడు వారు హేడతలేలో లక్ష్మీకాంతపెరుమాళ్, వేణుగోపాల, యోగ లక్ష్మీనరసింహులదర్శనం చేసుకున్నారు. నారాయణ్‌భట్టర్ హేడతలే చరిత్రను క్లుప్తంగా వివరించాడు. అందరూ హేమబర్గళ చేరుకుని శ్రీ రుక్మిణి, సత్యభామాసహిత వేణుగోపాలస్వామి దర్శనం చేసుకున్నారు; అక్కడినుంచి అందరూ గుండుల్పేట వినయ నారాయణ పెరుమాళ్‌దర్శనానికి ప్రయాణాన్ని కొన సాగించారు. ఉడయవర్ స్థాపించిన పంచనారాయణమూర్తు లలో ఇది ఒకటి. ఇక్కడ అర్చకుడు దర్శనం చేయించి, ఆచార్యుల గుండుల్పేట ఆలయసందర్శన సూచించే శిలా శాసనాన్ని చూపించాడు. ఆలయం ఏ.ఎస్.ఐ. ఆధీనంలో ఉంది. స్వర్గసందర్శకులు శ్రీకరస్వామికి యాత్ర చేయించి నందుకు కృతజ్ఞతలు చెబుతూ వీడ్కోలు పలికారు. ఇతర సందర్శకులందరూ మైసూరు చేరుకొని శ్రీకరస్వామికి కృత జ్ఞతలు తెలిపి సెలవు తీసుకున్నారు.

ఆ తెల్లవారుజామున శ్రీకరస్వామికి స్వర్గసందర్శకుల వాస్తవదర్శనం లభించింది. నారదుడు, ఇతర గంధర్వులు పుష్పకవిమానంలో భూలోకానికి చేసిన మనోహరమైన ప్రయాణం గురించి సర్వాంతర్యామికి నివేదిస్తున్నట్లు కని పిస్తుంది. రామానుజునితో సంబంధం కలిగిన ప్రదేశాలను మాత్రమే వారు ఎందుకు సందర్శించాలని అనుకున్నారని మహావిష్ణువు అడిగితే దానికి నారదుడు రామానుజుడే జగ దాచార్యుడని, కలికాలంలో ఆయనే ప్రత్యక్ష దైవమని చెప్పాడు. భగవానుడు అంగీకరించి దరహాసం చిందించాడు.

- స్వస్తి -

(సమాప్తం)



మన అడుగుజాడలు గొప్పగా ఉంటేనే మన వెనకటితరం వారికి ఆదర్శనీయులమౌతాం

యువవాణి

# యువత – నైతికత

– శ్రీ యం. రవితేజ

మన వారసత్వం మహోన్నతమైనది. మనిషిలోని నైతికత అందుకు చిహ్నం. శక్తివంతమైన ఆయుధాలకన్నా నైతికబలమే మనిషికి రక్షణకవచం. విద్యావ్యవస్థ, వివాహవ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, సామాజికవ్యవస్థలు నైతికతపై ఆధారపడి ఉన్నాయి. పై నాలిగింటిలో కుటుంబవ్యవస్థ మొదటిది. రెండవది విద్యా వ్యవస్థ. భారతీయుల మూలాలన్నీ ఉపనిషత్తులు, రామాయణం, భారత, భాగవతాదిగ్రంథములలో ఇమిడి ఉన్నాయి. మనిషి మనీషిగా ఎదగడానికి సత్ప్రవర్తన, ఋజుమార్గం అత్యంత ప్రధానమైనవి. ఆ మార్గాలను అనుసరించిన మనిషి మహోన్నతుడై మనీషిగా మారగలుగుతాడు. దానికి పునాది కుటుంబమే. కుటుంబంలోని ఐక్యతే దీనికి ప్రథమసోపానం. కుటుంబంతో ఉన్నప్పుడు మనిషియొక్క ఆలోచనవిధానం కూడా ఉన్నతంగా ఉంటుంది. ఐకమత్యమంటే ఒకరికి ఒకరు సహాయంచేసుకోవటంలో ఆనందం తెలుస్తుంది. భారతీయతలో కుటుంబానికి అత్యంత ప్రాధాన్యత ఉన్నది. పసితనం తల్లి ఒడిలో, ఆ తరువాత పాఠశాలలో విద్యాభ్యాసంతో 20 ఏళ్ల జీవితం సాగిపోతుంది. ఈ సమయమే వ్యక్తి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దటానికి పునాది అవుతుంది.

వ్యక్తిగా ఎదగటానికి శ్రద్ధ, లక్ష్యం, ఏకాగ్రత, క్రమ శిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం, సంయమనం, ఐకమత్యం అనే ఎనిమిది ముఖ్యమైన లక్షణాలు. మిగిలిన లక్షణాలెన్నున్నా ఇవి అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నవి. దానికి ముందుగా శ్రద్ధ మొదటి సోపానం. ఏ పని చేసినా శ్రద్ధా, ఆసక్తి ఈ రెండింటి తోటి చేయగలగాలి. చేసే పనిలో శ్రద్ధ లేక పోతే మనం చేసే పనిలో సఫలీ కృతులం కాలేం. విద్యార్థి శ్రద్ధతో చదవకపోతే ఉత్తీర్ణతను సాధించ లేడు. మనిషి వ్యక్తిత్వ నిర్మాణా నికి శ్రద్ధే మొదటిమెట్టు.



తర్వాత రెండవది లక్ష్యం. లక్ష్యం అంటే చేయదలుచు కున్న పనిని ఒక క్రమపద్ధతిలో చేయడం. విద్యార్థులు ప్రారంభ సమయంలోనే లక్ష్యాన్ని నిర్ణయించుకోగల గాలి. ఆ లక్ష్యాన్ని చేర టానికి ఎంతకష్టా న్నైనా తట్టుకోవడానికి సిద్ధపడాలి.





ఇక్ష్వాకువంశపురాజైన సగరుడు యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞాశ్వము వెనక ఆయన కుమారులు 1000 మంది వెళ్లారు. కపిలమహర్షి ఆశ్రమం లోని యజ్ఞాశ్వాన్ని చూశారు. మహర్షి తపస్సు భగ్నంచేసి ఆయన కోపజ్వాలలో భస్మమయ్యారు. తరువాత వారి వంశ జుడైన భగీరథుడు పావనగంగను భస్మరాసులపై ప్రవహింపచేస్తే వారికి ఉత్తమగతులు కలుగుతాయని అంటే గంగను భూమిపైకి తేవటాన్ని లక్ష్యంగా నిర్ణయించుకొని తపస్సు ప్రారంభించి, గంగను భువిపైకి తెచ్చి చివరకు తన పితరులకు ఉత్తమగతు లను కలుగచేశాడు. లక్ష్యాన్ని చేరుకోవటం ఎంతటి కష్టసాధ్య మైనా కృషిని మానరాదు! అనేది ఈ కథద్వారా తెలుస్తున్నది.

"ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస తంత్రులై
ఆరంభించి పరిత్యజింతురువిఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్విఘ్ననిహన్యమానులగుచు న్ధృత్యున్న తోత్సాహులై
ప్రారబ్ధార్థములుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్గావునన్"

అని ఏనుగులక్ష్మణకవి తన సుభాషితాలలో చెప్పి ఉన్నారు. కనుక లక్ష్యం అనేది ఎంతటి ఔన్నత్యాన్ని చేకూరు స్తుందో ఈ పద్యంద్వారా మనకు తెలుస్తున్నది.



మూడవది ఏకాగ్రత. ఏకాగ్రతతో చేసే ఏ పని ఐనా సరే విజయాన్ని కలుగజేస్తుంది అని చెబుతారు. దానికి అర్జునుడు ఉదాహృతి. ద్రోణాచార్యులు కురుపాండవులకు విద్య నేర్పించే సమయంలో చెట్టుమీదున్న ఒక పక్షిని చూపి దాని నేత్రాన్ని ఛేదించ మని శిష్యులను ఆజ్ఞాపించాడు. కానీ ఎవ్వరు సఫలీకృతులు కాలేకపోయారు. వారిలో అర్జునుడు ఏకాగ్రతతో ఆ పక్షి కంటిని ఛేదించాడు. గురువుగారు చెట్టు కనిపిస్తుందా? కొమ్మలు కనిపిస్తున్నాయా? ఆకులు కనిపిస్తు న్నాయా? అని అడుగగా తనకు పక్షి నేత్రము తప్పితే మరేదీ కనపడటం లేదని చెప్పాడు. అలా ఏకాగ్రతతో శ్రమిస్తే సాధించ లేనిది లేదు అని చెబుతుంది ఈ కథ. కనుక మనిషి తాను చేయదలుచుకున్న పనిలో ఎటువంటి ఆటంకాలు కలిగినా కూడా ఏకాగ్రతతో పని చేయడం అనేది ముఖ్యమైన లక్షణం.

నాలుగవది క్రమశిక్షణ. "క్రమశిక్షణలేని జీవితం చుక్కాని లేని నావవంటిది" అని పెద్దలవాక్కు. బాల్యదశనుండే క్రమశిక్షణ అలవడాలి. క్రమశిక్షణ అనేది ప్రతి ఒక్కరికి అవసరం. ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో గురువులు విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించాలి. క్రమశిక్షణ లేకపోతే దేనిని సాధించలేం. "మొక్కై వంగనిది మానై వంగునా" అన్నది సామెత చిన్నతనంలో పిల్లలకి క్రమశిక్షణ నేర్పకపోతే తర్వాత అసాధ్యమని అర్థం. క్రమశిక్షణ ఉన్నవ్యక్తి సమయపాలన పాటించి పదుగురిలో మెప్పు పొందగలడు. చిన్ననాటి క్రమ శిక్షణయే భావిబంగారుజీవితానికి చుక్కానివంటిది. క్రమ శిక్షణతో విద్యనభ్యసించాడు కనుకనే అబ్దుల్‌కలాం రాష్ట్రపతి స్థాయికి ఎదగగలిగాడు. అటువంటి గొప్పవారి చరిత్రలను ఆదర్శంగా తీసుకుంటే ప్రతివ్యక్తి ఉత్తమపౌరుడు కాగలడు.



**ఉప్పుకప్పురంబునొక్కపోలికనుండు**
**జూడజూడ రుచులజాడవేరు**
**పురుషులందు పుణ్యపురుషులువేరయా**

అన్నది వేమనవాక్కు. ఉప్పు కర్పూరం చూడటానికి తెల్లగానే కనిపిస్తాయి. కాని రుచి వేరు. అలానే చూడటానికి మనుషులందరు ఒకటిగానే ఉన్నా క్రమశిక్షణ వ్యక్తి జీవితంలో మెరుగైన భవిష్యత్తుని, సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని చేరుకోవటానికి దోహదపడుతుంది.

ఐదవది సమయపాలన. కాలమంటే సమయం. గతానికి, ప్రస్తుతానికి, భవిష్యత్తుకు సంబంధించిన భావనయే కాలం. పరిస్థితులు అనుకూలిస్తే కాలం అనుకూలం అనుకుం టారు. ప్రతికూలిస్తే కాలం బాగా లేదనుకుంటాం. కాలాను గుణంగా నడుచుకోవటమే మనిషి బాధ్యత. మనిషి చేయ దలచుకున్న పని లేదా కార్యక్రమాన్ని సమయానికి ప్రారం భించటం, సమయానికి పూర్తి చేయటం ఒక గొప్ప లక్షణం. వ్యక్తి తానుచేసే పనిని ఏమాత్రం జాప్యం చేయకుండా చేయటం సరైన లక్షణాన్ని సూచిస్తుంది. సమయపాలన పాటించే వ్యక్తులు నమ్మకస్తులుగా పరిగణించబడతారు. పాఠశాలలలో విద్యార్థులు సరైన సమయానికి పాఠ శాలకు రావటము వారి క్రమశిక్షణను తెలియ జేస్తుంది. పరిశ్రమ లలో సమయాన్ని సద్విని యోగం చేసే వ్యక్తులు ఉంటే పరిశ్రమలలో ఉత్పత్తి పెరుగుతుంది. ఏదైన సభను లేదా సమావేశాన్ని ఏర్పాటు చేసినప్పుడు ఆలస్యం లేకుండా సమయానికి ప్రారంభించాలి.



ఒక వ్యక్తి ఏదైనా ఇంటర్వ్యూకి వెళ్ళేటప్పుడు సమయానికన్నా ఒక ఐదునిమిషాలు ముందుగానే వెళ్లాలి. పరీక్షకు వెళ్లినా సమ యానికి హాజరవ్వటం అనేది అతని క్రమశిక్షణ తెలియజేస్తుంది. అధికారి సరైన సమయానికి కార్యాలయానికి వస్తే ఉద్యోగస్తులు నిర్దేశిత సమయానికివచ్చి పనులు ముగిస్తారు. అధికారినిబట్టే మిగిలినవారు కూడా.

రైలు ఎక్కాలంటే సమయానికి వెళితేగాని ఎలా ఎక్క లేమో అలానే చేసే పనులలో సమయపాలన లేకపోతే

ఉన్నతస్థాయికి చేరలేం. సమయం సహకరించకపోతే భగవంతుడంతటివానికే తిప్పలు తప్పవుకదా!

"కావ్యశాస్త్రవినోదేన కాలో గచ్ఛతి ధీమతాం।
వ్యసనేన తు మూర్ఖాణాం నిద్రయా కలహేనవా॥"

సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియ చెబుతుంది ఈ శ్లోకం.

ఆరవది ఆత్మవిశ్వాసం. ఆత్మవిశ్వాసమే మనిషికి ఆయుధం. ఆత్మవిశ్వాసం మెండుగా ఉన్నప్పుడు ఎటువంటి కష్టాలనైనా మనిషి అధిగమించవచ్చు. ఆత్మవిశ్వాసం విద్యతో మాత్రమే లభిస్తుంది. విద్యాభ్యాససమయంలో శ్రద్ధ, ఏకాగ్రత, క్రమశిక్షణను పాటించాలి. అన్నింటికన్నా ముందు ఆత్మస్థైర్యాన్ని అలవర్చుకోవాలి. ఆత్మస్థైర్యము కొరవడితే వ్యక్తి జీవితాన్నుంచే పారిపోవటానికి ప్రయత్నిస్తాడు. కష్టాల్ని ధైర్యంగా ఎదుర్కోగలగాలి. మనకు కష్టం కలిగితే ఎవరూ సహాయం చేయలేదని బాధపడకూడదు. తానే తన తెలివితేటల తోటి ఆ కష్టాన్నుంచి బయటపడటానికి ప్రయత్నాలు చేయాలి. కాని నేటి యువతలో అలాంటి ఆత్మస్థైర్యం లోపించింది. అందువలననే ఈనాడు యువత ఆత్మహత్యప్రయత్నాలు చేయడం సంభవిస్తున్నది. ఆత్మస్థైర్యం అనేది విద్యవలననే లభిస్తుంది. కనుక యువత ధైర్యంగా నిలబడాలంటే విద్యను నిర్లక్ష్యం చేయకూడదు.



ఏడవది సంయమనం. సంయమనమంటే మన ఆలోచనలను సరైనమార్గంలో మళ్ళించుకోవటం. కోపతాపాలను అదుపులో ఉంచుకున్నప్పుడే యువత అభివృద్ధిపథంలో సాగుతుంది.

"ఎప్పటికెయ్యది ప్రస్తుత
మప్పటికా మాటలాడి అన్యుల మనమున్
నొప్పింపక తానొవ్వక
తప్పించుక తిరుగువాడు
ధన్యుడు సుమతీ!"



అని సుమతీశతకంలో బద్దెనకవి చెప్పినట్టు మాటలతో కానీ, చేతలతో కానీ ఎదుటివారిని నొప్పించకుండా అందరితోటి కలిసి మెలిసి స్నేహంగా ఉండటమే మనిషి వ్యక్తతకు నిదర్శనం. ఆ స్నేహమే అతన్ని ఉన్నతపథానికి చేరుస్తుంది. ఈ విషయాన్ని తెలుసుకుంటే యువత సమాజాన్ని జయించగలిగిన సామర్థ్యాలను పొందుతారు. సమాజంలో ఒకరుగా కాక సమాజమే తానుగా ఎదగగలుగుతాడు.

చివరిది ఐకమత్యం. ఐకమత్యమంటే నలుగురితో కలిసి మెలిసి ఉండటం. అందువలన కష్టసుఖాలను పంచుకునే మనస్సు ఉంటుంది. ఎదుటివారితో ఎలా మెలగాలి అనే పద్ధతి తెలుస్తుంది. "చిన్ని నా బొజ్జకి శ్రీరామరక్ష" అన్నట్లుగాకాక "ఐకమత్యమే మహాబలం" అన్నట్లుండాలి. గడ్డిపోచ తాను ఒక్కటిగా ఏమీ చేయలేదు. అదే కొన్ని గడ్డిపోచలు కలిపి తాడుగాపేనితే మదపుటేనుగునైనా బంధించవచ్చు. అదే ఐకమత్యం గొప్పతనం. యువత కలిసిమెలిసి ఉంటే సాధించలేనిది ఏది ఉండదు. అందుకే పెద్దలు



"వస్త్రేణ వపుషా వాచా విద్యయా వినయేనచ!
వకారైః పంచభిర్యుక్తః నరోభవతి పూజితః!!"

వస్త్రం, తేజస్సు, వాక్కు, విద్య, వినయము అనే ఐదు లక్షణాలు మనిషి వ్యక్తిత్వానికి గీటురాళ్ళు. మనిషిని చూడగానే, మాట్లాడగానే అతనిలోని వ్యక్తిత్వలక్షణాలన్నీ గ్రహింపచేసేవే పైన చెప్పిన పంచలక్షణాలు.

వ్యక్తిత్వమే యువత ఉన్నతికి ఉత్తమమార్గం.

వ్యక్తిత్వ వికాసం

# కర్మలనుండి విముక్తి

- శ్రీ పుల్లా వేంకటేశ్వర్లు, 94404 76286

ఏ కర్మకి ఏ ఫలితం ఉంటుందో ఆ పరమాత్మకే తెల్సు. మనం చేసిన కర్మఫలితాన్ని అనుభవించడానికి కారణం, దాని విశిష్టతను మన అంతరాత్మ గ్రహించడానికే! ఒకర్ని బాధిస్తే తిరిగి మనకి బాధ కల్గి, ఎంత బాధ అనుభవించాల్సి ఉంటుందో తెల్సుకోవడంద్వారా, మన అంతరాత్మ తిరిగి అలాంటి దుష్కర్మని చేయగూడదని నేర్చుకోవడంకోసం - కర్మ ఫలితాన్ని అనుభవిస్తాము మనం. ఇలా ప్రతి జన్మలో, గతంలో చేసిన వివిధ కర్మలనుండి ఫలితాన్ని అనుభవిస్తూ, వాటినుండి పాఠాలు నేర్చుకుంటూ, ఓ జన్మనుండి మరోజన్మకు 'జీవాత్మ' ఎదుగుతూ, అంచెలంచెలుగా ఆధ్యాత్మికంగా ఎదిగి చివరికి 'పరిశుద్ధ' ఆత్మ అవడమే 'ముక్తి'.

మనకు ఏ కష్టం వచ్చినా దానికి బాధ్యులుగా మనుషులు లేదా పరిస్థితులు కనిపించినా, అది నిజం కాదని, వారు కేవలం, మనం పూర్వంచేసిన దుష్కర్మఫలితాలను అనుభవించడానికే "కారణాలు" మాత్రమేనని గ్రహించి, ఫలితాన్ని నిశ్శబ్దంగా స్వీకరించడమే మంచిది.

బయటికి చెడుకర్మలాగా కనిపించినా, ఒక్కోసారి అది 'భావన'ను బట్టి సుకర్మ కావచ్చు. మనిషికి కర్మ చేయడానికి వెనకగల భావనను బట్టి, అతనికి ఆ కర్మ తాలూకు ఫలితం లభిస్తుంది. అందుకే మన భావనలన్నింటిని గ్రహించే పరమాత్మకి 'భావగ్రాహి' అని ఋషులు పేరుపెట్టారు.

### దుష్కర్మలు

నివారించని ఇతరుల దుష్కర్మ కూడా 'కర్మబంధమే!' అంటే మనం చేసే చెడుకర్మలే కాదు, మనం నివారించగల స్థితిలో ఉండి, నివారించని 'దుష్టుల' చర్యలు కూడా అన్న మాట. అప్పుడు ఆ దుష్టులతోబాటు మనమూ ఆ కర్మఫలాన్ని పొందవల్సి ఉంటుంది.

### దుష్టులతో చేసే సహవాసం

మనం దుష్టులతో ఉండటం అనే దుష్కర్మవల్ల మంచివారుకూడా ఆ కర్మఫలాన్ని అనుభవించాల్సి వస్తుంది.

### అశ్రద్ధ పొరపాట్లు

ఉదాహరణకి, ఇంటికి రంగులు వేసేవాడు ముందర గోడకి ఉన్న పాతరంగుని గీకేసి ఆ తర్వాత క్రొత్తరంగు వేయాలని ఒప్పందం. కాని అతను 'అశ్రద్ధ'గా పాతరంగుని పూర్తిగా గీకేయకుండా, క్రొత్తరంగుని వేసి వెళ్ళాడనుకోండి. ఆర్నెల్లతర్వాత పాతరంగుకూడా నేలరాలిపోతుంది. అలా 'పెయింటర్' ఖాతాలో అది దుష్కర్మగా నమోదవుతుంది.

ఇంకా, మనం చేసే పనిని సమయానికికాకుండా ఆలస్యంగా చేయడంవల్ల అది దుష్కర్మక్రిందకు వస్తుంది. మరింకా, సరియైన సమాచారం ఇవ్వకపోవడం, వనరులు, నిధులు, అధికార దుర్వినియోగం, శ్రమకి తగిన ఫలితం ఇవ్వకపోవడం, కువిమర్శలు చేయడంకూడా దుష్కర్మలే!

దుష్కర్మల ఫలితంవల్ల, మానసికంగాగాని, శారీరకంగాగాని వేదన అనుభవిస్తాం. శారీరకంగా ఫలితాన్ని అనుభవించడానికి 'రోగం'తో బాధపడటం జరుగుతుంది. దుష్కర్మని అంచనా వేయవచ్చు. ఏ అవయవంతో దుష్కర్మ చేస్తే, ఆ అవయవం రోగగ్రస్తమవుతుంది. లేదా ఎదుటివారిలో ఏ అవయవాన్ని మనం కష్టపెడితే, ఆ అవయవానికి రోగం వస్తుంది. అలా మనం చేసే దుష్కర్మలకి, మనం అనుబవించే వ్యాధులకి దగ్గర సంబంధముంటుంది. మనం చేసేది 'ప్రారబ్ధకర్మ' అయితే అది 'బంధం' కాదు. ఇంక అవి ఫలితాన్ని ఇవ్వక అక్కడితో నశించిపోతుంది. అదే "ఆగామికర్మ' అయితేనే, అది కర్మబంధం అయి ఫలితాన్ని ఇవ్వడానికి కాచుకు కూర్చుంటుంది. అందుకే మనం ప్రతి కర్మని భగవంతుడిచేతిలో 'పరికరంగా' చేస్తున్నామని భావించి చేసినా లేదా ఫలితాన్ని అనుభవించకుండా దాన్ని ఈశ్వరుడికి అర్పించే బుద్ధితో చేసినా, అప్పుడు అలాంటి కర్మ తాలుకు ఫలితాలు మనల్ని అంటుకోవు. అలా చేస్తే కర్మ చేసినా, చేయనట్లే!

### ఉత్తమధర్మాలు

1) రోగాలతో బాధపడేవారికి అవి మానడానికి మందులివ్వడం.
2) దుఃస్థితిలో ఉన్నవాళ్లని ఆదుకోవడం.
3) తీర్థయాత్రప్రజలకు అన్నపానాదులిచ్చి ఆశ్రయం కల్పించడం.
4) బంధువులు లేని అనాథప్రేతలకు దహనక్రియ జరపడం.
5) దుఃఖాలపాలైనవారికి ఆ దుఃఖాలనుండి ఉద్ధరించే ఉపాయం ఆలోచించి చెప్పడం.
6) ఓర్పు కల్గి ఉండడం.

పోయినజన్మలో పై ఉత్తమధర్మాలు ఆచరించడంవల్లే ఈ జన్మలో ఎట్టి ప్రయత్నం చేయకుండానే కొందరికి అన్ని కోరికలు నెరవేరుతాయి.



# శ్రీవేంకటేశ్వరలీలలు

# స్వామి కరుణాకటాక్షం

– శ్రీ ఎద్దుల శ్రీనివాసరెడ్డి, 98499 43890

తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామిచెంత శ్రీవారిసేవ చేయాలని నాకు కోరిక ఉండేది. నేను ఎప్పుడు వేంకటేశ్వరస్వామిని మనస్సులో ఇలా అనుకుంటూ ఉండేవాణ్ణి. స్వామి! నీ సేవాభాగ్యం నాకు ఎప్పుడు కల్పిస్తావు అనుకుంటు ఉండగా ఒక రోజు రాత్రి 2.00గంటల సమయంలో నాకు కలలో కన్పించి నీవు నీ స్నేహితులతో నా దగ్గరకు వచ్చి నిల్చుకొని దర్శించుకుంటావు అని నిద్రలేపినాడు. నిద్రలేచి చూస్తే అంతా చీకటిగా ఉంది. వేంకటేశ్వరస్వామి లేడు ఇది కలా? అన్పించింది.

కాని కొన్నిరోజులకు శ్రీవారిసేవలకు రమ్మని మాకు లెటరు వచ్చింది. అప్పుడు క్రిష్ణపుష్కరాలు రావడంతో పదిమంది వస్తామని చెప్పి రాలేదు. ఆరుమంది సభ్యులు మాత్రమే సేవకు వెళ్లాం. మాకు ఇంటిదైవము, ఇష్టదైవము వేంకటేశ్వర స్వామిని నమ్ముకొని సేవకు తిరుమలకు బయలుదేరాం. అలిపిరి మెట్లుమార్గంనుండి పాదయాత్ర చేస్తూ కొండ చేరాం. రాత్రికి స్వామి దర్శనం చేసుకొని, రాత్రికి మాధవనిలయంలో నిద్రించాం. తెల్లవారుజామున నిద్రలేచి 6 గంటలకు శ్రీవారి సేవాసదన్ ఆఫీసుకు వెళ్లాం. అంతవరకు శ్రీవారిసేవ ఆఫీసు మాకు తెలియదు. అక్కడికిపోయిన తర్వాత టేబుల్‌మీద మా అప్లికేషన్ పెట్టాం. మా టీమ్‌ను పిలిచి ఫోటోలు తీశారు. అదేరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 300/– రూపాయలు టిక్కెట్టు దర్శన క్యూలైన్ దగ్గర డ్యూటీ వేశారు. ఒక అతను వచ్చి మా టీమ్‌ను పిలుచుకొని సేవా కార్యక్రమం చేయమని చెప్పి వెళ్లిపోయాడు.

శ్రీవారిసేవ చేస్తు ఉండగా ఒకరోజు గుడిలో డ్యూటి వేసినారు. ఆ రోజు ఏకాదశి. టీమ్‌లీడర్‌ను అయిన నాకు సన్నిధిలో డ్యూటి వేశారు. డ్యూటి పాస్ తీసుకొన్నాను. సెక్యూరిటీ అతను వచ్చి నన్ను రండి అని పిలుచుకుని లోపలికి వెళ్లాడు. అంతవరకు నేను చిన్నతనంనుండి తిరుమల వచ్చిన నేను బలిపీఠము, ధ్వజస్తంభము తాకి దగ్గరగా పోయి నమస్కరించకోవడం జరగలేదు. శ్రీవారిసేవభాగ్యంవల్ల తాకి నమస్కరించుకోవడం జరిగింది. అలా లోపలికి పిలుచుకొని సన్నిధిలో భక్తులను పంపేందుకు ఇక్కడ నిలబడి పంపండి అని చెప్పి వెళ్లిపోయాడు. అక్కడ నిలబడి శ్రీవేంకటేశ్వరస్వామినే చూస్తూ సేవ చేశాను.

అప్పుడు అన్పించింది స్వామి కరుణకటాక్షం నామీద ఉన్నందువలన నాకు నిద్రలేపి ఇలా చెప్పాడు అని అను కున్నాను. అప్పుడు స్వామికి మనస్ఫూర్తిగా నమస్కరించాను. ఎంతగానో సంతోషపడ్డాను.



కళలు

08-01-2026న త్యాగరాజస్వామి ఆరాధన సందర్భంగా...

# సంగీతరసామృతం

- శ్రీ ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్, 98490 13002

దైవయోగాలలో సంగీతజ్ఞానం ఒకటి. "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః" అంటారు పెద్దలు. సంగీతాన్ని పసివారు,గోసముహాలు, సర్పాలు కూడా విని తన్మయత్వం పొందడం జరుగుతుందని సంగీత విద్వాంసుల ఉవాచ. సంగీతం ఆస్వాదించడానికి, ఆనందించడానికి ఎటువంటి అర్హతలు, అంతరాలు లేవంటారు విజ్ఞానులు.

సంగీతం శరీరానికి బలం, ఆరోగ్యాన్ని ఇచ్చే మందు అని ప్రముఖకవి షేక్స్పియర్ భావన, సంగీతం కాన్సర్ వంటి అనేక దీర్ఘకాలిక మహమ్మారులను నెమ్మదింపజేస్తుందని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.

సంగీతం సాధనంగా భక్తిమార్గంలో భగవంతుని కీర్తించి, రామదాసు, త్యాగ రాజు, మీరాబాయి, తాళ్ళపాక అన్నమా చార్యులువంటి మహాభక్తులు భగవంతునితో తాదాత్మ్యం పొందారు. శ్రీ ముత్తుస్వామి దీక్షితార్, ప్రస్తుత తమిళనాడులోని ఇట్టయా పురంలో, తన స్వీయరచనలో రూపొందించిన "ఆనందా మృతాకర్షిని అమృతవర్షిని" అన్న కీర్తన "అమృతవర్షిని రాగం"లో ఆలపించినపుడు వర్షం పడిందని చరిత్రకారులు అంటారు.

అక్బర్ ఆస్థానంలో తాన్సేన్ అనే సంగీత కళాకారుడు ఉండేవాడు. ఆయన తన సంగీతంతో చిత్రాలు గీయగలిగే వారనీ, వర్షం తెప్పించేవారనీ, దీపక్‌రాగాన్ని ఆలపించి అగ్నిని జ్వలింపజేసేవారనీ ప్రసిద్ధి. ఆయన ఏదైనా సంధ్యారాగం



**శిశువు తల్లిగర్భంలో ఉండగానే శబ్దాలు గ్రహించే శక్తి కలిగి ఉంటుందని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. శిశువు మాతృగర్భంలో ఉండగా ప్రప్రథమంగా వినే శబ్దాలు లయబద్ధమైన తల్లి హృదయస్పందన, ఉచ్ఛ్వాసనిశ్వాసాలు, తల్లి మాట్లాడే మాటలు. అప్పటినుండే శిశువు తన తల్లి గాత్రాన్ని గుర్తుంచుకుంటుంది. శిశువు బయటకు వచ్చిన తరువాత కూడా తల్లి గొంతుని చక్కగా, సులభంగా గుర్తుపడుతుంది.**

**తల్లి పలికే ప్రతీమాట సంగీతధ్వనిలాగే శిశువుకి అనిపిస్తుంది. తల్లి పాడే జోలపాట, శాస్త్రీయం, లలితసంగీతం, జానపదం ఏదైనా సరే శిశువు వీనులకు వినసొంపుగా ఉండి, మనస్సుకు హాయినిచ్చి, నిద్రపుచ్చుతుంది. ఆ మహత్తు తల్లి లాలి పాటలో దాగి ఉంటుంది.**

**ఆ విధంగా ప్రతి శిశువుకు అత్యంత చిన్నతనంలోనే సంగీతంతో పరిచయం ఏర్పడుతుంది. సంగీతంతో మేఘం వర్షిస్తుంది. అగ్ని ప్రజ్వలిస్తుంది. సంగీతం మంచి ఆరోగ్యాన్ని, గొప్ప జీవచైతన్యాన్ని ఇస్తుంది. మనస్సుకి హాయినిస్తుంది. మనోవ్యధనుంచి ఉపశమనం కలుగుతుంది. మనల్ని భావాతీతస్థితికి పయనింపజేస్తుంది.**



తల్లిపాడే జోలపాటతోనే కదా మనమింత పెద్దవాళ్ళమయ్యాం. తల్లిని మించిన దైవమున్నదా మరి



ఆలపిస్తే సూర్యునికాంతి తగ్గేదనీ, సాయం ఛాయలు అలుము కునేవని అంటారు.

శ్రీరామభక్తుడైన, త్యాగరాజు ఆయనపై ఎన్నో కీర్తనలు ఆలపించారు. ఒకసారి త్యాగరాజు తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి వెళ్లారట. ఆ సమయానికి స్వామికి తెరలు వేసి ఉంచారట. ఆయన కోరినా పూజారులు తెరను తీయలేదట. అప్పుడు త్యాగరాజు గౌళిపంతురాగంలో "తెరతీయగరాదా నాలో తెరతీయగ రాదా" అనే కీర్తనని ఆలపించారట, ముందున్న తెర తీసి స్వామి దర్శనభాగ్యం కలిగించమనీ, అలాగే తనలోని అంధకారతెరలు తొలగించమనీ వేడుకున్నాడు త్యాగరాజు. తత్క్షణం తెరలు తొలగిపోయి శ్రీవేంకటేశ్వరస్వామి త్యాగరాజుకి దర్శనం ఇచ్చారట. ఈ ఉదంతంతో సంగీతాని కున్న ప్రాశస్త్యం ప్రస్ఫుటిస్తుంది.

నేడు సంగీతంను వైద్యశాస్త్రంలో కూడా విరివిగా వాడు తున్నారు. సంగీతంవలన మెదడులో అంతవరకు అస్తవ్యస్తంగా ఉన్న రసాయనాల ఉత్పత్తి కుదుటపడి సమతుల్యంగా మారు తుందనీ, అప్పుడు మెదడు ఆరోగ్యవంతమై శారీరక, మానసిక ఆరోగ్యాలు మెరుగుపడతాయని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. ముంబాయిలో కొంతకాలంక్రితం ఒక వ్యక్తికి పక్షవాతం వచ్చిందట. అంతకుముందు ఆయన సంగీత కార్యక్రమాలలో తరచుగా పాల్గొంటూ ఉండేవాడట. డాక్టర్ ఆయనను పరీ క్షించి ఆయనకు సంగీతవైద్యం సరియైనదని నిర్ణయించాడు. ఆయనకు మందులతోపాటు చక్కని సంగీతం తరచుగా విని పించేవాడు. కొంతకాలానికి విచిత్రంగా ఆ వ్యక్తి మాట్లాడడం ప్రారంభించడం మాత్రమే కాక పాటలు పాడడంకూడా ప్రారంభించాడు. అదీ సంగీతానికున్న గొప్పతనం.

మన ప్రాచీనసంగీతం భక్తిప్రధానమైనది. త్యాగరాజు కీర్తనలో ఉన్న భక్తిభావం, బిస్మిల్లా సహ్నాయిలో ఉన్న అద్భుతం, మీరాబాయి పాటలలో ఉన్న మాధుర్యం, హరిప్రకాష్ చౌరస్యా వేణుగానంవలన కలిగే వింత హాయి మాటలకు అందనిది. సంగీతానికి స్పందించే హృదయానికి మాత్రమే అర్థం అవు తుంది. సంగీతం భాష, ఎల్లలు, సరిహద్దులు, సంకుచిత స్వభావాలు లేవని తెలియచెప్పేది. అందుకే సంగీతం మహా న్వితం. మానవులకు లభించే రసామృతం.



ధారావాహిక




*(గత సంచిక తరువాయి భాగం...)*

ధాన్యాగారం తు పూర్వస్మిన్ దిశి దేవస్య కారయేత్.

(భగవంతుడు తూర్పుదిక్కున ధాన్యాగారము నిర్మింప వలయును.)

అనినచొప్పున ఒక ధాన్యాగారము కట్టించి, ఇరు ప్రక్కల రెండు ఆభరణాగారములు నిర్మింపజేసి వీనిచుట్టు ఒక శ్రీప్రాకారము, శ్రీగోపురమును కట్టించి శ్రీగోపురమందు స్వయం వ్యక్తమైన శ్రీసుదర్శనభగవానుని సేవారాధనలకు యోగ్యములగు నట్లు పైవైపు మండపము, క్రిందివైపు మండపమును, కట్టించి, వారికి ఆరాధన జరుపుటకును శ్రీగోవిందరాజస్వామికి వృషభ మాస మహోత్సవానంతరము శైత్యోపచారార్థమై దోలోత్సవము జరుపుటకు తగినట్లుగ శ్రీగోపురద్వారమందు ఒక 'ఉతియడి' (ఉట్టిపట్టుకొనుట) మండపమును కట్టించి, భూపాలుడగు అచ్యుతరాయల కైంకర్యముగా వేరొక 'ఉతియడి' (ఉట్టికొట్టెడి) మండపమునుగూడ (కందాడై రామానుజఅయ్యంగారు) నిర్మింప జేశారు.

పూర్వకాలమున పాండ్యదేశాధిపతియైన రంగభూపాల రాయలు గంగాస్నానము చేయవలెనని సంకల్పించి ఉత్తర దిశాభిముఖముగా దిగ్విజయము చేయవలెనని అనేకసామంత రాజులను జయించి తిరుమలకు వచ్చి శ్రీవేంకటాచలపతిని సేవించి సంతుష్టుడై, పుణ్యక్షేత్రమగు వేంకటాచలముపై జయ స్తంభము నాటించి ఈచోట విష్ణుప్రతిష్ఠ చేయవలెనని స్థలవాసు లగు పెద్దలను విచారింపగా, వారు-

వైకుంఠా దాగతత్వాచ్చ వైకుంఠా స్మృతః.

(వైకుంఠలోకమునుండి వచ్చియుండుటచేత ఈ కొండ వైకుంఠాద్రి యనబడుచున్నది.)

అని ఈ తిరుమల క్షేత్రమాహాత్మ్యమున 'శ్రీవైకుంఠము' అని యుండుటవలన ఈ క్షేత్రమునందు మానుషమైన విష్ణుప్రతిష్ఠ ఉచితము కాదు.

శేషాచలస్య పరితః క్రోశమాత్రం తు భూతలమ్,
శేషాచలైకదేశేన ప్రథితం మునిసేవితమ్.

(ఈ శేషాద్రికి చుట్టుప్రక్కల క్రోసెడు పరిమితిగల భూతలము ఋషిసేవితమై శేషాచలముయొక్క ఏకదశమనియే (అందే చేరినదని) ప్రసిద్ధమైనది.)

అని స్కాందపురాణమున క్షేత్రమాహాత్మ్యమునందలి సువర్ణముఖరీ మాహాత్మ్యమున తిరుమలకు అన్నివైపుల తిరుమలను అన్నివైపుల పరివేష్టించియున్న ఒక క్రోసెడు భూభాగము తిరుమలయే యని యుండుటవలన తిరుమల యడివారమునందు విష్ణుప్రతిష్ఠ చేయించుము" అనగ పాండ్య రాజు విని సంతుష్టుడై తిరుమల యడివారమునకు వచ్చి ఒక క్రోసుదూరమునందు ఒకకోవెల కట్టించి తన కభీష్టుడైన కోదండధారియగు చక్రవర్తికుమారుని (శ్రీరామచంద్రుని) సీతాలక్ష్మణులతోబాటు-

ముముక్షుః ప్రాఙ్ముఖం దేవం ప్రతిష్ఠాప్యార్చయే ద్ధరిమ్.
దక్షిణాశాముఖం దేవం సంతానార్థీ సమర్చయేత్.
పశ్చిమాభిముఖం దేవం జయార్థీచార్చయే ద్ధరిమ్.
ఉత్తరాభిముఖం దేవం జ్ఞానార్థీ సమ్యగర్చయేత్.
గ్రామదేవాభిముఖ్యేన గృహదేవం సమర్చయేత్.

(మోక్షార్థియగు భక్తుడు శ్రీమన్నారాయణుని ప్రాగ్దిశాభి ముఖముగా ప్రతిష్ఠింపజేసి యారాధింపవలెను. సంతానార్థి యగువాడు దక్షిణదిగభిముఖముగనున్న దేవుని పూజింపవలెను. జయము నపేక్షించువాడు పశ్చిమదిగభిముఖుడైన శ్రీహరిని అర్చింపవలెను. జ్ఞానము నభిలషించువాడు ఉత్తరాశాభిముఖుడైన దేవుని చక్కగా పూజింపవలెను. గృహదేవుని గ్రామదేవున కభి ముఖము గావించి యర్చింపవలెను.)

అనెడు శాస్త్రముచొప్పుననే పశ్చిమాభిముఖ శ్రీముఖము గాను, శ్రీవేంకటాచలపతికి అభిముఖమగునట్లును శ్రీప్రతిష్ఠ చేయించెను. ఆ స్వామి చిరకాలస్థాయి యగుటచేత భూమిపెరిగి (ఎత్తై) కోవెలపల్లములోనుండుట గుర్తెరిగి, వారు సవర్ణులగుట చేత (క్షత్రియులు) విశేషమైన అభిమానమేర్పడగా వారిని ఉన్నత స్థలమునందు విజయము చేయింపవలెనని చింతించి చలనము కలిగించి పూర్వస్థానమునందే గోపురప్రాకారమండపాదులతో బాటు కోవెల కట్టించి శ్రీప్రతిష్ఠ చేయించి, శ్రీకులశేఖర ప్పెరుమాళ్ తిరుమలకొండయే పరమప్రాప్యమని తలచి 'ఊనేఱు శెల్వమ్' అనెడి తిరుమొళిని (గీతమును) అనుసంధించుటవలనను తమ (క్షత్రియ) వర్ణమే యగుటవలనను గోపుర ప్రాకార మండపములతోడ గుడి కట్టించి కోదండరాముని సమీపమున తిరుమలకొండను, శ్రీవేంకటాచలపతిని మంగళాశాసనము చేసికొనుచునుండునట్లు పడమటివైపుగ శ్రీముఖమండల ముండునట్లు శ్రీప్రతిష్ఠ చేయించి, శ్రీగోవిందరాజస్వామి దివ్యైశ్వర్యమునకును, దివ్యమహోత్సవమునకును అనుగుణముగ బలిహరణ వీథియగు శ్రీవీథిని వలయాకారముగ చేసి, భగవ ద్రామానుజుల సన్నిధియందు అప్పుడున్న అనంతుని (ఆది శేషుని) కోపము శమించునట్లుగ ఒకదివ్యనగరమును గరుడ వ్యూహముగ నిర్మింపజేసి మార్యాదాస్థలమునకు లోబడునట్లుగ పెద్ద రాజవీథిని నిర్మింపజేసినాడు (రంగభూపాలుడు).

**నగరస్య తు వాయవ్యే దిగ్ప్రదేశే సమస్థలే,**
**పుణ్యవీథీం ప్రకుర్వీత ప్రజానా మభివృద్ధయే.**

(నగరమునకు వాయువ్యదిగ్భాగమున సమతలము నందు ప్రజలయభివృద్ధికొరకై విపణవీథిని (అంగడివీథిని) నిర్మింపవలెను.)

అన్నట్లుగ దివ్యనగరమునకు వాయవ్యదిక్కునందు సర్వ జనాభ్యుదయమునకు అనుకూలముగ అంగడివీథిని నిర్మింపజేసి, వీరి కాలమునకు ముందుగా నరపతియైనవాడస్తమింపగా దేశ మరాజకమై తిరుమల తిరుపతి స్థలాభిమానులగు జియ్యరులు, శ్రీవైష్ణవులు, ఆచార్యపురుషులువైఖానసులు ఎల్లరును స్వస్థలములు వదలి మరుగునపడియుండగ, అప్పుడు కాళహస్తి శైవులు తిరుపతికి వచ్చి దేశాధిపతితోడ ఈ తీర్థము కపిలేశ్వర తీర్థమని పురాణమందుండుటవలనను కపిలేశ్వరుడు తీర్థరాజు అని ప్రసిద్ధియుండుటవలనను ఇది శైవతీర్థమని ప్రసంగము చేసినపుడు ఏకాంగి నారాయణయ్యంగారనువారు స్థలాభి మానముచేత బయటపడి రాజాస్థానమునెక్కి క్షేత్రమాహాత్మ్య వచనములను ఉద్ధరించి విస్తారముగా రాజసన్నిధానమునం దుపన్యసించి ఈ తీర్థము విష్ణుతీర్థమేయని నిర్వహింపగా, శైవజనులను శిక్షించి తరిమివేసి నాలుగు దిక్కులందును చక్ర శిలలను నాటించి కపిలేశ్వర సన్నిధానమునందును చక్రశిలను నాటి, భవిష్యత్కాలమందుకూడ ఇట్టి ఉపద్రవము కలుగకుండు లాగున విష్ణువును, విష్ణుభక్తులను ప్రతిష్ఠ చేయింపవలెనని నిశ్చయించి తొండమాన్ చక్రవర్తి శ్రీవేంకటాచలయాత్ర చేసిన మార్గమందు గుహామధ్యమందు ప్రతిభటనిరసనసమర్థులైన సుందర నరసింహస్వామిని, వారి సమీపమందు లక్ష్మీనారా యణస్వామిని, ఆ స్థలమునకు ఆళ్వారుల మూలవిగ్రహము లేనందున తీర్థతీరమందు అభేద్యమగునట్లుగ గోపుర ప్రాకార మండపములతోడ దేవాలయము నిర్మించి తిరుమలకొండను, శ్రీవేంకటాచలపతిని మంగళాశాసనము చేయునట్లుగ పశ్చిమాభి ముఖ శ్రీముఖమండలముగ శ్రీప్రతిష్ఠ చేయించి, శ్రీగోవింద రాజస్వామివారి సన్నిధియందు విజయముచేసి ఉత్సవవిగ్రహ ముగ నున్న ఆళ్వారులను తీర్థతీరమందు మూలవిగ్రహముతోడ విజయము చేయించి ఆళ్వార్ తీర్థమని తీర్థమునకు నామ ధేయము పెట్టి, శ్రీగోవిందరాజస్వామివారి అధ్యయనోత్సవాదు లకును విజయము చేయునట్లు కట్టడచేసి, ఈ ఆళ్వారు తీర్థమునందు గోవిందరాజస్వామివారి ఉత్సవకాలములందు అవ బృథము జరుపుటకును కార్తికమాసమందు వనభోజనోత్సవము, తీర్థాభిగమనోత్సవము కొండాడునట్లును మేష (చైత్ర) మాస పూర్ణిమనాడు స్వర్ణముఖీనదియందు తాము త్రవ్వించిన 'తిరు పూఱల్' (శైత్యోపచారము) ఉత్సవము జరిపించుటకును భూపాలుడు కట్టడ చేసినాడు.

(ఇంకా ఉంది)

దేవుడికే ఇన్ని సమయాచారములు పాటిస్తున్నపుడు మనం కూడా మన జీవితాల్లో అవి పాటించాలి కదా



తిరుపతి

## శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం

2026, ఫిబ్రవరి 07 నుండి 17 వరకు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 07-02-2026 | శని | -- | మూషికవాహనంపై వినాయకస్వామి, అంకురార్పణం |
| 08-02-2026 | ఆది | (పల్లకీఉత్సవం) ధ్వజారోహణం | హంసవాహనం |
| 09-02-2026 | సోమ | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 10-02-2026 | మంగళ | భూతవాహనం | సింహవాహనం |
| 11-02-2026 | బుధ | మకరవాహనం | శేషవాహనం |
| 12-02-2026 | గురు | తిరుచ్చిఉత్సవం | అధికార నందివాహనం |
| 13-02-2026 | శుక్ర | వ్యాఘ్రవాహనం | గజవాహనం |
| 14-02-2026 | శని | కల్పవృక్షవాహనం | అశ్వవాహనం |
| 15-02-2026 | ఆది | రథోత్సవం | నందివాహనం (మహాశివరాత్రి) |
| 16-02-2026 | సోమ | పురుషామృగవాహనం | కల్యాణోత్సవం, తిరుచ్చిఉత్సవం |
| 17-02-2026 | మంగళ | సూర్యప్రభవాహనంలో నటరాజస్వామి త్రిశూలస్నానం | ధ్వజావరోహణం, రావణాసురవాహనం |




శ్రీనివాసమంగాపురం

## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం

2026, ఫిబ్రవరి 07 నుండి 16 వరకు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 07-02-2026 | శని | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 08-02-2026 | ఆది | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 09-02-2026 | సోమ | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 10-02-2026 | మంగళ | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 11-02-2026 | బుధ | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 12-02-2026 | గురు | పల్లకీలో మోహినీఅవతారోత్సవం | గరుడవాహనం |
| 13-02-2026 | శుక్ర | హనుమద్వాహనం | సా॥వసంతోత్సవం, గజవాహనం |
| 14-02-2026 | శని | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 15-02-2026 | ఆది | రథోత్సవం | అశ్వవాహనం |
| 16-02-2026 | సోమ | పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |



సమయానికి విలువనివ్వనివారు తమ జీవితాలు కూడా అస్తవ్యస్తంగానే అనుభవించాల్సి వస్తుంది




# ఓర్పుతోనే మహాయోగమొస్తుంది!!

- శ్రీమతి అసూరిఉషారాణి, 94416 46016

ఒక బాటసారి దారిలో వెళ్తుంటే రెండు రాళ్లు అక్కడ కనిపించాయి. వెంటనే ఆతనికి ఒక ఆలోచన వచ్చింది. అతను ఒక గొప్ప శిల్పి.

అతను మొదటి రాయి దగ్గరికి వెళ్లి "నిన్ను ఒక అందమైన శిల్పంగా మలుస్తాను" అన్నాడు. అందుకు రాయి "అమ్మో నీ ఉలి దెబ్బలు తట్టుకోలేను మహానుభావా" నేను ఇలాగే ఉంటాను అని మిన్నకుండిపోయింది.

సరేనంటూ అతను రెండవ రాయి దగ్గరకెళ్ళి "నిన్ను అందమైన శిల్పంగా మలుస్తాను. కాకపోతే ఉలిదెబ్బలు తినాల్సి వస్తుంది సరేనా" అన్నాడు.

ఆ రాయి తెలివిగా ఉలిదెబ్బలు తిన్నా ఫర్వాలేదు. ఒక అందమైన దేవుడివిగ్రహంలా తయారుచేస్తావా? అని వేడుకున్నది. సరేనంటూ అతను మహావిష్ణువిగ్రహంగా ఆ రాయిని మలిచాడు.

"పాపం ఎన్ని దెబ్బలు తిన్నావో కదా?" అని పక పక నవ్వింది మొదటి రాయి. కొద్దిరోజులకు ఆ మార్గాన రాజుగారు వస్తూ దేవుడి శిల్పాన్ని, ఆ ప్రక్కనున్న రాయిని చూశాడు. దేవుడి శిల్పం మహావిష్ణురూపంతో ఉండటంతో ఇక్కడ గుడి కట్టిస్తే బాగుంటుంది కదా! అని రాజు గుడి కట్టించారు. పూజలు అందుకుంటూ అద్భుతంగా మెరిసిపోతోంది ఆ దేవుడి రూపంలో ఉన్న రాయి.

పక్కనే "ఉలి దెబ్బలు నేను తట్టుకోలేను" అన్న రాయిని కొబ్బరికాయ కొట్టే రాయిగా భక్తులు వాడుకుంటున్నారు. అప్పుడు కొబ్బరికాయ దెబ్బలు తింటున్న ఆ రాయి విష్ణుమూర్తిరూపంలో ఉన్న రాయిని చూసి వెక్కివెక్కి ఏడ్చింది.

"చూశావా! నేను కొద్దిగా ఉలిదెబ్బలు తిన్నా పర్లేదు అని నువ్వు ఎంతగానో ఓర్చుకుని మహావిష్ణురూపంగా అవతరించావు. నేను ఆ కొద్ది దెబ్బలు తినలేనంటూ అలాగే వదిలెయ్యమన్నాను, నీవేమో పూజలందుకుంటున్నావు. ఇప్పుడు జీవితాంతం నేను భక్తులు కొబ్బరికాయలు కొట్టే రాయిగా ఉన్నాను అంటూ వాపోయింది. అది విని దేవుడివిగ్రహం చిరునవ్వు నవ్వి ఊరుకుంది.

**నీతి:** *అందుకే మనం ముందు కొంచెం కష్టపడితే తర్వాతి మన భవిష్యత్తు ఎంతో బాగుంటుంది. అలాగే జీవితంలో ఎన్ని కష్టాలొచ్చినా ఓర్చుకుంటే ఆ తర్వాత మహాయోగమొస్తుందన్నదే పై కథానీతి.*



చిత్ర కథ

# ధర్మ సూక్ష్మం!!

కథ - మొలకా ఉత్తరఫల్గుణి
తమిళమూలం- శ్రీమతి శ్రీనిధి
చిత్రాలు- శ్రీ కమల కణ్ణన్




**నీతి:** 'జాతస్య మరణం ధృవమ్' అని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు పుట్టినవాడు గిట్టక తప్పదు. కాబట్టి, మరణాన్నికూడా మనం ఆనందంగా ఆహ్వానించాలి. భగవంతునిసన్నిధికి సంతోషంగా చేరుకోవాలి అనేదే పై కథానీతి.

చిత్ర కథ

# పశ్చాత్తాపం!!


కథ - మొలకా ఉత్తరఫల్గుణి
తమిళమూలం - శ్రీమతి శ్రీనిధి
చిత్రాలు - శ్రీ కమల కణ్ణన్





**నీతి:** పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదు కదా! ఏ సమయంలోనూ, ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ ఇతర ప్రాణులను తక్కువచేసి హింసపెట్టకుండా అందరిపై ప్రేమను, దయను కల్గి ఉండాలన్నదే పై కథానీతి.

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



## ఇష్టంగా పెడితేనే తినాలి

నేయి లేనికూడు నీయాన కస వది;
కూర లేనితిండి కుక్కతిండి;
ప్రియము లేనికూడు పిండపుకూడురా!
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** నీ+ఆన= నీ సాక్షి; కసవు= గడ్డి; పిండము+ కూడు= చచ్చినవాళ్లకి పెట్టేతిండి.

**భావం:** స్వామీ! నీవే సాక్షిగా చెబుతున్నా. నెయ్యి లేని భోజనం కసవుతో సమానం. కూర లేని భోజనం కుక్కతిండి అవుతుంది. ప్రేమతో పెట్టని భోజనం చచ్చినవారికి పెట్టే "పిండాకూడు" అవుతుంది.

**వివరణ:** ఎవరికైనా భోజనం పెట్టేఅవకాశం వస్తే, దాన్ని అదృష్టంగా భావించాలి. దానం పుచ్చుకునేవాడే లేకపోతే, దాత అనేవాడికి ఉనికే ఉండదు కదా. అన్నంలో నెయ్యి వేయాలి. నెయ్యివల్ల అన్నం పవిత్రమవుతుంది. అంటే తగని పదార్థాలతో భోజనం పెట్టగూడదు. అలా పెట్టినది గడ్డి అవుతుంది. పవిత్రతతోపాటు రుచి కూడ ఉండాలి. రుచికరమైన, పదార్థాలనే పెట్టాలి. పెట్టవలసివచ్చిందే అని పనికిరాని వస్తువులతో పెట్టగూడదు. పవిత్రత, రుచి అనేవాటితోపాటు ఆప్యాయంగా వడ్డించాలి. ఉన్నంతలో తృప్తిగా పెట్టాలి. శుద్ధమైన మనస్సుతో పెట్టిన భోజనం తిన్నవారికి ఇష్టసిద్ధి కలిగిస్తుంది. ఏ దానంలోనయినా, ఈ విధంగా ఉన్నతనియమాలను పాటించినపుడే ఆ దానం సార్థకం.

*– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు*

గ్రంథసమీక్ష

## ఏకైక తొలి సవ్యాఖ్యానం- యోగతారావళి రాజతరల

రచయిత-ఇంగువ రామస్వామి పండిత; సైజు- 1/8 డెమ్మీ; పేజీలు- 160; మూల్యం-రూ. 200/-; ప్రతులకు- యం.యస్. ఆర్.మెమోరియల్ యోగసిరీస్, ఆర్తమూరు, మండపేట మండలం, డా॥బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమజిల్లా-533 340. సెల్: 94406 84372.

ఆదిశంకరాచార్యకృత యోగతారవళిలో 28 శ్లోకాలు. పేరు రాజతరల. దీనికి ఏకైక వ్యాఖ్య వ్రాసింది ఇంగువ రామస్వామి పండిత. కీ.శే.1790-1890 భాష్యం తెలుగు లిపి అయినా సంస్కృతమూలం. ఈ గ్రంథంలో సంస్కృతశ్లోకాలకు తెలుగుపద్యాలను వాదరూపంకూడా ఉన్నది. సామాన్యుడు కూడా దీని సారం తెలుసుకోవడానికి ఈ ఇనిస్టెంట్ యోగ శీర్షిక చేర్చారు.

యోగసాధకులకు ఈ తారావళి వ్యాఖ్యవలన సంసారం మధ్య చిక్కుకొన్నవారికి అడ్డదారిలో వేదాంతయోగద్వారా ఒడ్డుకు చేరుతారు.

వ్యాఖ్యానం ఆమూలాగ్రంశాస్త్రవిషయాలను సరళ సంస్కృత శబ్దాల వివరణలతో కఠినతరమైన, రహస్యమయమైన తారావళి గ్రంథానికి రామస్వామి పండితులు చక్కని వ్యాఖ్యానం చేసి యోగోపాసకులకు జ్ఞానభిక్ష పెట్టారు.

ఇంగువ రామస్వామి పండిత టీకా "రాజతరల" ఒక అపురూపం. అరుదైనది. తరతరాల సంప్రదాయాలను జోడించి, విభిన్నకోణాలలో విభిన్నప్రాంతాలనుండి తెచ్చిన ఈ యోగ తారావళి తొలి సమీక్షాత్మకప్రతి (క్రిటికల్ ఎడిషన్) ఇదే. సంస్కృత-హింది. ఆంగ్ల మరియు తెలుగుభాషల్లో నేటివరకు ప్రచురితమైన యోగతారావళిలను పోల్చి తెచ్చిన గ్రంథం ఇది. యోగసాధన చేసేవారికి ఉపయుక్తమైన గ్రంథం.

*– శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు.*

# క్విజ్ 42

01) ధర్మరాజుకు ధర్మనీతులు బోధించినవారు? జ)........................

02) మకరసంక్రాంతికే మరో పేరు? జ)........................

03) సూర్యుడికి మరోపేరు? జ)........................

04) చాణక్యుడి తండ్రి? జ)........................

05) 'అర్థశాస్త్రం' రచయిత? జ)........................

06) గోవిందగోవిందయని కొలువరే కీర్తన కవి? జ)........................

07) ధర్మనార్యుని తండ్రి? జ)........................

08) ఏకైక మహిళా ఆళ్వారు? జ)........................

09) 'గడప' స్వామి? జ)........................

10) 'ఏకాగ్రత'తో పక్షికంటిని ఛేదించినవాడు? జ)........................

11) 'ఓర్పు' కల్గి ఉండడం ఏ ధర్మం? జ)........................

12) 'తెరతీయగరాదా' సంకీర్తన కవి? జ)........................

13) 'ఓర్పు'తో ఏమొస్తుంది? జ)........................

14) తిరుమలపై సాహిత్యవర్ణన చేసిన కవి? జ)........................

15) అన్నం పవిత్రత దేనివల్ల వస్తుంది? జ)........................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-01-2026**.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: ........................ వయస్సు: ................

పాఠశాల: ........................ తరగతి: ................

పేరు: ........................................

చిరునామా: ........................................

........................................

........................................

........................ పిన్‌కోడ్: ................

ఫోన్ సంఖ్య: ........................................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

## చతుర్దశ రసమూర్తులు

01) భక్తిరసము - సనకాది మహాయోగీంద్రులు
02) దాస్యరసము - హనుమంతుడు
03) సఖ్యరసము - సుగ్రీవుడు
04) వాత్సల్యరసము - కౌసల్యాదశరథులు
05) మధురరసము - సీతాదేవి
06) శృంగారరసము - గోపికలు
07) హాస్యరసము - గోపాలబాలకులు
08) కరుణరసము - దశరథుడు
09) రౌద్రరసము - ఇంద్రుడు
10) వీరరసము - భీష్ముడు
11) భయానకరసము - కంసుడు
12) బీభత్సరము - అఘాసురుడు
13) అద్భుతరసము - అర్జునుడు
14) శాంతరసము - అక్రూరుడు





పాపం లేగదూడ తన తల్లి ఆవునుండి అడవిలో తప్పిపోయింది. తిరిగి తన తల్లి వద్దకు వెళ్ళేందుకు దారి చూపండి.



## జతపరచండి



నవగ్రహాలకూ తల్లులున్నారు. వీరి పేర్లు క్రింద ఇవ్వబడ్డాయి. ఆ యా గ్రహాలకు వారి వారి తల్లుల పేర్లు జతపరచండి..!

| | |
|---|---|
| 01) సూర్యుడు | అ) సింహిక |
| 02) చంద్రుడు | ఆ) సింహిక |
| 03) కుజుడు | ఇ) ఛాయ |
| 04) బుధుడు | ఈ) ఉష |
| 05) గురుడు | ఉ) తార |
| 06) శుక్రుడు | ఊ) తార |
| 07) శని | ఋ) భూమి |
| 08) రాహువు | ఋూ) అనసూయ |
| 09) కేతువు | ఎ) అదితి |



జవాబు:
1)ఇ 2)ఋూ 3)ఋ 4)ఈ
5)ఉ 6)ఊ 7)ఆ 8)అ 9)ఎ

## రంగులేద్దాం





పై చిత్రాన్ని చూసి రంగులు వేయండి

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం–** కుటుంబసభ్యుల శ్రేయస్సును కాపాడతారు. ఓర్పు, సహనంతో ఉండి సమయానికి తగిన చురుకైన పాత్రవహించి కృతకృత్యులవుతారు. అదృష్టం కలసివస్తుంది. అధికారం మీ హస్తగతం అవుతుంది.

**వృషభం–** వృత్తివ్యాపారాలలో అధికాదాయాన్ని సంపాదిస్తారు. అత్యంత సుఖమయజీవనాన్ని ఆస్వాదిస్తారు. చేతికి వచ్చిన పంట అమ్మి ధనం నిల్వ చేస్తారు. దూరప్రయాణాలు చేస్తారు.

**మిథునం–** వృత్తిపరంగా ప్రమోషన్ లేదా వ్యాపారంలో లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రయోజనం చేకూర్చే కొత్త ఆదాయ వనరులను ఆస్వాధిస్తారు. ప్రాపంచికసుఖాలను కలిగి ఉంటారు.

**కర్కాటకం–**దీర్ఘకాలిక లక్ష్యాలను తొందరగా పూర్తిచేస్తారు. సభలలో అద్భుతంగా ప్రసంగించి అందరినీ ఆకట్టుకుంటారు. వృత్తి వైవిధ్యాన్ని ప్రదర్శిస్తారు.

**సింహం–** శత్రువర్గాన్ని నిర్వీర్యం చేస్తారు. సంపదలు, కీర్తి కలుగుతాయి. స్నేహితులకు ప్రయోజనకారిగా ఉంటారు. శరీరంలో స్వస్థత, చైతన్యం కనబడుతుంది.

**కన్య–** నిత్యనూతనంగా ఆలోచించి పరిశోధనలలో విజయం సాధిస్తారు, పనిచేసేచోట క్రిందివారిని ఆకట్టుకుని వారిని ప్రగతిపథం, లక్ష్యసాధనవైపు మరల్చగల్గుతారు. ఆదర్శవంతమైన జీవనం కలుగుతుంది.

**తుల–** ఆరోగ్యం పుష్కలంగా ఉంటుంది. మృష్టాన్నభోజనం చేస్తారు. బంధుమిత్రుల సమాగమం. ధైర్యం, ప్రణాళికతో కార్యనిర్వహణ చేస్తారు. విద్యార్థులకు మంచి అవకాశాలు వస్తాయి.

**వృశ్చికం–** తలపెట్టిన పనులు సకాలంలో పూర్తి ఆగుట, ధైర్యంతో వ్యవహారజయం, ఉద్యోగవిషయాలలో ముందంజ, అన్ని వృత్తులవారికి జీవనవృద్ధి, వ్యక్తిగతలాభం, స్థాయి పెరగడం, పుష్కలమైన ఆరోగ్యం ఉంటుంది.

**ధనుస్సు–** ఈ రాశికి ఎదురులేని ఆకర్షణ, బలమైన సౌందర్యం కలిగి ఉంటారు మరియు ఇతరులను ప్రభావితం చేయగల సత్తా కలిగి ప్రతి విషయంలోనూ కృతకృత్యులవుతారు.

**మకరం–** ప్రయాణాలకు దూరంగా ఉండాలి. మార్గావరోధాలు, ప్రమాదాలు సంభవించవచ్చు. వృత్తివ్యాపారాలలో అధిక ఆదాయం మిమ్ములను వరిస్తుంది. మీ కృషి ఫలాలను అందరికీ పంచుతారు.

**కుంభం–** ఆకస్మిక ధనలాభం కల్గుతుంది. వ్యవహారజయం కల్గుతుంది. వృత్తివ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. అన్ని వృత్తులవారికి ధనలాభం, సంతృప్తి కల్గుతుంది.

**మీనం–** సమస్తదోషాలు తొలగి సకలైశ్వర్యాలు మిమ్ములను వరిస్తాయి. ధనాదాయం బాగా పెరుగుతుంది. అన్నిరకాల సమస్యలను అధిగమిస్తారు. ఆర్థికవృద్ధి కల్గుతుంది.

ఓర్పు, నేర్పుతోనే జీవితానికి బాటలు వేసుకున్నవారికి తప్పక విజయం మనదే!

## తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

______________________
______________________
______________________
(పిన్‌కోడ్ తప్పనిసరి) □□□□□□
సెల్ నెం. □□□□□□□□□□□

**2.** కావలసినభాష :
తెలుగు□ తమిళం□ కన్నడం □
హిందీ □ ఆంగ్లం □ సంస్కృతం□

**3.** సంవత్సరచందా : □ రూ.240/-
జీవితచందా □ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : □ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
.................................................... తేది :..................

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.
2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.
3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.
4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".
5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# శ్రీపదకేళి

120

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | 1 | ■ | ■ | 2 | | | | |
| 3 | | | ■ | | ■ | ■ | ■ | ■ |
| ■ | | ■ | 4 | | | | 5 | |
| 6 | ■ | ■ | ■ | | ■ | ■ | | ■ |
| 7 | | ■ | 8 | | | | ■ | 9 |
| | ■ | 10 | ■ | | ■ | ■ | ■ | |
| ■ | ■ | | ■ | | ■ | 11 | ■ | |
| 12 | | | | ■ | ■ | | ■ | |
| | ■ | | ■ | 13 | | | ■ | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పులాచార్యులు, 90003 24024

**అడ్డం** 2)రామదూత(5); 3)శౌర్యము(3); 4)మాఘ శుద్ధ పంచమి(6); 7)మాఘశుద్ధ ఏకాదశి(2); 8)అసూయ(4); 12)ఈ రోజున శ్రీకృష్ణుడు పుట్టినరోజు(4); 13)వెండి(3)

**నిలువు** 1)మకరసంక్రమణం జరిగినరోజున జరిగే పండుగ(3); 2)జనవరి 1న జరిగే పండుగ(7); 5)శీతాకాలంలో ఇది ఎక్కువ(2); 6)సహదేవుని భార్య(3); 9)మాఘశుద్ధ ఏకాదశిని ఈ మహనీయుని పేరుతో పిలుస్తారు(5); 10)మాఘశుద్ధ అష్టమిని ఈయన పేరుతో పిలువబడుతుంది(4); 11)పశువుల పండుగ(3); 12)ద్రౌపదికి గల మరో పేరు(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D. on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



తిరుచానూరు, శ్రీపద్మావతీదేవి కార్తికబ్రహ్మోత్సవం సందర్భంగా 2025, నవంబరు 20న అమ్మవారి సందర్శనార్థం ఆలయానికి విచ్చేసిన గౌరవనీయులు భారత ప్రభుత్వ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ముగారికి అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్. అందులో పాల్గొన్న గౌరవనీయులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ దేవాదాయశాఖమంత్రి శ్రీ ఆనం రామ నారాయణరెడ్డి మరియు తి.తి.దే. పాలకమండలి సభ్యులు శ్రీ జి.భానుప్రకాష్‌రెడ్డి



తిరుమల శ్రీవారి సందర్శనార్థమై 2025, నవంబరు 21న తిరుమల ఆలయానికి విచ్చేసిన గౌరవనీయులు భారత ప్రభుత్వ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ముగారికి శ్రీవారి శేషవస్త్రం, చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేస్తున్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్. నాయుడు మరియు తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్. అందులో పాల్గొన్న గౌరవనీయులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ దేవాదాయశాఖమంత్రి శ్రీ ఆనం రామనారాయణరెడ్డి, తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్. మరియు ఇతర అధికారులు



తిరుచానూరు, శ్రీపద్మావతీదేవి కార్తిక బ్రహ్మోత్సవసందర్భంగా 2025, నవంబరు 17న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన గౌరవనీయులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ దేవాదాయశాఖమంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి. అందులో పాల్గొన్న తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్. అర్చకులు మరియు ఇతర అధికారులు



తిరుచానూరు, శ్రీపద్మావతీదేవి కార్తిక బ్రహ్మోత్సవంలో పంచమీతీర్థం ఉత్సవం సందర్భంగా 2025, నవంబరు 25న తిరుమల శ్రీవారి ఆలయం తరపున అమ్మవారికి శ్రీవారి సారె సమర్పించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్., అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్., అర్చకులు, అధికారులు మరియు ఇతర ప్రముఖులు



తమిళనాడు, శ్రీవైష్ణవక్షేత్రం శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామివారికి 2025, డిసెంబరు 01న పట్టువస్త్రాలు సమర్పించిన తి.తి.దే.పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు దంపతులు.



తిరుమలలో సేవాసదన్ 2లో 2025, డిసెంబరు 02న నిర్వహించిన శ్రీవారిసేవ 'ట్రెయిన్ ద ట్రైనీస్' శిక్షణా కార్యక్రమానికి విచ్చేసి శ్రీవారి సేవకులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్.

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams Printing on 25-12-2025 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 1st of Every Month.



తిరుమల, శ్రీ మలయప్పస్వామివారి పారువేటఉత్సవం
(16-01-2026)